
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 26-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 191 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50

అర్హులందరికీ రుణమాఫీ అందాలి
రైతు భరోసా ఇవ్వాలి



29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అర్హులైన రైతులందరికీ రూ. రెండు లక్షల వరకు రుణ మాఫీతో పాటు రైతు భరోసాను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి పిలుపునిచ్చింది. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ పథకం అమలు కాకపోవటంతో వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు జరిపిన మాఫీ 50 శాతం మంది రైతులకే వర్తించిందన్నారు. రుణమాఫీ కోసం రైతులు బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. అనేక జిల్లాల్లో ఆధార్, రేషన్ కార్డును గమనంలోకి తీసుకుని రుణమాఫీ చేసినట్టు మంత్రులు ప్రకటించారని గుర్తు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అర్హతలున్న వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయలేదని తెలిపారు. అనేక ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించిందని గుర్తు చేశారు. రైతుల్లో పెరుగుతున్న అశాంతిని నివారించేందుకు తక్షణమే రుణమాఫీ పథకాన్ని అర్హులైన రైతులకు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులను పరిగణనలోకి తీసుకోరాదనీ, రుణమాఫీ జరిగిన వారికి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మరోసారి పోరుబాట
లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 23న బ్లాక్ డే

నవంబర్ 26న దేశవ్యాప్తంగా పోరాట దినం : కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం సంయుక్త పిలుపు



వివరాలు 2లో..

లెబనాన్‌పై బాంబుల వర్షం
యుద్ధ విమానాలతో ఇజ్రాయిల్ దాడి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ఆజ్యం

హిజ్బుల్లా రాకెట్లతో ప్రతీకార దాడి



వివరాలు 11లో..

వెనక్కి తగ్గం
చెరువులు కబ్జా చేస్తే ఎవర్నీ ఉపేక్షించం

- ఎన్ని వత్తిళ్లు వచ్చినా కూల్చేస్తాం
- భవిష్యత్ తరాలకు వాటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



హెరిటేజ్ టవర్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

చెరువుల్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపడితే ఎవర్నీ ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆ అక్రమ కట్టడాల్లో ప్రభుత్వాలను శాసించే వ్యక్తులు ఉన్నారని తెలుసనీ, అయినా తాను వారి ఒత్తిళ్లను పట్టించుకోబోనన్నారు. వరదల నుంచి ప్రజల్ని శాశ్వతంగా రక్షించేందుకు అప్పటి నిజాం నవాబు ప్రముఖ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో గొలుసుకట్టు చెరువులు నిర్మించారని గుర్తుచేశారు. వాటిని అక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చెరువుల్లోకి వెళ్లాల్సిన నీళ్లు రోడ్లపైకి వచ్చి, హైదరాబాద్ వంటి పట్టణాల్లో జనజీవనం అస్తవ్యస్తం అవుతున్నదని వివరించారు. కండ్ల ముందు చెరువులు అన్యాక్రాంతమవుతుంటే, చూస్తూ ఊరుకుంటే ఇక తాను ప్రజాప్రతినిధిగా ఉండి ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. ఇటీవల బెంగుళూరు, చెన్నై, వాయనాడ్ వంటి ప్రాంతాల్లో వరదలు వచ్చినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయో కండ్లారా చూశామనీ, అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రానీయబోనని స్పష్టం చేశారు. హైదరాబాద్ హెరిటేజ్ సిటీ మాత్రమే కాదనీ, లేక్ సిటీ కూడా అని చెప్పారు. ఇటీవల వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు గండిపేట, ఉస్మాన్‌సాగర్ జలాశయాల నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించామనీ, అలాంటి చెరువుల్ని ఆక్రమించి ఫామ్‌హౌజ్‌లు, ఫంక్షన్‌హాళ్లు కట్టి, వాటి డ్రెయినేజీ పైపుల్ని గండిపేట వంటి చెరువుల్లో కలిపితే, చూస్తూ ఎలా ఊరుకుంటామని ప్రశ్నించారు. ఆ చెరువుల్లో నీళ్లునగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న విషయం మర్చిపోతే ఎలాగని అడిగారు. అందుకే హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. తెలిసీ, తెలియక కొన్నిసార్లు తప్పిదాలు జరుగుతాయనీ, వాటిని సవరించుకోవాలే తప్ప, సమర్థించుకోవడం సరికాదన్నారు. తాను చేస్తున్న ఈ యుద్ధానికి భగవద్గీతే స్ఫూర్తి అని చెప్పారు. ధర్మం కోసం యుద్ధం చేయాల్సిందేనని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడనీ, తాను కూడా అలాంటి యుద్ధమే చేస్తున్నానన్నారు. నార్సింగి, కోకాపేటలో గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హెరిటేజ్ ...11లో

డ్రగ్స్ పదం వింటేనే దడపుట్టాలి

మరింత సమర్థవంతంగా నార్కొటిక్స్ టీమ్ ఏర్పాటు : శాంతి సరోవర్ ద్విదశాబ్ది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి 11లో..


హైడ్రా లెక్క ఇది..
43.94 ఎకరాల భూమి స్వాధీనం



18 ప్రాంతాల్లో 166 కట్టడాలు కూల్చివేత పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన రంగనాథ్ 10లో..

హైడ్రా పేరుతో రాజకీయ కుట్ర
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే టార్గెట్

రుణమాఫీ చేయలేక కాంగ్రెస్ డైవర్షన్ డ్రామాలు : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ...11లో

మహిళలపై నేరాలకు కఠిన శిక్షలు
చట్టాలను మరింత పటిష్టపరుస్తాం : ప్రధాని నరేంద్రమోడీ



జల్గావ్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రధాని మోడీ

ముంబయి : మహిళలపై నేరాలకు కఠినమైన శిక్షలు విధించేలా చట్టాలను మరింత పటిష్టపరుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం ఉత్తర మహారాష్ట్రలోని జల్గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ (సంపన్న అక్కలు) ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. మహిళల కోసం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గత ప్రభుత్వాలు చేసిన దానికంటే గత పదేండ్లలో తమ ప్రభుత్వం ఎక్కువ చేసిందని మోడీ అన్నారు. 2014 వరకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.25,000 కోట్ల కన్నా తక్కువ రుణాలు ఇచ్చారని, గత పదేళ్లలో తమ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల సహాయం అందించిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ 2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. ఈ నిధులతో 4.3 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 48 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. లఖ్‌పతి దీదీ పథకం మహిళలకు ఆదాయాన్ని పెంపొందించడమే కాదు, భవిష్యత్ తరాలకు సాధికారత కల్పిస్తోందని అన్నారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, దానిలో స్త్రీలది పెద్ద పాత్ర అని అన్నారు. రెండేండ్ల కిందట పరిస్థితి ఈ విధంగా లేదని అన్నారు.

రైలుకు సవాళ్లు
20 శాతానికిపైగా ఖాళీలు..ఉద్యోగులపై పని భారం

అంతంత మాత్రంగా వేతనాలు

ప్రాథమిక సౌకర్యాల లేమి : ఆర్‌డీఎస్‌ఓ నివేదిక



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైల్వేలో ఖాళీలు, అవసరాలు తీర్చలేని వేతనాలు, ప్రాథమిక సౌకర్యాల లేమీ వంటివి సవాలుగా మారాయని రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌ఓ) స్పష్టం చేసింది. రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఆర్‌డీఎస్‌ఓ అధ్యయనం ప్రకారం రైలు కంట్రోలర్‌లు పనిలో తగిన విధంగా లేని పే స్కేల్ (వేతనాలు), ఖాళీలు, ప్రాథమిక సౌకర్యాల లేమీ వంటి సమస్యలతో సిబ్బందిపై పని భారం, సెలవులపై ప్రభావం, పని నాణ్యతలో లోపం వంటి అనేక సవాళ్లను ఎదురవుతున్నాయని పేర్కొంది. రైల్వే బోర్డుకు సమర్పించిన నివేదికలో సెక్షన్ కంట్రోలర్లు అధిక ఒత్తిడితో ఉద్యోగాలు చేస్తున్నారని, దాదాపు 20 శాతం వరకు ఉన్న ఖాళీలు, మిగిలిన వారిపై భారాన్ని మోపుతున్నాయని తెలిపింది. డిపార్ట్‌మెంట్‌లో పోస్టింగ్ చేసిన అధికారులు స్థాయికి తగిన వేతనం, గౌరవం, కెరీర్ వృద్ధి వంటి ప్రతిఫలాలు పొందలేకపోతున్నారని నివేదించింది. 'సెక్షన్ కంట్రోలర్‌లు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే శీర్షికతో ఈ నివేదిక రైలు కార్యకలాపాల సామర్థ్యం, ప్రభావాన్ని పెంపొందిం చడానికి ఎంపిక విధానం, శిక్షణ, మౌలిక సదుపాయాల్లో మెరుగుద లలను అన్వేషించడం లక్ష్యంగా పెట్టుకుంది.దాదాపు 1,05,555 కిలో మీటర్ల ట్రాక్‌లలో ప్రతిరోజూ వేలాది రైళ్లు వివిధ విభాగాల్లో ప్రయాణిస్తున్న ఇండియన్ రైల్వే ప్రపంచంలోని అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటి అని నివేదిక పేర్కొంది. ఐఆర్ నెట్‌వర్క్‌లో 68 ఆపరేషన్ కేంద్రాలచే నియంత్రించబడు తుందని తెలిపింది. డివిజినల్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న డివిజినల్ కంట్రోల్ ఆఫీస్, రైల్వే నెట్‌వర్క్ మొత్తం ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంది.రైల్వే నెట్‌వర్క్ ...11లో

మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం
సావిత్రీబాయి ఫూలే స్ఫూర్తితో స్త్రీలు ముందడుగు వేయాలి

- అన్నిరంగాల్లోనూ సగానికంటే ఎక్కువే.. అయినా వివక్షే
- ఇంటి నుంచే వారిని గౌరవించడం మొదలుపెట్టాలి : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఏఐఎఫ్ఈఏ ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత-లింగ సమానత్వం'పై సదస్సు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సావిత్రీబాయి ఫూలే స్ఫూర్తితో మహిళలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లోనూ సగానికంటే ఎక్కువే మహిళలు పనిచేస్తున్నప్పటికీ వారిపై నేటికీ వివక్ష కొనసాగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను గౌరవించే సంస్కారాన్ని పిల్లలకు ప్రతి ఇంట్లోనూ నేర్పించాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ (ఏఐఎఫ్ఈఏ), తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత-లింగ సమానత్వం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ఉచిత బస్సు ప్రయాణం పథకం తీసుకొచ్చామని చెప్పారు. దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారి తీరును ఖండించారు. అన్ని రంగాల్లోనూ మహిళలు నిర్ణయాత్మక శక్తి కావాలని ఆకాంక్షించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు దక్కాలన్నారు. విద్యలో తారతమ్యాలు తగ్గించడం ద్వారా మహిళా సాధికారత సాధించవచ్చుననీ, అందులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారత, స్వేచ్ఛ, హక్కులు, వారు మరింత ఎదగడానికి సూచనలు, సలహాలిస్తే స్వీకరించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. రాష్ట్రంలో పదేండ్లుగా పెండింగ్‌లో ...2లో



ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌లో మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

టీటీడీపీ కమిటీలు రద్దు
త్వరలో కొత్త అధ్యక్షుడి నియామకం

ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేయాలి

ప్రతినెలలో రెండు సార్లు వస్తా : పార్టీ నేతలతో చంద్రబాబు వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ తెలుగుదేశం పార్టీపై ఏపీ సీఎం చంద్రబాబునాయుడు దృష్టి సారించారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌లో టీటీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు ఎన్టీఆర్ భవన్‌కు భారీగా తరలివచ్చారు. సమావేశంలో తాజా రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీతోపాటు అన్ని స్థాయిల్లోని కమిటీలను రద్దు చేశారు. వీలైనంత త్వరగా రాష్ట్రానికి కొత్త అధ్యక్షుడిని నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో టీడీపీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలని నేతలకు సూచించారు. ఇకపై అన్ని గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా సభ్యత్వాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని నేతలను కోరారు. సభ్యత్వాలను పెద్ద ఎత్తున నమోదు చేయించిన నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. తనకు ...2లో

యూపీఎస్ పాలిట్రిక్స్
రాజకీయ ప్రయోజనాల కోసమే | శాసనసభ ఎన్నికల దృష్టితోనే నిర్ణయం

కేంద్ర, రాష్ట్రాలపై ఆర్థిక భారం తప్పదు : నూతన పెన్షన్ విధానంపై పరిశీలకుల మనోగతం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రస్తుతం అమలు చేస్తున్న భాగస్వామ్య పెన్షన్ పథకానికి (సీపీఎస్) బదులుగా మోడీ ప్రభుత్వం నూతన ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపీఎస్) తీసుకొస్తోంది. దీనికింద కనీసం పాతిక సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మూలవేతనంలో యాభై శాతం పెన్షన్‌గా అందుతుంది. మిగిలిన వారికి సర్వీసు ఆధారంగా పెన్షన్ అందజేస్తారు. జాతీయ పెన్షన్ వ్యవస్థలో చేరిన 23 లక్షల మంది ఉద్యోగులకు కొత్త పథకం వర్తిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే యూపీఎస్ అనేది గ్యారంటీ పెన్షన్ పథకం. యూపీఎస్ రూపకల్పన కోసం కేంద్రం గత సంవత్సరం ఏప్రిల్‌లో టీవీ సోమనాథన్ కమిటీని ఏర్పాటు చేసింది. 2004 జనవరి నుండి ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులకు అమలు చేస్తున్న జాతీయ పెన్షన్ పథకానికి ...11లో



యూ అంటే యూటర్న్
మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ సెటైర్లు



ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపీఎస్) ప్రకటించిన మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ సెటైర్లు వేసింది. యూపీఎస్‌లో యూ అంటే మోడీ ప్రభుత్వ యూటర్న్‌కు సంకేతమని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆదివారం ప్రభుత్వంపై విమర్శలు సంధిస్తూ జూన్ 4వ తేదీ తర్వాత ప్రధాని దురహంకార శక్తిపై ప్రజాశక్తి పైచేయి సాధించిందని చెప్పారు. లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై ...11లో

సంజయ్‌రాయ్‌కు పాలిగ్రాఫ్ టెస్ట్

నలుగురికి పరీక్షలు నిర్వహించినట్టు సీబీఐ వెల్లడి

మాజీ ప్రిన్సిపాల్ నివాసంలో సోదాలు 2లో..



ఎస్బీఐకి రూ.175 కోట్లు టోకరా

సైబర్ క్రైం నేరగాళ్ల చేతివాటం

సహకరించిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ చేసిన సీఎస్‌బీ 11లో..



రెండేండ్లలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండేండ్లలో రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు ఉద్యోగులు నిజాయితీ, అంకితభావంతో పని చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఛార్జీలు, అద్దె వాహనాల ఛార్జీలు మొదలైన వాటికి అవసరమైన బడ్జెట్ అవసరాలను త్వరలో క్లియర్ చేస్తామని ఈ సందర్భంగా ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

ఇతర రాష్ట్రాల్లోని రిజిస్ట్రేషన్ శాఖల్లో ఉన్న బెస్ట్ ప్రాక్టీసులను రాష్ట్రంలో అమలుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మరుగైన సేవలందించేందుకు వీలుగా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరముందని గుర్తు చేశారు. 2014లో రూ.2,746 కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గతేడాది రూ.14,588 కోట్లకు చేరుకుందని, ఆ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి మంత్రికి వివరించారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వార్షిక నివేదికను పొంగులేటి ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సమావేశంలో అదనపు ఐజీ వెంకట్ రాజేష్, డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి స్కామ్‌లో కాంగ్రెస్ నేతల పాత్ర

- బీఆర్ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాల్మీకి స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతల పాత్ర ఉందని బీఆర్ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడతూ గిరిజన సంక్షేమ నిధి నుంచి డబ్బులు ఇతర అకౌంట్స్‌లోకి వెళ్లాయనీ, ఈ కుంభకోణంలో ఆ రాష్ట్ర మంత్రి నాగేంద్ర ప్రస్తుతం జైల్లో ఉన్నారని గుర్తు చేశారు. సదరు మంత్రి అవినీతి డబ్బులను రాష్ట్రంతో పాటు ఏపీకి తరలించారని పేర్కొన్నారు. తెలంగాణలోని వి6 బిజినెస్ సొల్యూషన్స్‌కు తరలించిన రూ.45 కోట్లపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు ఈ స్కాంపై స్పందించాలని కోరారు.

టీటీడీపీ కమిటీలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

రెండు రాష్ట్రాలు రెండు కళ్లవంటివనీ, రెండు ప్రాంతాలు సమానాభివృద్ధి చెందాలనేదే టీడీపీ అభిమతమని పేర్కొన్నారు. పార్టీ నుంచి నేతలు వెళ్లిపోయినా.. గ్రామాల్లో టీడీపీకి బలమైన క్యాడర్ ఉందని చెప్పారు. క్యాడర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ తరహాలోనే కష్టపడి పని చేయాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలో టీడీపీని బలోపేతం చేయడం కోసం ఇకపై ప్రతినెలలో రెండు రోజులు రాష్ట్రానికి వస్తానని చెప్పారు. రాష్ట్రంలో పార్టీకి నూతన జవసత్వాలు అందించేందుకు యువ రక్తాన్ని ప్రోత్సహిస్తామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. తెలుగు ప్రజలు 45 ఏండ్లుగా తనను ఆశీర్వదిస్తూ వస్తున్నారని చెప్పారు. అందుకు తగినట్టే పార్టీ నిరంతరం ప్రజలకు సేవ చేస్తుందని తెలిపారు.

చంద్రబాబుతో బాబు మోహన్ భేటీ

ఏపీ సీఎం చంద్రబాబునాయుడును మాజీ మంత్రి బాబు మోహన్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం కలిశారు. రాజకీయాలపై చర్చించారు. అయితే బాబు మోహన్ త్వరలో తెలంగాణ టీడీపీలో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను పూర్తిచేశామన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వై.ప్రశాంతి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగంలో ఎంతో ప్రగతి సాధించినా నేటికీ సమాజంలో మహిళలకు తగిన గౌరవం దక్కట్లేదని వాపోయారు. అమ్మాయి పుట్టిందంటే లక్ష్మీ పుట్టినట్టుగా భావించే సమాజం రావాలని ఆకాంక్షించారు. బాలికలను రక్షించేందుకు సమాజం మొత్తం నడుం బిగించాలని సభికులందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. మహిళా సాధికారతలో మీడియా సముచిత పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, ఏఐఎఫ్ఈఏ అధ్యక్షులు సుధీర్ కుమార్, ప్రధాన కార్యదర్శి నబ్ కుమార్ కర్మకార్, సలహాదారు కె.సుబ్బారెడ్డి, స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కృష్ణారావు, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, నాయకులు కావలి అశోక్ కుమార్, కటకం రవికుమార్, మిథిలేష్ శర్మ, మనోజ్ కుమార్, కమల్ లోచక్, కిరణ్ జ్యోతి, స్వర్ణ సమత, కె.బాల త్రిపుర సుందరి బిశ్వాల్, సంధ్యాప్రధాన్, ప్రణీద్, ప్రభాకర్ రావు, శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి పోరుబాట

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 23న 'బ్లాక్ డే'

- నవంబర్ 26న దేశవ్యాప్తంగా పోరాట దినం
- కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం సంయుక్త పిలుపు
- 28న బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనకు మద్దతు
- నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాల ఓటమే లక్ష్యం
- స్మార్ట్ మీటర్లను బలవంతంగా అమర్చడాన్ని ఖండించిన వేదిక



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కార్‌పై రైతు, కార్మిక సంఘాలు మరోసారి పోరుబాట పట్టాయి. హక్కులు, డిమాండ్ల సాధన కోసం రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజైన నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ), ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త వేదిక ప్రకటించింది. బ్యాంకింగ్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా బ్యాంకు యూనియన్ల ఉమ్మడి వేదిక ఈ నెల 28న చేపట్టిన సమ్మెకు మద్దతిస్తున్నట్టు తెలిపింది. లేబర్ కోడ్‌ల ఆమోదాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 23న 'బ్లాక్ డే'కు పిలుపునిచ్చింది.

బీజేపీ, దాని మిత్రపక్షాల ఓటమే లక్ష్యం

రానున్న కాలంలో పోరాటాలను ఉధృతం చేయాలని, ఐక్యతను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చింది. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారానికి దూరంగా ఉంచేందుకు ఉమ్మడిగా ప్రచారం నిర్వహించాలని కూడా సమావేశం తీర్మానించింది. కోవిడ్-19 కాలంలో 2020 సెప్టెంబర్ 23న మూడు లేబర్ కోడ్‌లను ఆమోదించిన రోజును ట్రేడ్ యూనియన్లు 'బ్లాక్ డే'గా పాటిస్తున్నాయి. ఆ రోజున నిర్వహించే ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని ఎస్‌కేఎం హామీ ఇచ్చింది. ప్రజలు, దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను పెంపొందించేందుకు అక్టోబర్‌లో ఎస్‌కేఎం, సీటీయూ ఫ్రంట్‌ల నాయకత్వం విస్తృతంగా చర్చలు జరుపుతామని ప్రకటనలో పేర్కొంది.

స్మార్ట్ మీటర్లను అమర్చడాన్ని ఖండించిన వేదిక

స్మార్ట్ మీటర్లను బలవంతంగా అమర్చడాన్ని సమావేశం ఖండిస్తూ, దీనికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలిపింది. ప్రీమియం, బెనిఫిట్, మెడికల్ ఇన్సూరెన్స్‌తో పాటు వ్యవసాయంపై కూడా జీఎస్టీని తొలగించాలని ఈ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నవంబర్ 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని తీర్మానించింది.

బ్యాంక్‌ల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనకు మద్దతు

యూనియన్లపై దాడులు, ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఇచ్చిన ఆగస్టు 28 సమ్మె పిలుపుకు సీటీయూ, ఎస్‌కేఎం సంయుక్త వేదిక మద్దతు ఇచ్చింది. మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, హత్యలపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చర్యలను ఖండిస్తూ బాధితులకు న్యాయం చేయాలంటూ ఆందోళనకారులు చేస్తున్న డిమాండ్లకు తమ పూర్తి మద్దతును తెలిపింది. నిర్భయంగా జీవించడం కోసం సమాజాన్ని సురక్షితంగా మార్చడానికి నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని సమావేశం నొక్కి చెప్పింది.

యువత అంచనాలు వమ్ము చేసిన మోడీ సర్కార్

సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు తగ్గిన కారణంగా ఎన్డీఏ ప్రభుత్వం బలహీనంగా ఉన్నప్పటికీ, కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను దూకుడుగా కొనసాగిస్తోందని కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. పంటలకు ఎంఎస్‌పీతో సహా రైతులు, కార్మికులు, ప్రజల డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తోందని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అది ప్రస్ఫుటమయిందని స్పష్టం చేసింది. నిరుద్యోగ యువత అంచనాలను వమ్ము చేసిందని విమర్శించింది. వ్యవసాయ రంగ సంక్షోభం, కార్మికుల సమస్యలు బడ్జెట్‌లో పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- ఎన్ కన్వెన్షన్ కూల్చివేత సరైనదే..
- ఎంతటి వారినైనా ఉపేక్షించొద్దు : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఎన్ కన్వెన్షన్ కూల్చివేత స్థలం పరిశీలన



నవతెలంగాణ-మియాపూర్

చెరువులు కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చడాన్ని సీపీఐ స్వాగతిస్తోందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. హైదరాబాద్ నగరంలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలు సరైనవేనని, ఎంతటి వారినైనా ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. శనివారం హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేసిన ఎన్ కన్వెన్షన్ ప్రాంతాన్ని ఆదివారం నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు గజం స్థలం ఆక్రమిస్తేనే నానా రాద్ధాంతం చేస్తారని, కానీ పెద్దలు ఆక్రమించుకున్న స్థలాలను గత ప్రభుత్వం పూర్తిగా చూసి చూడకుండా వదిలిపెట్టిందన్నారు. సమాజంలో పెద్ద వ్యక్తులుగా చలామణి అవుతూ ప్రజల ఆస్తిని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నటుడు నాగార్జున కేవలం డబ్బులు సంపాదించే విధంగా అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తుందని ఆరోపించారు. నాగార్జున ఎన్-కన్వెన్షన్ పూర్తిగా తనదేనంటూ కోర్టుకు వెళ్లడం హాస్యాస్పదమని అన్నారు. నాగార్జున సత్యహరిచంద్రుడేమీ కాదని తెలిపారు. ఈ ఎన్-కన్వెన్షన్ ద్వారా సినీ నటుడు ఇప్పటి వరకే పెద్ద మొత్తంలో ఆస్తులను కూడబెట్టారని, వాటిపై ప్రభుత్వం దృష్టి సారించి అతని నుంచి ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో పెనాల్టీ ద్వారా ఆదాయాన్ని సమకూర్చాలని తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీ ద్వారా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్టు అనేక విషయాలు బయటకు వస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇంకా ఎందుకు వేచి చూస్తోందని అన్నారు. పల్లా, మల్లారెడ్డి అనేక కబ్జాలు చేశారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది కేవలం కొంతమంది వ్యక్తులకే పరిమితం కాకుండా చెరువులను, నాలాలను కబ్జాలు చేసిన వ్యక్తులపై చర్యలు వేగవంతం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అతిపెద్ద నాలా అయిన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఫిరంగి నాలా పూర్తిగా కబ్జాదారులు పూడ్చి ఇండ్ల నిర్మాణం చేపడుతున్నారని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి, నాలాపై ఆక్రమణలు తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, చందునాయక్, నరసింహారెడ్డి స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల విరమణపై ఈజిప్టులో మళ్లీ చర్చలు

- ఆగని ఇజ్రాయిల్ దురాగతాలు
- తాజా దాడుల్లో 50 మంది మృతి



కైరో/గాజా: ఒక వైపు అమెరికా, ఈజిప్టు మధ్యవర్తిత్వంలో కైరోలో కాల్పుల విరమణ చర్చలు పునరుద్ధరణ జరుగుతుండగా, మరో వైపు ఇజ్రాయిల్ గాజాపై క్రూరమైన దాడులు కొనసాగిస్తోంది. ఇంకోవైపు గాజాకు మానవతా సాయం అందకుండా చేయడం వల్ల గాజాలో పిల్లల పరిస్థితి మరీ దారుణంగా తయారవుతోందని, పోషకాహార లోపంతో చిన్నారులు పెద్దయెత్తున పోలియో బారిన పడే ప్రమాదముందని ఐరాస హెచ్చరించింది. అయినా ఇజ్రాయిల్ మిలిటరీ రక్తదాహం తీరలేదు. శనివారం గాజాపై జరిపిన భయానక దాడుల్లో 50 మంది దాకా చనిపోయినట్లు పాలస్తీనియన్ ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. రోడ్లపై వెళ్తున్నవారి మీద కూడా బాంబులు వేస్తుండడంతో ప్రజల పరిస్థితి దారుణంగా తయారైంది. కాల్పుల విరమణ ఒప్పంద చర్చల పేరుతో హమాస్‌ను న్యూట్రల్‌లో ఉంచి ఇజ్రాయిల్‌ను మరింత బలోపేతం చేయడమే అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఎత్తుగడగా ఉందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇదిలా వుండగా అమెరికా, ఈజిప్టు అధ్యక్షులు బైడెన్, శిశి ఆదివారం ఫోన్‌లో సంభాషించుకున్నారు. కాల్పుల విరమణ తరువాత కూడా గాజాలో తమ సైనిక బలగాలు ఉండేందుకు అంగీకరించాలని ఇజ్రాయిల్ చేస్తున్న డిమాండ్‌ను హమాస్, ఇతర పాలస్తీనా గ్రూపులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.కాల్పుల విరమణ ఒప్పందం ముందుకు సాగకపోవడానికి ఇజ్రాయిల్ అనుసరిస్తున్న ఈ వైఖరే కారణం.

బీసీ కులగణన కోసం మరో సామాజిక ఉద్యమం

ప్రభుత్వానికి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ కులగణన చేయకపోతే మరో సామాజిక ఉద్యమం చేస్తామని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన బీసీ హిందూ మహసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, ఆజాద్ హిందూ ఫెడరేషన్ కన్వీనర్ బక్కని సంజీవ కుమార్ తదితరులను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్ వెళ్లి దీక్ష చేస్తున్న వారికి వారు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం బీసీ డిక్లరేషన్లు ఇచ్చిన హామీ మేరకు బీసీ కుల గణన చేయాల్సిందేననీ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని కోరారు. బీసీ ఉద్యమనాయకులు కోల్ జనార్దన్, దాసోజు లలిత, రోజా నేత, కుమార్, అశోక్, బైరు శేఖర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌రాయ్‌కు పాలిగ్రాఫ్ టెస్ట్

కొల్‌కతా : కొల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాల సెమినార్ హాలులో 31 ఏండ్ల ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ టెస్ట్ (అబద్ధాలను తెలుసుకునే పరీక్ష) ఆదివారం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైలుకు చేరుకున్న అధికారుల బృందం లై డిటెక్టర్ టెస్ట్ చేశారు. ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) నుంచి కోల్‌కతాకు చేరుకున్న పాలిగ్రాఫ్ నిపుణుల బృందం ఈ పరీక్షలు నిర్వహించింది. మరో ఇద్దరికి కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయంలో ఆదివారం పరీక్ష నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌సహా నలుగురు ఇప్పటివరకూ పాలిగ్రాఫ్ పరీక్ష చేయించుకున్నారని అధికారులు తెలిపారు. సందీప్ ఘోష్ సహా ఏడుగురికి లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు కోర్టు అనుమతి కోరినట్టు సీబీఐ అధికారులు తెలిపారు. విచారణ సమయంలో ఈ పరీక్ష సాక్ష్యంగా ఉపయోగపడకపోయినా, సీబీఐ తదుపరి దర్యాప్తునకు ఈ ఫలితాలు దిశానిర్దేశం చేయనున్నాయి. ఘటన అనంతరం తానే దారుణానికి ఒడిగట్టినట్టు అంగీకరించిన సంజయ్‌రాయ్ పాలిగ్రాఫ్ టెస్ట్‌కు ముందు తాను నిర్దోషినని, తనను ఇరికించారని ఆరోపించడం గమనార్హం.

మాజీ ప్రిన్సిపాల్ నివాసంలో సీబీఐ సోదాలు

కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంలో సీబీఐ అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఘోష్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో ఆస్పత్రిలో ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. సుమారు ఏడుగురు సీబీఐ అధికారులు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి బెలియాఘట నివాసంలో ఘోష్‌ని విచారిస్తోంది. కేంద్ర భద్రతా బలగాలతో అధికారులు ఉదయం 6 గంటలకు ఘోష్ నివాసానికి చేరుకున్నారు. సుమారు గంటన్నరపాటు అధికారులు వేచిచూసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరో సీబీఐ అధికారుల బృందం ఆస్పత్రిలోని ఘోష్ కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. ఇన్‌స్టిట్యూట్ క్యాంటీన్‌ను కూడా పరిశీలించింది. ఈ నెల 9న ట్రైనీ పీజీ డాక్టర్ లైంగికదాడి, హత్య ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు రావడం తో దర్యాప్తును సీబీఐకి హైకోర్టు బదిలీ చేసింది. మూడు వారాల్లో స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని ఆదేశించింది. సంజయ్ ఘోష్ అవినీతికి పాల్పడినట్లు గతంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అక్తర్ అలీ ఫిర్యాదు చేశారు. పేషెంట్స్‌కు అవసరమైన సామాగ్రిని సరఫరా చేసేవారి నివాసాలు, కార్యాలయాలపై కూడా సీబీఐకి చెందిన అవినీతి నిరోధక విభాగం దాడులు చేస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మాజీ మెడికల్ సూపరింటెండెంట్, ఆస్పత్రి వైస్ ప్రిన్సిపాల్ వశిష్ట్, వైద్య సంస్థ ఫోరెన్సిక్ విభాగానికి చెందిన మరో ప్రొఫెసర్, ఇతరులను కూడా విచారిస్తున్నట్టు పేర్కొన్నాయి. ఆర్‌జీ కర్ ఆస్పత్రి వద్ద నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకూ పొడిగించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అచ్యుతాపురం సెజ్ ప్రమాదంపై ఎన్జీటీ ఆగ్రహం

- సెప్టెంబర్ 23 లోపు అఫిడవిట్లు దాఖలు చేయండి
- కేంద్ర, ఏపీ ప్రభుత్వాలకు నోటీసులు

న్యూఢిల్లీ : .అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదానికి దారితీసిన కారణాలపై సెప్టెంబర్ 23లోపు అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ప్రధాన బెంచ్ ఆదేశించింది. ఎన్జీటీ చైర్మెన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, జ్యుడిషియల్ సభ్యుడు జస్టిస్ అరుణ్ కుమార్ త్యాగి, ఎక్స్‌పర్ట్ సభ్యుడు ఎ.సెథిల్‌వెల్‌లతో కూడిన ట్రిబ్యునల్ విచారణ జరిపింది. సుమోటో కింద ఈ కేసు తీసుకొని విచారణ జరిపిన ఎన్జీటీ నాలుగు పేజీల ఆర్డర్ ఇచ్చింది. ఈ ప్రమాదంలో 17 మంది మరణించారని, 20 మంది గాయపడ్డారని ట్రిబ్యునల్ గుర్తించింది. పర్యావరణ నిబంధనలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని తెలిపింది. ఈ ఘటన చెన్నైలోని ఎన్జీటీ బెంచ్ పరిధిలోకి వస్తుందని, కాబట్టి కేసును అక్కడికి బదిలీ చేస్తున్నామని పేర్కొంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ హెల్త్ డైరెక్టరేట్ డైరెక్టర్ ఈ ప్రమాదానికి కారణాలను వివరిస్తూ సెప్టెంబర్ 23లోపు ఎన్జీటీ ముందు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేసింది.

'వాహన్'లోకి రవాణాశాఖ

- వచ్చే నెల అమల్లోకి
- ఎన్ఐసీ, ఆర్టీఏ అధికారులతో రెండు కమిటీలు
- సంబంధిత అధికారుల కసరత్తు ప్రారంభం
- దేశంలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్, ఇతర సేవలు
- 30న రూట్ మ్యాప్‌పై ఎన్ఐసీ, ఆర్టీఏ అధికారుల కీలక భేటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రవాణాశాఖలో కీలక మార్పులు జరగనున్నాయి. ఒకే దేశం- ఒకే పోర్టల్ పేరిట కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ-2019లో వాహన్, సారథి పేర్లతో రవాణా పోర్టల్‌ను రూపొందించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఆ పోర్టల్‌లో చేరేందుకు సుముఖత చూపని తెలంగాణ రవాణాశాఖ త్వరలో అందులో చేరిపోనుంది. ఇప్పటికే ఏపీ, తమిళనాడు, కర్నాటక, మహరాష్ట్ర, యూపీ గుజరాత్, ఢిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ జాబితాలోకి తెలంగాణ కూడా రానుంది. దాంతో ఇప్పటి వరకూ రాష్ట్ర రవాణా శాఖ నిర్వహిస్తున్న 'సీఎఫ్ఎస్టీ' సాఫ్ట్‌వేర్ స్థానంలో 'సారథి, వాహన్ పోర్టల్' అందుబాటులోకి రానుంది. ఫలితంగా ప్రస్తుతం అమలవుతున్న రాష్ట్రాల్లో ఎక్కడనుంచైనా రవాణా సేవలు పొందే వీలుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. రెండు కమిటీలను కూడా ఏర్పాటు చేయగా.. వాటి పర్యవేక్షణలో పనులు ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందుకోసం ఈ నెల 30 ఎన్ఐసీ అధికారులు, రవాణాశాఖ కమిషనర్‌తో పాటు రెండు కమిటీల్లోని జేటీసీలు, ఇతర అధికారులు సమావేశమై.. ఈ సేవలను పైలట్ ప్రాతిపదికన అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లనున్నట్టు ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

పక్కగా వివరాలు నమోదు..!

ఇదిలావుంటే ఈ విధానంలో భాగంగా వాహనదారుల వివరాలు పక్కాగా రిజిస్టర్ చేస్తారు. తెలంగాణలో 1.46 కోట్లకుపైగా వాహనాలు, రెండు కోట్లకుపైనే డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంటులో వెహికల్ ఓనర్‌షిప్‌ను పక్కాగా నమోదు చేస్తారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే ఏ విభాగానికి చెందినవో అంటే.. చారిటీ ట్రస్టు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలవి అనేది కూడా వివరంగా నమోదు చేస్తారు. యజమాని వికలాంగుడు అయితే ఆ వివరాలు సైతం నమోదు చేయనున్నారు. దీనివల్ల వికలాంగులకు వచ్చే ప్రయోజనాలు వారికి నేరుగా చేరే వీలుంటుంది. దానికితోడు వివరాలు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటే ఎక్కడైనా ప్రమాదం జరిగితే వాహనదారుల వివరాలు ఆన్‌లైన్‌లోనే వెంటనే తెలుసుకునే వీలుంటుంది. కేసుల పరిష్కారం సైతం సులువుకానుంది.

ఇప్పటికే స్మార్ట్ కార్డుల జారీ

రవాణాశాఖ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే జారీ చేస్తున్న ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌లు కేంద్రం రవాణాశాఖ నిబంధనల మేరకు మనదగ్గర ప్రస్తుతం స్మార్ట్ కార్డుల జారీ చేస్తోంది. ప్రస్తుతం ముద్రితమవుతున్న కార్డులు, అందులోని వివరాలు కేంద్ర నిర్దేశిత ప్రకారమే జరుగుతున్నాయి. ఉదాహరణకు వాహన వివరాలు కార్డు రెండు వైపులా ఉంటున్నాయి. రవాణాయేతర(వ్యక్తిగత) వాహనమైతే 'ఎన్‌టీ' అని రవాణాదైతే 'టీజీ' అని ముద్రిస్తున్నారు. ఆ కార్డు ఏ రాష్ట్రానికి చెందిందో తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణకు 'టీజీ' అని నమోదు చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల కార్డుల పైనా ఇదే తరహాలో ముద్రిస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా సికింద్రాబాద్ నుంచే..

ఇప్పటికే రవాణాశాఖ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసే పనిలో నిమగ్నమైంది. రాష్ట్ర రవాణా శాఖలో ఉన్న సమాచారాన్ని 'వాహన్, సారథి పోర్టల్'లోకి అప్‌లోడ్ చేసేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ఎన్ఐసీ, ఆర్టీఏ అధికారులతో కూడిన పాలసీ కమిటీ, యూజర్ యాక్సెప్టెన్స్ టెస్ట్(యూఏటీ) కమిటీలు ఏర్పాటైయ్యాయి. ఇందులో ఎన్ఐసీ అధికారులతో పాటు రవాణాశాఖకు చెందిన జేటీసీలు, ఐటీ అధికారులు, ఎంవీఐలు, ఏవోలు ఉన్నారు. జులై 30న జరిగిన సమావేశానికి కొనసాగింపుగా.. ఈ నెల 30న నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్(ఎన్ఐసీ), ఆర్టీఏ ఉన్నతాధికారులతో పాటు ఇతర శాఖల అధికారులతో భేటీ అయి.. పోర్టల్ అమలుపై చర్చించి ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయనున్నారు. అనంతరం సికింద్రాబాద్ ఆర్టీఓ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నారని సమాచారం. ముందుగా ఈ కార్యాలయ పరిధిలోని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ల సమాచారమంతటినీ వాహన్, సారథి పోర్టల్‌లో అనుసంధానం చేసే ప్రక్రియను చేపడుతారు. ఈ ప్రయత్నం సాఫీగా సాగిన పక్షంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాలకూ విస్తరించనున్నారు. తొలుత సారథి సేవలను పూర్తిచేయనున్నారు. అనంతరం వాహన్ పోర్టల్‌పై పోకస్ పెడుతారు. ఇవన్నీ సవ్యంగా జరిగితే వచ్చే నెల 10 తర్వాత ఎపుడైనా కొత్త పోర్టల్ అందుబాటులోకి రానుంది.

ఇక సులువుగా సేవలు..!

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వాహన్ (వాహనాల రిజిస్ట్రేషన్), సారథి (డ్రైవింగ్ లైసెన్స్) పోర్టల్ ద్వారా దేశంలో ఎక్కడైనా వినియోగదారులు తమకు కావాల్సిన రవాణా సేవలు పొందవచ్చు. అయితే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'సీఎఫ్ఎస్టీ' రాష్ట్రానికే పరిమితం కావడంతో ఈ అవకాశం ఇప్పటివరకూ రాష్ట్ర పరిధిలోనే ఉండేది. వాహనదారులకు పక్క రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఎదురువుతున్న అనేక రకాల ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి ఢిల్లీ, మహారాష్ట్ర, ఏదైనా రాష్ట్రంలో ఒక వాహనాన్ని కొనుగోలు చేస్తే.. అతడు అక్కడి నుంచే ఇక్కడి సంబంధిత జిల్లా ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో వాహనాన్ని రిజిస్టర్ చేసుకోవచ్చు. దీంతో పాటు వాహన సామర్థ్య పరీక్షలు (ఎఫ్‌సీ), డీఆర్, ఎల్ఎల్ఆర్, రెన్యువల్ వంటి అన్ని సేవలు అంతరాష్ట్రీయంగా అందుబాటులోకి రానున్నాయి.

యువత రాజకీయాల్లోకి వస్తేనే ప్రజాస్వామ్యానికి బలం

- మన్ కీ బాత్‌లో మోడీ



న్యూఢిల్లీ : ఎలాంటి నేపథ్యం లేని లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చిన పిలుపునకు విస్తృత స్పందన వచ్చిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 113వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన భారత్, బలమైన ప్రజాస్వామ్యం కోసం యువత ప్రజా జీవితంలోకి రావాలని అన్నారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో నేడు వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి యువత రాజకీయాల్లోకి రావాలని అన్నారు. కుటుంబ రాజకీయాలు నూతన ప్రతిభను అణచివేస్తాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అంతరిక్ష రంగంలో కృషి చేస్తున్న పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ప్రధాని మాట్లాడారు. చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా స్పేస్ డే నిర్వహించుకున్నట్లు తెలిపారు.

ఈ ఏడాదే తొలి అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకొన్నామని పేర్కొన్నారు. ఈ రంగంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో యువత పెద్ద ఎత్తున లబ్ధి పొందినట్లు చెప్పారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ నిలిచిందని గుర్తుచేశారు. అంతరిక్ష రంగం యువతను ఆకర్షిస్తోందని తెలిపారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం నేపథ్యంలో దాదాపు ఐదు కోట్ల మందికిపైగా జాతీయ జెండాతో ఫొటోలు దిగి వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారని అన్నారు.

మాంసాహారులు.. జాగ్రత్త



- రెడ్ మీట్‌తో ముప్పు
- మధుమేహం పెరిగే ప్రమాదం
- లాన్సెట్ తాజా అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ : మాంసాహారులకు ఇది షాకింగ్ న్యూస్. రెడ్ మీట్ (బీఫ్, ల్యాంబ్, మటన్, పోర్క్, వీల్, వెనిసన్, మేక మాంసం) ను తీసుకుంటే డయాబెటిస్ (మధుమేహం) పెరిగే ప్రమాదమున్నదని లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. 19 లక్షల మంది నుంచి అధ్యయనం సమాచారం సేకరించింది. ఇది ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండో క్రైనాలజీలో ప్రచురితమైంది.

లాన్సెట్ తాజా అధ్యయనం ప్రకారం.. దాదాపు 20 దేశాల్లో స్టీక్, బాకన్, సాసేజెస్ వంటి రెడ్ మీట్ తీసుకునే 20 లక్షల మందికి, టైప్ 2 డయాబెటిస్‌కు మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని అధ్యయనం కనుగొన్నది. రోజుకు 50 గ్రాముల ప్రాసెస్డ్(నిల్వ చేసిన) మాంసం తీసుకునేవారిలో రాబోయే పదేండ్లలో టైప్ 2 డయాబెటిస్ ముప్పు 15 శాతం అధికంగా ఉంటుంది. రోజుకు వంద గ్రాముల ప్రాసెస్ చేయని మాంసం తీసుకునేవారిలో టైప్ 2 డయాబెటిస్ ముప్పు 10 శాతం ఎక్కువగా ఉంటుంది. చికెన్, బాతు వంటి పౌల్ట్రీని రోజుకు వంద గ్రాములుగా తీసుకుంటే 8 శాతం అధిక ముప్పు ఉంటుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు కూడా తెలిపారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఇండియాబి) ప్రకారం.. 2021లో 10.1 కోట్ల మంది భారతీయులు డయాబెటిస్‌ను కలిగి ఉన్నారు. అలాగే, 13.6 కోట్ల మంది ప్రీడయాబెటిస్, 31.5 కోట్ల మంది హైపర్‌టెన్షన్‌ను కలిగి ఉన్నారు.

సోషల్ మీడియాలో పుంజుకున్న కాంగ్రెస్

పెరుగుతున్న లైక్స్, షేర్స్, కామెంట్స్



భారత్ జోడో యాత్రతో మారిన సీన్
వినూత్న ఎత్తుగడలతో యువతకు చేరువ

న్యూఢిల్లీ : 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయంలో సామాజిక మాధ్యమాల పాత్ర ఎంతైనా ఉంది. ట్విటర్, వాట్సప్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాలను ఆ పార్టీ గరిష్టంగా ఉపయోగించుకొని లబ్ది పొందింది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా సోషల్ మీడియాను వాడుకోవడంలో ముందడుగు వేస్తోంది. ఆ పార్టీ పోస్టులకు యువత నుండి లైకులు, షేర్లు, కామెంట్లు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. ఒకప్పుడు సోషల్ మీడియాలో మోడీకి ఎంతో క్రేజ్ ఉండేది. ఇప్పుడు దానిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సొంతం చేసుకుంటున్నారు.

2014 వరకూ బీజేపీదే హవా

బీజేపీకి విస్తృతమైన మీడియా వ్యవస్థ ఉంది. దశాబ్ద కాలం నుండే ఆ పార్టీ మౌలిక సదుపాయాల కల్పనపై పెద్ద ఎత్తున సొమ్ము పెట్టుబడి పెడుతోంది. సోషల్ మీడియా శక్తి ఏమిటో తెలిసిన నరేంద్ర మోడీ, దానిని గత కొన్ని సంవత్సరాలుగా సమర్ధవంతంగా వాడుకుంటున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాల ద్వారా బీజేపీ ఎంతో లబ్ది పొందింది. 2012 గుజరాత్ ఎన్నికలలోనూ సోషల్ మీడియాను మోడీ విస్తృతంగా ఉపయోగించుకున్నారు. 2009లో ట్విటర్‌లో చేరారు. అది యువతను ప్రభావితం చేస్తుందని ఆయనకు బాగా తెలుసని రాజకీయ విశ్లేషకుడు అమితాబ్ తివారీ చెప్పారు. రాహుల్ గాంధీకి 2014లో సైతం ట్విటర్ ఖాతా లేదు. 2015లోనే ఆయన అందులో చేరారు. 2014 నుండే బీజేపీ సోషల్ మీడియాను సొంతం చేసుకుంటే కాంగ్రెస్ కుంభకర్ణుడిలా నిద్ర పోయిందని పరిశోధనాత్మక జర్నలిస్ట్ స్వాతి చతుర్వేది వ్యాఖ్యానించారు.

ఇప్పటికీ ఆ పార్టీదే పైచేయి

2014 ఎన్నికల్లో ఎదురైన పరాభవం నేపథ్యంలో సోషల్ మీడియా సత్తా ఏమిటో కాంగ్రెస్ గుర్తించింది. ఆ వెంటనే రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అయితే ఇప్పటికీ సోషల్ మీడియాలో బీజేపీదే పైచేయి అని చెప్పక తప్పదు. గత నెలలో ప్రధాని మోడీని ఎక్స్‌లో 10.1 కోట్ల మంది ఫాలో అయ్యారు. రాహుల్‌ను ఫాలో అయిన వారి సంఖ్య 2.67 కోట్లు మాత్రమే. ఇన్‌స్టాగ్రామ్‌లో మోడీని 9.13 కోట్ల మంది, రాహుల్‌ను 1.07 కోట్ల మంది ఫాలో అయితే యూట్యూబ్‌లో మోడీని 2.52 కోట్ల మంది, రాహుల్‌ను 86 లక్షల మంది ఫాలో అయ్యారు. ఫేస్‌బుక్‌లో మోడీని 4.9 కోట్ల మంది ఫాలో అయితే రాహుల్‌ను 72 లక్షల మంది మాత్రమే ఫాలో అయ్యారు. కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులతో పోలిస్తే బీజేపీ, ప్రధాని మోడీకి ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్లు అధికంగా ఉన్నారు.

దూసుకుపోతున్న కాంగ్రెస్

అయితే సంఖ్యాపరంగా అంచనాలు వేయడం సరికాదని, లైకులు, షేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ఛైర్‌పర్సన్ సుప్రియా శ్రినాట్ చెప్పారు. ఈ సంవత్సరం మార్చి 16 నుండి మే 30 వరకూ సమాచారాన్ని విశ్లేషిస్తే సోషల్ మీడియాలో కాంగ్రెస్ ఎలా పుంజుకుంటుందో అర్థమవుతుంది. ఆ నెలన్నర వ్యవధిలో యూట్యూబ్‌లో కాంగ్రెస్‌కు 61.3 కోట్ల వ్యూస్ వస్తే బీజేపీకి 15 కోట్లు మాత్రమే వచ్చాయి. ఎక్స్‌లో కాంగ్రెస్‌కు సగటున 2.500–3,000 లైక్స్ వచ్చాయి. బీజేపీకి వచ్చినవి 260–300 మాత్రమే. ఇక ఫేస్‌బుక్‌లో సగటు లైక్స్ విషయంలో బీజేపీ కంటే కాంగ్రెస్ బాగా ముందంజలో ఉంది. ఇక ఇన్‌స్టాగ్రామ్‌లో అయితే చెప్పనక్కర లేదు. అందులో కాంగ్రెస్‌కు 1.22 లక్షల లైక్స్ రాగా బీజేపీకి వచ్చినవి కేవలం 22,945 మాత్రమే.

సమస్యలకు ప్రాధాన్యత


సోషల్ మీడియా వ్యూహాన్ని మార్చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం మొదలు పెట్టింది. ఫలితంగా లోక్‌సభలో దాని ప్రతినిధ్యం పెరుగుతూ వస్తోంది. దేశ జనాభాలో 66 శాతం మంది 35 సంవత్సరాల లోపు వయసున్న వారే. ఈ వయసు వారు కేవలం వాట్సప్, ఫేస్‌బుక్ పైనే కాకుండా వివిధ సామాజిక మాధ్యమ వేదికల్లో కూడా క్రియాశీలకంగా ఉంటున్నారు. ఇది కాంగ్రెస్‌కు లాభిస్తోంది.

జోడో యాత్రతో...

రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్రతో సోషల్ మీడియాలో కాంగ్రెస్ దశ తిరిగింది. ఆ యాత్ర ప్రారంభానికి ముందు కాంగ్రెస్ తన సోషల్ మీడియా వ్యవస్థను ప్రక్షాళన చేసింది. మీడియా రంగంలో హేమాహేమీలను అందులో నియమించింది. యాత్ర సందర్భంగా 137 రాజకీయేతర గ్రూపులు కాంగ్రెస్‌లో చేరాయి. నాలుగున్నర నెలల పాటు కొనసాగిన యాత్ర కారణంగా ఎక్స్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కాంగ్రెస్‌కు ఫాలోవర్లు బాగా పెరిగిపోయారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ బృందం పెట్టే పోస్టులు, వ్యంగ్య చిత్రాలు, స్కిట్లు యువతను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కాంగ్రెస్ బృందం పన్నుతున్న వ్యూహాలకు బీజేపీ చిత్తవుతోంది. సంప్రదాయ మీడియా మోడీకి కొమ్ము కాస్తుంటే బీజేపీ వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారానికి యూట్యూబ్ వేదికగా మారింది. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో క్రియాశీలకంగా ఉంటున్న కాంగ్రెస్ పార్టీ వాట్సప్‌లో బీజేపీని చేరుకునేందుకు ప్రయత్నిస్తోంది.

90 శాతం ప్రజలకు ప్రయోజనకరం

- కులగణనపై రాహుల్
- రాజ్యాంగ రక్షణకు అది అవసరం
- ప్రజలందరికీ సంపద పంపిణీ జరగాలి
- రిజర్వేషన్లపై పరిమితి సరికాదు




లక్నో : రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కులగణన చేపట్టాల్సిన అవసరం ఉన్నదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. కులగణన తన లక్ష్యమని, అందుకోసం రాజకీయ మూల్యాన్ని చెల్లించేందుకు సైతం సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో శనివారం జరిగిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగిస్తూ కులగణన ద్వారా దేశ జనాభాలో 90 శాతం మందికి దక్కాల్సిన ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. జనాభాలో అత్యధికులు ఈ ప్రయోజనాలు పొందలేకపోతే రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, కాపాడడం సాధ్యం కాదని చెప్పారు.

రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 సంవత్సరాలు అయినప్పటికీ దేశ జనాభాలో 90 శాతం మంది అట్టడుగునే ఉన్నారని, కార్పొరేట్ ప్రపంచం, మీడియా, న్యాయ వ్యవస్థలో వారి ప్రాతినిధ్యం చాలా స్వల్పంగా ఉండడం లేదా అసలు లేకపోవడం జరుగుతోందని రాహుల్ వివరించారు. కులగణన కాంగ్రెస్‌కు కీలకమైన విధాన నిర్మాణాన్ని అందిస్తుందని ఆయన చెప్పారు. దేశంలో సామాజిక–ఆర్థిక, సంస్థాగత సర్వే చేపట్టాలని కూడా తాను కోరుకుంటున్నానని అన్నారు. సంపద కేవలం ఐదు లేక పది శాతం మందికే పంపిణీ కాకూడదని, దానిని ప్రజలందరికీ పంచాలని, అదే తన విజన్ అని తెలిపారు. దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలకు సమాన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. అప్పుడే దేశ వ్యవహారాల్లో వారి గొంతుక వినిపిస్తుందని, దాని వనరులపై పెత్తనం వస్తుందని అన్నారు.

దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉన్నదని రాహుల్ సూచించారు. వాహనంలోని ఇంజిన్‌లో ఉండే సిలిండర్లను ఆయన ఉదాహరణగా చూపారు. 'ఒక్కటి కాకుండా మొత్తం పది ఇంజిన్లు పనిచేయాలని నేను కోరుకుంటాను' అని వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లపై యాభై శాతం పరిమితిని విధించడం తనకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. జనాభాలో దామాషా, శాతం ఆధారంగా ప్రాతినిధ్యం, భాగస్వామ్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. లేటరల్ ఎంట్రీ ద్వారా రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాహుల్ ఆరోపించారు.

స్వతంత్ర అభ్యర్థులుగా జమాత్ నేతలు

స్వాగతించిన ఒమర్, మెహబూబా



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిషిద్ధ జమాతే ఇస్లామీ నేతలు తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ ఆదివారం స్వాగతించారు. 'ఇది ప్రజాస్వామ్య పరిపక్వత. ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ అందరికీ ఉంటుంది. తమ సంస్థపై నిషేధాన్ని ఎత్తివేయాలని జమాతే ఇస్లామీ నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ స్వతంత్రులుగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం స్వాగతించదగిన పరిణామం' అని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ చెప్పారు.

ఆర్టికల్ 370 రద్దుకు ముందు, పుల్వామాలో ఆత్మాహుతి దాడి జరిగిన తర్వాత జమాతే ఇస్లామీ సంస్థను చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద బీజేపీ ప్రభుత్వం 2019లో నిషేధించింది. ఈ నిషేధాన్ని ఢిల్లీలోని ఓ ట్రిబ్యునల్ శనివారం సమర్థించింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ సంస్థకు చెందిన పలువురు నాయకులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నిషేధాన్ని తొలగిస్తే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమేనని సంసిద్ధత వ్యక్తం చేశారు.

జమాత్ నేతల నిర్ణయాన్ని ప్రధాన స్రవంతి పార్టీలన్నీ సమర్థించాయి. పార్టీ తరపున, పార్టీ గుర్తుతో పోటీ చేయడం సాధ్యం కాకపోయినప్పటికీ స్వతంత్రులుగా పోటీ చేయవచ్చునని, మ్యానిఫెస్టోతో ముందుకు వస్తే ప్రజలే నిర్ణయం తీసుకుంటారని ఒమర్ చెప్పారు. ఇది మంచి నిర్ణయమని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి వ్యాఖ్యానించారు. జమాతే ఇస్లామీ ఒక మత, సామాజిక సంస్థ అని, రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిందని ఆమె చెప్పారు. మత సంస్థలు మసీదులపై దాడి చేసినప్పుడు, గోరక్షణ పేరిట ముస్లింలను హతమార్చినప్పుడు వాటిని స్వేచ్ఛగా వదిలేసి జమాత్ వంటి మంచి సంస్థలను నిషేధించారని ఆమె మండిపడ్డారు.

1987 వరకూ జమాత్ సంస్థ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేసింది. అయితే 1987 ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ప్రజాస్వామ్యంపై తనకు నమ్మకం పోయిందని ఆరోపిస్తూ అప్పటి నుండి ఎన్నికలకు దూరంగా ఉంది. నిషేధం విధించిన తర్వాత ఆ సంస్థకు చెందిన పలువురు నేతలను ప్రభుత్వం అరెస్ట్ చేసింది.

హర్యానా ఎన్నికలను వాయిదా వేయండి

- వరుస సెలవులతో ఓటింగ్ తగ్గే అవకాశం
- ఈసీని కోరిన బీజేపీ
- రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహం కారణంగానే వాయిదాకు బీజేపీ ప్రయత్నాలు
- కాంగ్రెస్ ఆరోపణలు



చండీగఢ్ : హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలంటూ భారత ఎన్నికల సంఘం(ఈసీఐ)ను ఆ రాష్ట్ర బీజేపీ శాఖ కోరింది. ఈ మేరకు ఈసీఐకి లేఖ రాసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1న జరగాల్సిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత వరుస సెలవులు ఉన్నాయనీ, ఈ కారణంతో ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గే అవకాశమున్నదని బీజేపీ శాఖ కారణాలుగా చూపించింది. దీంతో కొంత వరకు హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలని వివరించింది. ఇండియన్ నేషనల్ లోక్ దళ్ కూడా ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేసింది. 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానా రాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్ 1న ఎన్నికలు జరగనుండగా.. అదే నెల 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి. దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే తేదీలను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఈసీఐకి బీజేపీ అభ్యర్థనపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నుంచి విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని పంపాలన్న ఆగ్రహం ప్రజల్లో ఉన్నదనీ, ఈ కారణంగానే బీజేపీ ఎన్నికలను వాయిదా వేయాలనే ప్రయత్నాలకు దిగుతున్నదని హస్తం పార్టీ ఆరోపించింది. కాగా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగ్వాల్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బదోలీ లేఖ రాసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. దీనిని పంకజ్ అగర్వాల్ కూడా ధ్రువీకరించారు. బీజేపీ అభ్యర్థనను ఈసీఐకి పంపినట్టు ఆయన తెలిపారు.


రెండుగా విడిపోయిన రైలు

తప్పిన పెను ప్రమాదం



రాయ్‌పూర్ : తరచూ జరుగుతున్న రైలు ప్రమాదాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రన్నింగ్‌లో ఉన్న రైలు రెండుగా విడిపోయిన ఘటన ఉత్తర ప్రదేశ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఫిరోజ్‌పూర్ నుంచి ధన్‌బాద్ వెళ్తున్న కిసాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం తెల్లవారుజామున 3.36 గంటల ప్రాంతంలో రైలు ధాంపూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. 3.45 గంటలకు సర్కడ చక్రజామల్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన అనంతరం రాయ్‌పూర్ రైల్వేగేట్ సమీపానికి రాగానే రైలు రెండుభాగాలు విడిపోయింది. మొత్తం 21 కోచ్‌లకు గాను ఎనిమిది కోచ్‌లు విడిపోగా.. మిగతా రైలు సియోహరా స్టేషన్‌కు చేరగా.. రాయ్‌పూర్ సమీపంలో ఎనిమిది కోచ్‌లు నిలిచిపోయాయి. ఈ ఘటనపై గార్డ్ సమాచారం అందించడంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత ఎస్‌పి ధరమ్ సింగ్, పోలీస్ సర్కిల్ సర్వం కుమార్, కొత్వాల్ కిషన్ అవరాత్ బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం కోచ్‌లను రైలుకు అనుసంధానించారు. రైలులో ఉన్న ప్రయాణికుల్లో ఎక్కువగా పోలీస్ ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులే ఉన్నారు. ఈ ఘటన అనంతరం రైల్వేగేట్ వద్ద అధికారులు బస్‌లను ఆపి.. అభ్యర్థులను గమ్యస్థానాలకు పంపారు. ఈ రైలు ఘటనతో పలు రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ధాంపూర్ రైల్వే స్టేషన్‌లో పంజాబ్ మెయిల్ దాదాపు 2 గంటల పాటు నిలిచిపోయింది. ధాంపూర్‌లో స్టాపే లేని జననాయక్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లపై తీవ్ర ప్రభావంపడింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. అదే మార్గంలో మరో రైలు వచ్చి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

వాయనాడ్ బాధితులకు రూ.23 లక్షల చెక్కు అందజేత



తిరువనంతపురం : వాయనాడ్ బాధితులకు సహాయక చర్యల కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేరళ రాష్ట్ర కమిటీ రూ.23 లక్షల విరాళాల చెక్కును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఆదివారం అందజేసింది. అంతకుముందు బాధితులకు సహాయం, సహాయక చర్యల కోసం ఐద్వా రూ.35 లక్షల విరాళాలను అందించింది.

ధారవి అభివృద్ధి హుళక్కేనా?

భూ సేకరణలో అదానీకి సవాళ్లు
580 ఎకరాల కోసం ఆపసోపాలు



ముంబయి : ఆసియాలో అతి పెద్ద మురికివాడల్లో ఒకటైన ముంబయిలోని ధారవి ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడం కోసం అవసరమైన భూమిని సేకరించేందుకు కోటీశ్వరుడు గౌతమ్ అదానీ నేతృత్వంలోని జాయింట్ వెంచర్ కంపెనీ ఆపసోపాలు పడుతోంది. ధారవి మురికివాడ న్యూయార్క్ సెంట్రల్ పార్కు పరిమాణంలో మూడు వంతులు ఉంటుంది. భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యల కారణంగా ధారవి రీడెవలప్‌మెంట్ ప్రణాళిక ఇబ్బందుల్లో పడింది. ధారవి మురికివాడ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉంది. భారత్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందంటూ పాలకులు పలుకుతున్న ప్రగల్భాలను అది అపహాస్యం చేస్తూ కన్పిస్తుంది.

ధారవి ప్రాంతంలో 594 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న మురికివాడను ఆధునిక సిటీ హబ్‌గా మార్చేందుకు అదానీ గ్రూపు గత సంవత్సరం 619 మిలియన్ డాలర్ల బిడ్‌ను సొంతం చేసుకుంది. అయితే అదానీ గ్రూపునకు ఆది నుండీ సమస్యలే ఎదురవుతున్నాయి. కాంట్రాక్టును దక్కించుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి అదానీ గ్రూపునకు అవాంఛిత లబ్ది చేకూరిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఇప్పుడు తాజాగా ఆ గ్రూపు కొత్త సవాళ్లు ఎదుర్కొంటోంది.

ధారవి ప్రాంతంలో 2000వ సంవత్సరానికి ముందు నివసించిన వారికి అభివృద్ధి చేసిన భూమిలో ఉచితంగా ఆవాసాలు నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. ఇళ్లు కోల్పోయిన సుమారు ఏడు లక్షల మందికి గృహాల నిర్మాణం కోసం 580 ఎకరాలు అవసరమవుతాయి. వీరికి ఇళ్ల నిర్మాణం కోసం అదానీ గ్రూపు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రాలేదు. తమ వద్ద అవసరమైన భూమి ఉన్నప్పటికీ అదానీ గ్రూపుతో చేయి కలిపేందుకు ప్రభుత్వ సంస్థలు సముఖత చూపడం లేదు. ముంబయిలో ఒక్క అంగుళం స్థలం దొరకడం కూడా గగనమేనని ధారవి రీడెవలప్‌మెంట్ అథారిటీ అధిపతి ఎస్‌వీఆర్ శ్రీనివాస్ చెప్పారు. భూమి లభించనిదే ప్రాజెక్టు ముందుకు సాగడం అసంభవమని ఆయన అన్నారు.

పది లక్షల మందికి గృహనిర్మాణం చేపట్టాలని ఈ ప్రాజెక్ట్ నిర్దేశించుకుంది. అయితే అది అంత సులభంగా కన్పించడం లేదు. మార్చిలో ప్రాజెక్ట్ తన సర్వేను మొదలు పెట్టింది. ఏడు సంవత్సరాలలో నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని అత్యంత ఖరీదైన రియల్ ఎస్టేట్ మార్కెట్లలో ముంబయి ఒకటి. అక్కడ రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్ని తాకుతుంటాయి. భూమి దొరకడం చాలా కష్టంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ధారవిని తిరిగి అభివృద్ధి చేయడం పెను సవాళ్లతో కూడుకున్న పని అని అదానీ గ్రూప్ అంగీకరిస్తోంది. అయినప్పటికీ ఆ ప్రాంతంలో భవిష్యత్తులో కోటీశ్వరులు నివసిస్తారని బీరాలు పలుకుతోంది.

జమ్మూకాశ్మీర్‌లో ఆప్ తొలి జాబితా

అసెంబ్లీ ఎన్నికలకు ఏడుగురు అభ్యర్థులు ఖరారు

శ్రీనగర్: సెప్టెంబర్ 18 నుంచి మూడు దశల్లో పోలింగ్ జరిగే జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆదివారం ఏడుగురు అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. పుల్వామా నుంచి ఫయాజ్ అహ్మద్, ముదస్సిర్ హసన్ (రాజ్‌పుర), షేక్ ఫిదా హుస్సేన్ (దేవ్సర్), మోహిసిన్ షఫ్తకత్ మిర్ (దురు), యాసిర్ షఫి మట్టో (దోడా వెస్ట్)ను పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిపింది.

ఇక సెప్టెంబర్ 18న తొలి దశ పోలింగ్ జరగనుండా, 25న రెండో దశ పోలింగ్, అక్టోబర్ 1న మూడో దశ పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. ఇక మొత్తం 90 నియోజకవర్గాలకు గాను తొలి దశలో 24 స్థానాలకు పోలింగ్ జరగనుండగా, రెండో దశలో 26, తుది దశ పోలింగ్‌లో 40 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. కాగా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య పొత్తుపై కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సుర్జేవాలా కీలక వ్యాఖ్యలు చేశారు.

మూగవోయిన స్వతంత్రం

పిల్లాడు గట్టిగా ఏడ్చినా
అరచేతులతో వాడి నోరు మూయాలి
పక్కింటి పద్మం నిదుర చెదిరి
సింహంలా మారకముందే
సంతోషం వచ్చినా సంబరం సైలెంట్ గా సాగిపోవాలి
బర్తుడే కేకు కోసినా చప్పట్ల శుభాకాంక్షలు
మన చెవులకు మాత్రమే వినబడాలి
సొంతింటి సమాజం కుళ్ళుకోకముందే
సూటిగా చెప్పాలంటే చిన్నప్పుడు తరగతి గదిలో
సూది రాలిన శబ్దం వింటూనే ఉండాలి
ఈ ఇంట్లోకి వచ్చినప్పుడు
ఉన్న పిల్ల మొక్కలు చెట్లవుతున్నయి
ఈ ఊబిలో దిగినప్పుడు ఉన్న అద్దె వెయ్యి... రెండువేలు
రెండువేలు... నాలుగువేలయ్యి కూర్చుంది
ఉన్న నేత కూలీ కాస్తా కరోనా పుణ్యమా అని
వెయ్యి తగ్గి కూలీ బ్రతుకుని వెక్కిరిస్తున్నది
అయినా బతుకు పోరాటం పదునుగానే ఉన్నది
పాత సంవత్సరం జెర్రిపోతులా పారిపోయి
కొత్త ఏడాది పగలబడి నవ్వుతూ వచ్చినా
గోడకు మేకు కొట్టి
క్యాలెండర్ వేల్లాడగట్టు ఆలోచన మానుకోవాలి
నల్లా నీళ్ళు రాకపోయినా అరవడానికి లేదు
గది గడ్డి గది మైదానం ఉంటె ఉండూ పోతె పో
ఒక కోడిపిల్లను పెంచడానికి వీల్లేదు
పక్కింటి గంజి తాగిన విశ్వాసం
పగలు రాత్రి మొరుగుతున్నా
ఏ కుక్కపిల్లనూ తెచ్చుకోవడానికి ధైర్యం చాలదు
కాళ్ళకు షరతులు కట్టుకుని కదలాలి
ఏ అర్ధరాత్రి గేటు తెరిచినా
తెల్లారే మూట ముల్లె సర్దుకోవాలి
వాక్ స్వతంత్రం ఏమాత్రమూ పనిచేయదు
విరామ సమయం శత్రువవుతుంది
కాలం ముల్లుగ్ర పట్టి పొడుస్తూనే ఉంటది
కండలు కరిగే ఆలోచనలు మొద్దువారకుండా
నిత్యం పనికి పోయే సుప్రభాతం పాడాలి
ఖర్చులు పోగెయ్యకుండా
ఉపవాస దీక్షకు నీళ్ళొదులుకున్నామా
తాకట్టులో ఉన్న సొమ్ము
గంపగుత్తా అమ్ముకోవాల్సిందే
అద్దె ఇల్లు
బలవంతపు పన్ను గుంజే తెల్లదొర అవతారం
బతుకంతా ఊడిగం చేసినా బాకీ తీరని భాగోతం
తిండికి కాకపోయినా కిరాయి కొంప కడుపు నింపడానికి
పని పాట ఎత్తుకుని తీరాలి
జేబుకు వడ్డీ లెక్కల తూట్లెన్నున్నా
బకాసురుడి అన్నంబండిలా డబ్బు మూటగట్టాలి
అప్పుడెప్పుడో నాయిన తీర్థయాత్రల కొరకు
పైస పైసా దాచినట్టు నెలనెలా రూపాల
ముడుపు అప్పజెప్పాలి
ఠంచనుగా వచ్చే ఒకటో తారీకు కోసం
నడుము విరిగిపోయేలా వొళ్ళొంచి రావాలి
నిజం మాట్లాడాలంటే
ఇక్కడ ఉన్న నరకం ఇంకెక్కడా ఉండదు
ఏ దేవుడో శాపం పెట్టినట్టు ఏ దూలం మీదనో ఉన్న
ఏ పిచ్చుక గూడో చెరిపేసినట్టు ఏ పాపానికి ఈ శిక్ష
పావురాళ్ళు ఎగరేసే మంత్రులు ఎక్కడా
ప్రభుత్వం నిర్మించిన పేదల ఇండ్ల పథకాలకు
రిబ్బెన కత్తిరింపు ఎప్పుడో గానీ
జాతకం చెప్పే చిలుక
పంజరంలో ఉన్నట్టు జీవితం.

- గజ్జెల రామకృష్ణ, 8977412795

నవతెలంగాణ దర్వాజ 4
సోమవారం 26-8-2024 ‖ కరీంనగర్

ఆశ

నా బాల్యం చూస్తుండగానే కరిగి పోయింది.
ఇప్పుడదో మసక చీకటి.
నా కొడుకుతో ఆడుకుంటూ
దాన్ని వెనక్కి తెచ్చుకోవాలనుకున్నాను, కుదర లేదు
చదువు చదువు అంటూ వాణ్ని చావ గొట్టాను.
నా మనుమల్తో గడపాలను కుంటే
వాళ్ల తండ్రి నా పాత్రను తీసుకున్నాడు.
పిల్లలతో స్నేహం చెయ్యాలని ఆశ
కాని వారి మిత్రులు వారికున్నారు.
నా గతించిన కాలాన్ని ఎంత వివరించినా వారి కెక్కదు
వారి వర్తమానమే నాకు సరిగ్గా అర్థం కాలేదు
ఇక వారి కళ్లల్లోని భవిష్యత్తు



నా అవగాహనకు దూరం.
చిరకాలం జీవించాలని కాదు గాని
కనీసం వారి వేదిక పైన
బ్యాక్ డ్రాప్ గానైనా ఉండాలని ఆశ.

- డా॥ ఎన్. గోపి

గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు

నవ్యాంధ్ర రచయితల సంఘం సారధ్యంలో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్- శంకరం వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు ఆగస్టు 29న ఉదయం 10 గంటలకు విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో గిడుగు జాతీయ భాషా సాహిత్య కళా సేవా రంగాల పురస్కారాల ప్రదానం, తెలుగు భాషా పరిరక్షణపై కవి సమ్మేళనం వుంటాయి. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ సభాధ్యక్షత వహించే ఈ వేడుకలకు టి.డి.జనార్ధన్, వైయస్సార్ శర్మ, కంఠంనేని రవిశంకర్, జెల్ది విద్యాధరరావు, శ్రీమతి కాంతికృష్ణ, శంకరం, యలవర్తి ధనలక్ష్మి, కె. శ్రీనివాస్ గౌడ్ హాజరవుతారు. వివరాలకు: కలిమిశ్రీ, 9246415150.

నవలల ఆహ్వానం

ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం 2024 సంవత్సరానికి గాను నవలలు ఆహ్వానం పలుకుతున్నారు. 2020 జులై నుండి 2024 జూన్‌లోపు ప్రచురింతమైన నవలలు 4 ప్రతులను ఆగస్టు 31 లోపు 'నిధి, ఇంటి నెంబర్ : 2 - 4 - 1449 అశోక కాలని, హనమకొండ 506001 (తెలంగాణ)' చిరునామాకు పంపాలి. వివరాలకు ఫోన్ : 9701000306.

- అరసం వరంగల్ అధ్యక్షులు

మినీ కథల పోటీకి ఆహ్వానం

కీ.శే. భావరాజు సత్యన్నారాయణ మూర్తి గారి 89వ జన్మదిన సందర్భంగా వారి ధర్మపత్ని శ్రీమతి భావరాజు రాజ్యలక్ష్మి (విశాఖపట్నం) గారు 'సాహితీ కిరణం ' పత్రిక సౌజన్యంతో ఒక మినీ కథల పోటీ నిర్వహిస్తున్నారు. కుటుంబ నేపథ్యంతో మానవతా విలువలు కలిగిన 300 పదాలకు మించని కథలను ఆగస్ట్ 31 లోపు పంపాలి. చిరునామా: ఎడిటర్ సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, రోడ్ నెం.3, అలకాపురి, హైదరాబాద్-500102. సెల్:9490751681.

- పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు

9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక, దోహా, ఖతార్ సంయుక్త నిర్వహణలో నవంబర్ 22-23, 2024 తేదీలలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు దోహా మహానగరంలో జరుగుతుంది. ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, బహెరైన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమాన్, అబుదాబి, రాస్ అల్ ఖైమాహ్ మొదలైన అనేక స్థానిక దేశాల తెలుగు సంఘాలు (సహకార సంస్థలు) పెద్ద ఎత్తున ఈ సదస్సులో పాల్గొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషా, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

- వంగూరి చిట్టెన్ రాజు

బడి పిల్లల కథల పోటీ 2024

మాచిరాజు బాలసాహిత్యపీఠం బడిపిల్లల కథల పోటీ నిర్వహిస్తోంది. ఆరు నుండి 10వ తరగతి చదువుతున్న పిల్లలు ఈ ప్రాంతం వారైనా ఎ4 రెండు పేజీల నిడివితో కథలను సెప్టెంబర్ 30లోపు ప్లాట్ నెం.619, 621, ఫ్లాట్ నెం.301, జ్యోతి క్రెస్ట్, డిఫెన్స్ కాలనీ, సైనిక్‌పురి, సికింద్రాబాద్- 500094. ఇతర వివరాలకు 9000080396.

దీనావస్థలో తెలుగు భాష



ఆగస్టు 29 మన మాతృభాషాదినోత్సవం. కాళ్లమీద పడ్డా సరే కడుపు చించుకోవాలనిపించే దినం. మాతృభాషను ఖూనీ చేసేవాళ్ల కళ్లు తెరవాల్సిన దినం. ఇదంతా చెవిటివానిముందు శంఖం ఊదినట్టు ఔతుందేమోననే భయం వెన్నాడినా వెరవకూడని సందర్భం!

తెలుగు భాష రోజురోజుకు ఎంతగా భ్రష్టుపట్టిపోతోంది! యాభై అరవయ్యేళ్ల క్రితం కొందరే రచనలు చేసేవారు. వారి రచనలలో భాష నిర్దిష్టంగా ఉండేది. నిజానికి, రచనలు చేయనివారిలో సైతం చాలా మందికి కొంత భాషాజ్ఞానం ఉండేది. ఇప్పుడు పరిస్థితి విరుద్ధంగా ఉందనే వాస్తవాన్ని కాదనగలమా? సరైన భాషను రాసే నైపుణ్యాన్ని సొంతం చేసుకునేందుకు అంకితభావంతో కృషి చేయాలనే సంకల్పం, శ్రద్ధ, ఓపిక లేకపోవడం ఈ దయనీయ పరిస్థితికి ప్రధాన కారణం. అసలు, భాష సరిగ్గా ఉండవలసిన అవసరమే లేదని వాదించేవాళ్లూ ఉన్నారు. సరైన భాష అవసరాన్ని తెలిపేవాళ్లను వీళ్లు దబాయిస్తారు, ధిక్కరిస్తారు! కవులకు, రచయితలకు నిఘంటువులు అవసరం లేదు అనే మరో విడ్డూరమైన వాదం ప్రబలివుంది. పండితభాషలో రాసే అవసరం లేకపోయినా పదస్వరూపాల కచ్చితత్వాన్ని నిర్ధారించుకునేందుకు (ఆ పదాలు సరళమైనవే కావచ్చు) నిఘంటువులు ఉండొద్దా?

రచనలలో భాష బాగుండటం మాత్రమే ముఖ్యమని ఎవరూ అనరు, అనకూడదు కూడా. ఉదాహరణకు, కవిత్వం రాస్తే అందులో భావుకత, రసం, మనసును ఆకట్టుకునే గుణం, కదిలించే శక్తి... మొదలైన వాటికి ఎక్కువ ప్రాధాన్యమివ్వడం సబబే. అంత మాత్రాన భాష ఎలా ఉన్నా ఫరవాలేదనడం ఎంతవరకు సమంజసం? అర్థమైతే చాలు అనే అభిప్రాయమైతే మరీ దారుణం. ఇటువంటి అభిప్రాయాలకు లెజిటిమెసీ (న్యాయబద్ధత) లభిస్తే అది చాలా ప్రమాదకరం. ఎందుకంటే, రచనలు చేసేవాళ్ల దృష్టిలో భాష అప్పుడు పూర్తిగా అప్రధానమైపోతుంది. మరికొందరిలో భాష సరిగ్గా రాకపోవడంకంటె నిర్లక్ష్యం, తొందర ఎక్కువగా ఉంటాయి. అందుకే భాషాదోషాలను చెక్ చేసుకోకుండా ఆదరాబాదరాగా రాసిపడేస్తారు. రాసినదాన్ని ప్రచురణకు పంపేముందు ఒకటికి పదిసార్లు సరిచూసుకోవడం చాలా అవసరం. నిజానికి, అచ్చైన తర్వాత కూడా చూసుకోవాలి (పుస్తకంగా తెచ్చేముందు). కొన్ని సామాజిక మాధ్యమాల్లో ఐతే ఒక్క చుక్క/ బిందువు (full stop) కూడా లేకుండా వరుసగా నాలుగైదు వాక్యాలు కనిపిస్తున్న సందర్భాలు అనేకం! భాషకు విరామ చిహ్నాలతో సంబంధం లేదనుకోవడం సరైనది కాదు. ఈ విషయం గురించి కూడా కొందరు వెటకారంతో వ్యాఖ్యానించడం దురదృష్టకరం. కవిత్వంలో ఆధునికత ప్రవేశించడం మంచిదే కానీ, ఆధునిక కవిత్వంలో భాషానిర్దుష్టతకు విలువ లేకపోడం బాధను కలిగించే విషయం. ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే, మన మాతృభాషలో నవ్యత ఉండాలని మొత్తుకుంటున్నాం, ఇంగ్లీషులాంటి పరభాషలో కాదు!

ఎలాంటి వడపోత లేకుండా నేరుగా ప్రచురణకు ఆస్కారమిచ్చే సామాజిక మాధ్యమాలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. ఐతే, వీటిలో కొన్ని అద్భుతమైన రచనలు చోటు చేసుకుంటున్నాయి. కానీ, వాటిలో కూడా భాషాదోషాలు కనిపించడం దురదృష్టం.

పెద్దపెద్ద తప్పులను వదిలిపెట్టి, కనీసం ప్రాథమిక భాషాదోషాలు లేకుండా రాసినా అది కొంతవరకు ఊరటనిస్తుంది కదా! ఉదాహరణకు ఊహాశక్తి, ప్రశ్నాపత్రం, దారాసుతులు మొదలైన పదబంధాలను అలా కాక నిర్దుష్టంగా రాయగలిగేది పండితులు, భాషావేత్తలు (linguists) మాత్రమే. అందరిలో ఇంత కచ్చితత్వాన్ని ఆశించడం లేదు. ఒక కవితా సంపుటిలో పదిచోట్ల శబ్దంకు బదులు శబ్ధం అనే

ఎలాంటి వడపోత లేకుండా నేరుగా ప్రచురణకు ఆస్కారమిచ్చే సామాజిక మాధ్యమాలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. ఐతే, వీటిలో కొన్ని అద్భుతమైన రచనలు చోటు చేసుకుంటున్నాయి. కానీ, వాటిలో కూడా భాషాదోషాలు కనిపించడం దురదృష్టం. పెద్దపెద్ద తప్పులను వదిలిపెట్టి, కనీసం ప్రాథమిక భాషాదోషాలు లేకుండా రాసినా అది కొంతవరకు ఊరటనిస్తుంది కదా!

పదం కనిపించిందంటే, అది అచ్చుతప్పు కాదని వెంటనే చెప్పవచ్చు. ఇటువంటి ప్రాథమిక భాషాదోషాలు ఎక్కువగా చోటు చేసుకున్నప్పుడు, కవిత్వస్ఫూర్తి గాఢంగా ఉన్నా దాన్ని మంచి కవిత్వంగా అంగీకరించలేం. ఏ రచనకైనా భాష పునాదిలాంటిది. బలహీనమైన పునాదుల మీద కట్టిన భవనాలు పైకి అందంగా కనిపించినా వాటిలో దృఢత్వం తక్కువ కనుక, అవి ఎక్కువ కాలం నిలువలేవు. అందుకే, ఎవరి రచనలకు వాళ్లు నిష్కర్ష గల 'అక్షర పరీక్షకులు'గా మారాలి. మారకపోవడమే కాకుండా అలా మారినవాళ్లను గేలి చేసే సంప్రదాయమొకటి మొదలైంది. ఇదిగో, ఇటువంటి వ్యక్తుల మూలంగానే తెలుగు భాష ఈనాడు ఇంత ఘోరమైన స్థితిలో ఉంది. మళ్లీ వీళ్లే తెలుగు భాష



ఎలనాగ

ఘోరంగా భ్రష్టుపట్టిపోతోంది అని వ్యాఖ్యానిస్తారు, అవకాశం వచ్చినప్పుడు!

ప్రతి అక్షరాన్ని కరెక్ట్‌గా రాయాలనే స్పృహ, తపన, సంకల్పం లేనివాడు, అలా రాసేందుకు ప్రయత్నించనివాడు ఉత్తమ సాహితీవేత్త కాలేడు. లోపాలతో కూడుకున్న భాష (defective language) వలన ఏర్పడే వైకల్యం (handicap) రచయితలు ఉన్నతస్థాయి పురస్కారాలను పొందటానికి అవరోధంగా మారే అవకాశముంది.

అసలు, తెలుగును బోధించేవారికే తెలుగు సరిగ్గా రాని దీనమైన స్థితిలో ఉన్నాం. దీనికి గల కారణాలలో విశ్వవిద్యాలయాల అలసత్వాన్ని ముందుగా చెప్పుకోవాలి. ఇక్కడ పట్టా పొంది బయటికి వచ్చినవాళ్లు స్కూళ్లలో, కాలేజీలలో పిల్లలకు పాఠాలు చెబుతారు. కాబట్టి విశ్వవిద్యాలయాలలో బోధనా ప్రమాణాలు, పరీక్షా ప్రమాణాలు ఉన్నతస్థాయిలో ఉండాలి. నిజానికి, ఇక్కడ పరీక్షలు రాసేవాళ్లకు స్కూలుస్థాయిలోనే సరిపడా భాషాజ్ఞానం అందాలి. కానీ అందడం లేదు. అంటే పిచ్చి కుదిరితేనే పెళ్లవుతుంది, పెళ్లైతేనే పిచ్చి కుదురుతుంది అనే విషమ పరిస్థితి అన్నమాట!

ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో పత్రికలకు ఉన్న బాధ్యత అంతా ఇంతా కాదు. పత్రికలు ఎంత శక్తిమంతమైనవంటే, అవి ఏ పదస్వరూపాలనైతే మళ్లీ మళ్లీ వాడుతాయో వాటిని పాఠకులు స్వీకరిస్తారు, అవి దోషాలతో కూడుకున్నవైనా! అంతే కాదు, కొన్ని దశాబ్దాల పాటు ప్రజల నాలుకలమీద నాట్యమాడింతర్వాత అవి ఒకవిధంగా ఒప్పులుగా మారిపోతాయి! అలా మారడంలో అన్యాయం ఏమీ లేదు కానీ, అవి అట్లా తప్పుగా స్థిరపడిపోకుండా ముందుగానే జాగ్రత్త వహించలేమా?

ప్రస్తుత దీన పరిస్థితికి కారణం ఒక్కరు కాదు, ఎందరో. అందరూ ఆత్మవిమర్శ చేసుకుని బాధ్యతతో ప్రవర్తిస్తే, తెలుగు భాష తీరులో మెరుగుదల కనిపించవచ్చు. అటువంటి మంచి సమయం తొందరగా రావాలి.

మాతృభాషా దినోత్సవం ఆగస్టు 29 సందర్భంగా...

S/o మాణిక్యం ఇప్పుడెలా ఉన్నాడు?

"లోలోపల కవిత్వపు వెలుగున్నవాడికి అది మసకబారుతుందేమోనన్న చింత ఉండదు" అని పలికిన సన్నాఫ్ మాణిక్యం ఇప్పుడెలా ఉన్నాడు?

అవును ఇప్పుడు S/o మాణిక్యం ఏం ఆలోచిస్తున్నాడు? వాక్యాల నడ్డి, ముడ్డి విరిచిన అదే బాటలో పయనిస్తున్నాడా? లోనంతా, మేనంతా దుర్వ్యాపారమే, దుర్వాణిజ్యమే అని అన్నాడు కదా!

"వురేయ్... ఉరేయ్... మనిషి వైతే ఇటు రా వినియోగదారుడు మాత్రమే అయితే అటుపో" అంటూ వినియోగదారుడు అనగానేమి? మనిషి అంటే ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు ప్రకటనల రూపంలో జారీ చేస్తూ ఉన్నాడు. ఒకానొక రంజాన్ రోజున అవును నేను సెక్యులర్‌నే అని ప్రకటించాడు. అవును ఇప్పుడు సన్నాఫ్ మాణిక్యం ఫాదర్ ఆఫ్ తనయ పూర్ణిమ, జైత్రమాణిక్యంగా అయ్యాక ప్రపంచాన్ని ఎలా చూస్తున్నాడు, ఎలా కొలుస్తున్నాడు? మెటాఫర్లతో ఆటలాడిన ఇమేజ్లలో మాట్లాడిన కవి ఇప్పుడీ కవితలో చూడండి...

"నిదురించే పిల్లలను/ బడికి పంపేందుకు లేపకు/ వాళ్ల కలలు మెలకువలో జారిపోతాయి/ కలలు ఏమైతేనేం/ పిల్లలు లేచి బడికి పోవడమే ముఖ్యం/ ఎన్ని స్వప్నాలో పిల్లల గురించి!/ బడికి పంపాక కూడా/ కలలే కలలు/ పిల్లలు నిద్ర లేచాక/ కలలకు మాత్రం ఏం పని/ అందుకే ఇక్కడ అంతా ఖాళీ!" (పిల్లలు..కలలు, ఫేస్ బుక్ నుండి)

ఈ కవిత చదివాక మనం కూడా ఖాళీ అవుతాం. పిల్లల పట్ల ఎంత దయ కలిగి ఉండాలో, అంత దయను నిజంగా మనం చూపామా, మనం ఎంతసేపూ మనవాడు ఇది కావాలి, అది కావాలని మన కలలే నిజం కావాలని అనుకుంటాం గానీ అటువైపు చిట్టి హృదయాల్లోని కలల గురించి ఆలోచించలేక పోయినందుకు ఇప్పుడు పశ్చాతాపడినా దానికి విలువ ఉండదు.

కవిత్వానికి చలనశీలత ఒక లక్షణం. సమాజంలో నిత్యం అనేక పరిణామాలు, సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అక్కడెక్కడో ఒక యుద్ధం జరుగుతుంది. మనలాంటి మనుషులు చనిపోతారు. మన పిల్లలు లాంటి పిల్లలు తెల్లటి గుడ్డలో చుట్టి వేయబడతారు. ఆ దృశ్యాలను చూసిన కవి మనసు అల్లకల్లోలం అవుతుంది. కవిత్వానికి సంబంధించి ప్రకృతి, మానవ సంబంధాలు ఇవి రెండూ ఎప్పటికీ అరిగిపోని వస్తువులు. అయితే కవి వాటిని చూసే తాజాతనం, దృష్టి మీద ఆ కవిత నిలబడుతుంది. తాను చూసిన ఒక సంఘటన లేదా అక్కడెక్కడో జరుగుతున్న యుద్ధమో, ఆ యుద్ధ పర్యావసనాలో కవిలో కల్లోలం రేపినప్పుడు తక్షణ స్పందనగా కవిత పుడుతుంది. **"ఎవరిదీ జాగా?/ ఆట బొమ్మలు చనిపోయాయని పిల్లలు శోకిస్తారు/ ఆడుకుంటున్న బొమ్మల్లాంటి పిల్లలు మరణించారని తల్లులు శోకిస్తారు/ చిట్టితల్లులూ.. చినచిన్న తండ్రులూ క్షతగాత్రమై/ నెత్తురోడుతూ రోదిస్తారు/ పిల్లల్ని పెంచుకుంటూనే పిల్లలను హతమార్చుకుంటాం/ గుండెలు యుద్ధశకటాలుగా రాకెట్లుగా బాంబర్లుగా మోగుతుంటాయ్!/ ప్రపంచమే మోసగించినప్పుడు/ ఇక ఏంచేస్తాం/ యుద్ధం మొదలు పెడతాం/ మోసం మీద, వంచన మీద.../ బొమ్మ చనిపోయిందని పిల్లలేడుస్తారు/ బొమ్మల్లాంటి పిల్లలను బ్రతికించుకునేందుకు/ తల్లులు దుఃఖ దుఃఖంగా పరుగులు పెడతారు/ యుద్ధమూ ఆట వస్తువే.."** (23.12.23, ఫేస్బుక్ నుండి)

ఇక్కడ ఎక్కడా సంక్లిష్టత లేదు. తత్పూర్వ కవితా వ్యాకరణాన్ని కఠినంగా శిక్షించడం లేదు. కవితలోకి మనం ప్రవహించాలి లేదా మనల్ని కవితైనా ప్రవహించేటట్లు చేయాలి.


కవిత శీర్షిక చాలా విభిన్నంగా ఉంది. శీర్షికలు ఎప్పుడూ కవితకు ఒక రిఫరెన్స్‌లా ఉండాలి. కచ్చితంగా కవితలో ఆ పదం ఉండి తీరాల్సిన అవసరం లేదు. ఇక్కడ ఎవరిదీ జాగా అనడంలో యుద్దానికి కారణమైన మౌలిక ప్రశ్న ఉదయిస్తుంది. అది ఎవరిదీ కానప్పుడు, యుద్ధం ఎందుకు?

కవులలో ముఖ్యంగా ఉండాల్సిన లక్షణాల్లో నిజాయితీ ఒకటి. కానీ దురదృష్టవశాత్తు చాలామంది కవులలో అది ఉండటం లేదు. చెప్పేదొకటి చేసేదొకటి. తను కూడా దానికి అతీతమేం కాదంటూనే ఆత్మ విమర్శ చేసుకున్న తీరు మనల్ని ఆలోచింపజేస్తుంది. ప్రతి కవి జీవితంలో ప్రతి సందర్భంలో తనని తాను ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎంతో హృద్యంగా మనం తీసుకుంటూనే ఉన్నాం గానీ ఇవ్వడం మర్చిపోయాం అంటూ ఎత్తిపొడుపుగా ఆయన అంటున్నా, అవును నేను పరమ సెక్యులర్‌ని అనే మాట కచ్చితంగా మన మెదడును తొలుస్తుంది. నిజంగా నేను ఒక సెక్యులర్ నేనా అనే ప్రశ్న మనల్ని నిలబడుతుంది. అవును నేను పరమ సెక్యులర్‌ని అనే కవితను పరిశీలిస్తే నికార్సైన కవి ఎలా ఉండాలో తెలుస్తుంది.

చాలామంది కవిత్వం అభిప్రాయాన్ని కవిత్వంలో పొందుపరుస్తారు. అలాగే కొంతమంది ఒక కవితని ఎలా రాయాలో చెబుతూ ఉంటారు. కొంతమంది ఆ కవితలు రాసేటప్పుడు ఎదురయ్యే కష్టాలను కూడా చెప్తారు. మన అనుభవాలను పాల చెంబులాంటి గుండెల్లో నుంచి కొలుస్తూ పుస్తకాల్లోకి ఒంపుతూ ఉంటాం అంటాడు. కవితను రాసే కవిని పండించే రైతుతో పోలుస్తూ ఈ కవిత సాగిన విధానం కొత్తగా ఉంటుంది.

"దిగుబడి తగ్గిందని విచారిస్తావు/ నిజానికి నువ్వు అక్కడ ఏమీ విత్తలేదని పంట చేతికి అందలేదని అంటాడు/ ఏం చేయాలో దిక్కు తోచదు, కొత్త విత్తనాలు కనుగొనేందుకు బయలుదేరుతారు" అంటాడు. నిజానికి ఇక్కడ విత్తనం అంటే కవిత్వ వస్తువు. మనం అనుభూతి చెందనపుడు, ఆ భావాన్ని అనుభవించనప్పుడు అది వస్తువుగా మారదు ఒక మంచి కవితగా మారదు. సరుకు అయిపోతుంది. పెన్ను మూసేస్తాడు.

"కొత్త కాలాన్ని కళ్ళతో చూద్దామని/ నేను కూడా ఎర్రని యాక్టివా/ TS04 EX2437 మీద రోడ్డెక్కాను/ నిన్ననో మొన్ననో పిల్లలడిగారు/ కారు కొనుక్కుందాం నాన్నా అని/ నయా సాల్ కి ముబారకో కదా.../ స్కూటర్ మెకానిక్/ పాత మరకల చొక్కానే తొడుక్కున్నాడు/ అంతే..."



ఇక ఇక్కడి నుంచి ఈ కవితని మనమే పూరించుకోవచ్చు. మామూలు మాటల్లోనే అసాధారణ భావాన్ని కలిగించడం ఈ కవిలో ఉన్న మరో ప్రత్యేక లక్షణం. విలక్షణమైన ఆలోచనలు, శబ్దార్థాల ప్రత్యేక ప్రయోగాలు పాఠకుల్ని ఆకర్షిస్తాయి.

"అతను బాల్యంలో/ బూస్టూ, కాంప్లాను అయ్యాడు/ మరి శైశవంలో అతడు/ బేబీ ఆయిల్ సబ్బు అయ్యాడు" కవిత ఇలా ప్రారంభమవుతుంది. జీవితంలో వస్తువు ఎలా భాగం అవుతుందో చెప్పాడు.

"పెళ్లి మాత్రం అనేక ప్రకటనల్లో/ కనిపించే మోడల్స్ అందరూ కలిసిన/ ముఖంతో అయింది"

ఈ వాక్యాలు చదివిన పాఠకుడు ఒక్కసారిగా కుదేలవుతాడు. హఠాత్తుగా ఆగిపోతాడు. అయితే కవి కవితలోని తర్వాత వాక్యాలు వస్తువు మనిషిని ఏం చేస్తుందో చెప్తాడు. అతనికి చాలా కాలంగా ఒక కోరిక ఉందంటాడు. ఎన్నో వస్తువులు కాగలిగిన అతను, ఎంతో జీవితాన్ని అనుభవించిన ఆ వ్యక్తిలో ఒక చిత్రమైన కోరికతో ఉన్నాడు. అయితే అది విన్నాక మనం చిత్రం అనుకోకూడదు. నొసలు, ముక్కు, పెదవులు విరవకూడదు.

మిత్రులారా అప్పుడెప్పుడో అలా ఉండి, కాలం మారే కొద్ది అటో ఇటో మారిపోయిన, సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చిన రాసిన వాక్యాలపై కూడా నిలబడలేకపోయిన ముందు తరం కవులు గురించి కావచ్చు, మనలాంటి కవుల గురించి కావచ్చు. అది చదువుతూ ఉంటే వేషాలు మార్చిన గాయకులు, ప్రభుత్వపరమైన కవులు, రంగులు మార్చుకున్న వాక్యాలు గుర్తుకు వస్తాయి. ఈ కవి రాసిన అంతరింపూ, ఒక, జలదరింపూ కవిత చదివితే. కవిత 2012 లో ఉంటుంది. వీలు ఉంటే చదవండి. మనం కూడా అలా అవుతామా అలా అయిపోయామా చెక్ చేసుకుందాం.


"కవుల మట మేము/ కవన మట మాది/ ఏ ఒక్కడిని మార్చలేకపోయిన వాళ్ళం/ నాలుగు ధైర్య వచనాలు మాత్రమే చెప్పగలం/ చెవులు వైరస్ లేనట్లే మనిషికి లేవ్" (Man or microbe), (ఫేస్ బుక్ నుండి)

సన్నాఫ్ మాణిక్యం అంటే అందరికీ తెలిసే ఉండొచ్చు, అతని పేరు రావులపాటి సీతారాం.

(సీతారాం గారికి దేవులపల్లి రామానుజరావ్ అవార్డు వచ్చిన సందర్భంగా)

డాక్టర్ గోపాల్ సుంకర, 9492638547

నివాళి ఆధునిక సాహితీ దిగ్గజం కాశీభట్ల



తెలుగు సాహితీ వినీలాకాశంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆధునిక సాహితీదిగ్గజం కాశీభట్ల వేణుగోపాల్. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలు నగరంలోని రెవెన్యూ కాలనీలోని స్వగృహంలో సోమవారం తుదిశ్వాస విడిచారు. 1974లో ఆంధ్రపత్రికలో 'రంగనాయకి లేచిపోయింది' అనే కథతో కాశీభట్ల తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. 'నేను- చీకటి' అనే నవలతో వెలుగులోకి వచ్చిన ఆయన రచనలు 'ఘోష', 'తపన', 'దిగంతం', 'మంచు-పువ్వు', 'తెరవని తలుపులు', 'అసత్యానికి ఆవల', 'సంగతం' విమర్శకుల ప్రశంసలు పొందాయి. వినూత్న కథనాలు, కొత్తదనంతో కనిపించే పాత్రలు, ఆకట్టుకునే రచనా శైలి ఆయన స్వంతం. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయన రచనలు నవ్య కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిశాయి. వీరి రచనలు మానవ సంబంధాలను, మనుషుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న కోణాలను, మనుషుల మధ్య ఉన్న అంతరాలను సునిశితంగా పరిశీలించి రాసేవారు. సుమారు 12కు పైగా నవలలు, వందకు పైగా కథలు రాశారు.

పరిశోధనలో ఆయనది విశిష్టమైన శైలి



పోరాటాల సాహిత్య చరిత్ర పరిశోధకుడు, విలువైన రచనలు తెలుగు సమాజానికి అందించిన ప్రజా రచయిత కె. ముత్యం. అట్టడుగు ప్రజలు నిర్మించే చరిత్ర, సాహిత్య చరిత్ర మౌఖిక రూపాల్లోనే ఎక్కువగా నిక్షిప్తమై ఉంటుందని, ప్రజల నాల్కల మీద ఆడుతుంటుంది. అలాంటి గాథలను, మౌఖిక కళా రూపాలను అన్వేషిస్తూ పోతే మహోన్నత పోరాటం కొత్త అర్థాలతో కళ్ల ముందు నిలుస్తుంది. ఆ పోరాటాలు చేసిన మట్టి మనుషుల సాహసం దృశ్యం కడుతుంది. ముత్యం పరిశోధక విద్యార్థిగా శ్రీకాకుళ ఉద్యమం, సాహిత్యం గురించి చేసిన పరిశోధన ఈ కోవకు చెందినదే. తెలుగు సాహిత్య కళారంగాలను శ్రీకాకుళ పోరాట సాహిత్యం అపారంగా ప్రభావితం చేసిందనే చారిత్రక సత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. అందువల్లే ముత్యం తన పరిశోధనను శ్రీకాకుళ సాహిత్య పరిశీలనతోనే మొదలుపెట్టారు. అక్కడి పోరాట వాస్తవికతను చాలా వరకు గ్రహించగలిగారు. నిజామాబాద్‌లోని బాచుపల్లికి చెందిన ముత్యం ఎంఏ తెలుగు విద్యార్థిగా ఉస్మానియా యూనివర్సిటీలో అడుగుపెట్టారు. అక్కడే విద్యార్థి ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. పీహెచ్‌డీ కోసం బెనారస్ యూనివర్సిటీలో చేరినప్పుడు ఆయన శ్రీకాకుళ ఉద్యమం- సాహిత్యంపై దాని ప్రభావం అనే అంశాన్ని ఎంచుకున్నారు. పీహెచ్‌డీ గ్రంథం 'శ్రీకాకుళ ఉద్యమం - సాహిత్యం' 1993లో అచ్చయింది. అనంతర కాలంలో శ్రీకాకుళం, ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు చెందిన ఉద్యమ, సాంస్కృతిక కార్యకర్తలు, నాయకుల జీవితాలను, వారి పోరాట అనుభవాలను ఈ తరానికి ఆయన అందించారు. ఆయనకు అట్టడుగు చరిత్రను, సాహిత్య చరిత్రను పరిశోధించే సంవిధానం పట్టుబడింది. ఆయన మిగతా రచనల్లో కూడా దాన్నే అనుసరించారు. ఆయనకు ముందు, ఈ విధమైన పరిశోధనా విధానాన్ని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో 1940ల్లో బెంగాల్ రచయిత్రి మహాశ్వేతాదేవి అనుసరించారు. ఆయన పరిశోధనలు సాగిన కాలం కూడా ప్రత్యేకమైనదే.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
సోమవారం | ఆగస్టు 26, 2024 | www.navatelangana.com

జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశానికి తరలిన ఆటో డ్రైవర్లు



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం హనుమకొండలో జరుగు రాష్ట్ర ఆటో జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆటోలతో 50 మంది ఆటో డ్రైవర్లు ఆదివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ సంక్షేమ బోర్డు 1000 కోట్లతో ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్ జీవనభృతి నెలకు రూ.12000 ప్రకటించాలన్నారు. చనిపోయిన ఆటో కుటుంబాన్ని ప్రభుత్వం ఎక్స్‌గ్రేషన్ ప్రకటించాలని, లైసెన్స్ కలిగిన డ్రైవర్‌కు 80 శాతం సబ్సిడీపై బ్యాంకు రుణం ఇవ్వాలన్నారు. రాష్ట్ర జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రణాళిక కార్యచరణ రూపొందించుకోవడం కోసం ఏర్పాటు చేయనైనదని తెలిపారు. ఈ సమావేశానికి కరీంనగర్ జిల్లా నుంచి కరీంనగర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారు సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు మద్దుల రామ్‌గోపాల్ రెడ్డి, నరసింహ నాయక్, సొల్లేటి ఆంజనేయులు, మట్టం సాగర్, నాగుల మహేందర్, కొత్తూరి సత్యనారాయణ, దాసరి ప్రభాకర్, మారం సంపత్, పడాల రాజమౌళి, గొర్రె రవీందర్, మచ్చ శ్రీనివాస్, వాల్క రమేష్, నరేష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మేయర్ అమెరికా పర్యటనపై సర్వత్రా విమర్శలు

బాధ్యతలు అప్పజెప్పకుండానే వెళ్లిన వైనం

- నగరంలో సీజనల్ వ్యాధులు విజృంబిస్తున్నా పట్టింపేది..
- డిప్యూటీ మేయర్‌కు బాధ్యతలు అప్పజెప్పకపోవడంపై విమర్శలు
- కలెక్టర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు
- చట్టం ప్రకారం ఇన్‌చార్జి మేయర్‌గా అవకాశం కల్పించాలని డిప్యూటీ మేయర్ వినతి

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ కార్పొరేషన్ నగర ప్రథమ పౌరుడైన మేయర్ యాదగిరి సునీల్‌రావు తన కుటుంబంతో సొంత పనులకు కోసం అమెరికా వెళ్లడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణికి ఎలాంటి బాధ్యతలు అప్పగించకుండా అమెరికాకు వెళ్లడం నగరంలో ఇప్పుడు చర్చనీయంశంగా మారింది. నగరంలో సీజీనల్ వ్యాధులు, డెంగ్యూ, నీటి సమస్య, పారిశుధ్య సమస్యలతో పాటు పలు అభివృద్ధి పనులు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వినాయకచవితికి సంబంధించిన వేడుకలుకు ఇప్పటికే నగరంలో మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన మేయర్ పనిమీద అమెరికా వెళ్లడం.. కనీసం డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపోవడంపై స్థానిక కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ మేయర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి సైతం కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ 33 రోజులు అమెరికాకు వారి సొంత పనులకు వెళ్లినందున తనకు మేయర్‌గా ఇన్‌చార్జి బాధ్యత ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మేయర్ వచ్చే వరకు ఆ స్థానంలో డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తారా లేదా అనే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని అటూ పాలక వర్గం, డిప్యూటీ మేయర్, నగర ప్రజలు ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు బీసీ మహిళ అని చిన్నచూపుతోనే డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలేదని బీసీ సంఘాలు వాపోతున్నాయి.

తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ 2019

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 లోని సెక్షన్ 34 (2)లో ఉన్న విధంగా మేయర్ 15 రోజులు అందుబాటులో లేకుంటే డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించాలని చట్టం చెబుతుంది. దీనికితోడు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా, ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకుండా పాలనను గాలికి వదిలేసి వ్యక్తిగత పనులపై నెల రోజుల పాటు అమెరికా వెళ్లిన మేయర్‌పై చర్యలు తీసుకోవాలిన కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు నగరపాలక సంస్థ 44 డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఇన్‌చార్జి బాధ్యత ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

మేయర్ సునీల్‌రావు 33 రోజులు అమెరికాకు సొంత పనుల నిమిత్తం వెళ్లినందున తనకు మేయర్‌గా ఇన్‌చార్జి బాధ్యత ఇప్పించాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాని కలెక్టర్ వినతిపత్రం ఇచ్చారు. చట్టం మేరకు తనకు అవకాశం కల్పించాలని కోరారు.

డిప్యూటీ మేయర్‌కే బాధ్యతలు అప్పగించాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్



నగర ప్రజల్లో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మేయర్ సునీల్‌రావు అమెరికా వెళ్లిన నేపథ్యంలో డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉండే. బీసీ మహిళ అనే చిన్నచూపుతోనే బాధ్యతలు ఇవ్వకుండా, నగర ప్రజల సమస్యలు గాలికి వదిలేసి వెళ్లడం దారుణం. ఇప్పటికైన కలెక్టర్ ప్రజానసమస్యలను దృష్టిలో ఉంచుకొని డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పాలని కోరుతున్నాం. లేకుంటే ఆందోళనలు చేస్తాం.

హైడ్రాలా కరీంనగర్‌లో కాడ్రా ఏర్పాటుకు సీఎం, మంత్రుల సహకారంతో కృషి

- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తాం..
- బీఆర్ఎస్ హయాంలో యథేచ్ఛగా భూములు కబ్జా
- ప్రభుత్వ, పేదల భూముల పరిరక్షణకు ముఖ్యమంత్రితో చర్చిస్తాం
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు



నవతెలంగాణ - భగత్‌నగర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో కరీంనగర్‌లో ప్రభుత్వ, ప్రయివేటు భూముల పరిరక్షణకు కృషిచేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. కరీంనగర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో గత బీఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల ప్రభుత్వ, పేదల భూములు యథేచ్ఛగా కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రాలాగా కరీంనగర్‌లో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి, మంత్రులను కోరుతామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం వెలిచాల రాజేందర్‌రావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్, చుట్టుపక్కల గ్రామాల్లో బీఆర్ఎస్ హయాంలో గత పదేండ్ల కాలంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా అయ్యాయని తెలిపారు. భూ కబ్జాదారులు, అక్రమ కట్టడాల నిర్మాణదారులు, ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తామని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గపు ఆలోచన చేసే వారి ఆట కట్టిస్తామని హెచ్చరించారు. పేదల భూములను కబ్జా చేసిన కొంతమంది కార్పొరేటర్లు, నాయకులను ప్రభుత్వ ఆదేశాలతో కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి అరెస్టు చేసి జైలుకు పంపించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీపీ అభిషేక్ మహంతి నిజాయితీగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

ఎల్ఎండీ రిజర్వాయర్ ఫుల్‌ట్యాంక్ లెవెల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున జరిగాయని, రిజర్వాయర్లు అక్రమణాలు పెరిగాయని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన గత పాలకులు, నాయకులే దగ్గరుండి ప్రభుత్వ భూముల కబ్జాలో ప్రధాన పోషించడం దారుణమని మండిపడ్డారు. పేదల భూములను సైతం కబ్జా చేసి జలగల్లాగా పట్టిపీడించారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. హైడ్రాలాగా కరీంనగర్‌లో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిసి విన్నవిస్తామని పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమవంతు కృషిచేస్తామని అన్నారు. హైడ్రాలాగా కరీంనగర్‌లో కాడ్రా వ్యవస్థను వివిధ శాఖల అధికారులతో పాటు పోలీసు అధికారులతో కలిసి ఒక అథారిటీని ఏర్పాటు చేసేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు కబ్జా చేయాలంటే అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టేలా చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో పేదల భూములను లాక్కున్న వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, పేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. చెరువులు, కుంటలు, కాలువల కబ్జాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పారు. అక్రమ నిర్మాణాలు, భూముల కబ్జాపై ఉక్కుపాదం మోపుతూ ఇకముందు కబ్జాలు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని తెలిపారు. పేదలు ఎలాంటి ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

పేద కుటుంబాలను అండగా సీఎంఆర్ఎఫ్

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - గంగాధర



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకుండా సీఎంఆర్ఎఫ్ ఆదుకుంటుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర (మధురానగర్) చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పేదలు సీఎంఆర్ఎఫ్ పథకం కింద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంత్రి లత, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ - వీణవంక

మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకన్నారు. విలేజ్ పెట్రోలింగ్ డ్యూటీ చేస్తుండగా గ్రామ శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మానేరు వాగు నుండి ఇసుక తీసుకుపోయి జమ్మికుంట పట్టణంలో అమ్ముకుంటున్నామని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్ సింగారపు వేణు ప్రసాద్, ఓనర్ సింగారపు రాజలింగుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్‌ల జారీతో దళారీ వ్యవస్థ నిర్మూలన

- చెక్ పోస్టుల పటిష్టంతో ఆదాయం పెంపు
- ధాన్యం కొనుగోళ్ల పెంపుపై ప్రత్యేక నజర్
- గంగాధర ఏఎంసీ చైర్‌పర్సన్ జాగీరపు రజితాశ్రీనివాసరెడ్డి
- నవతెలంగాణకు ఇంటర్వ్యూ..



ఏఎంసీ చైర్‌పర్సన్ జాగీరపు రజితాశ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ - గంగాధర

ట్రేడ్ లైసెన్స్‌ల జారీతో ధాన్యం జీరో దందాకు చెక్‌పెట్టి దళారీ వ్యవస్థ లేకుండా చేస్తామని గంగాధర ఏఎంసీ చైర్‌పర్సన్ జాగీరపు రజితాశ్రీనివాసరెడ్డి అన్నారు. గంగాధర వ్యవసాయ మార్కెట్ పాలక వర్గాన్ని కొత్తగా నియామకం చేయగా, ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన జాగీరపు రజితాశ్రీనివాసరెడ్డి నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో అంశాలు వెల్లడించారు. తన రెండేండ్ల పదవీకాలంలో వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని, ధాన్యం కొనుగోళ్లతో పురోగతి సాధిస్తామంటూ దీమా వ్యక్తం చేశారు.

నవతెలంగాణ : ఏఎంసీ అభివృద్ధికి ప్రణాళికలు?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్ల పెంపు, ధాన్యం జీరో దందాకు చెక్‌పెట్టి వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తాం. సీజన్‌కు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి ఏఎంసీని ప్రగతి పథంలో నిలపాలనే లక్ష్యంగా పెట్టుకున్నం. ఎప్పటికప్పుడు పాలకవర్గంతో చర్చించి ముందుకు సాగుతం.

నవతెలంగాణ : ఏ సీజన్‌లో ఏవి కొనుగోలు చేస్తారు ?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : ప్రతి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు చేస్తం. కందులు, మక్కలు, పత్తి కొనుగోళ్లు చేపడుతం. రైతులు దళారీల చేతుల్లో మోసపోకుండా అన్ని రకాల చర్యలు చేపట్టి ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తం.

నవతెలంగాణ : ఏ ప్రమాణికంతో ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తారు ?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : ఎటువంటి లైసెన్స్ లేకుండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసే జీరో వ్యాపారులు పెరిగారు. దీంతో ఏఎంసీకి తీవ్ర నష్టం వాటిల్లుతుంటే, రైతులు మద్దతు ధర లేక నష్టపోతున్నరు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు చేసే జీరో వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు చేపడుతం. తద్వారా రైతులకు, ఏఎంసీకి లాభం చేకూరేలా చొరవ తీసుకుంటం.

నవతెలంగాణ : చెక్‌పోస్టుల ద్వారా ఎటువంటి ఆదాయం వస్తది ?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : వ్యాపారులు ధాన్యం, పత్తి కొనుగోలు చేసి మిల్లులకు పంపే ప్రతి లారీకి ఈ రిసిప్టు కట్ చేస్తం. ప్రభుత్వం ఏఎంసీకి మరో రకమైన కొత్త పన్ను విధింపునకు అవకాశం కల్పించింది. ఆయా సంతల్లో కొనుగోలు చేసి ట్రక్కులు, వ్యాన్లలో తరలించే పశువులు, ఆవులపై కూడా పన్ను విధిస్తాం. ఏదేని పశువు ఒక్కంటికి రూ.100 మార్కెట్ సెస్ పన్ను విధిస్తం. మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మరింత పటిష్టం చేసి పన్ను వసూళ్లు పెంచుతం.

నవతెలంగాణ : గోదాంలను ఎలా వినియోగంలోకి తెస్తారు ?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : ఏఎంసీలో ధాన్యం కొనుగోళ్ల పెంపుతో గోదాంలలో ధాన్యం బస్తాలు నిల్వ చేస్తం. ప్రతి సీజన్‌లో కొనుగోలు చేసే ధాన్యం నిల్వలకు ఎంతగానో ఉపయోగపడుతాయి.

నవతెలంగాణ : పత్తి కొనుగోళ్ల కోసం చర్యలు?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : ఏఎంసీలో పత్తి కొనుగోలు చేసే ట్రేడ్ లైసెన్స్ వ్యాపారులను పెంచి కొనుగోళ్లు చేపడుతం. ప్రభుత్వం కల్పించే మద్దతు ధర చెల్లించి రైతులకే మేలు చేస్తం.

నవతెలంగాణ : కొనుగోళ్లు లేక డీలా పడిన ఏఎంసీన పురోగతి వైపు తీసుకెళ్లడం కష్టం కదా ?

ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి : ఎంత కష్టమైనా గంగాధర ఏఎంసీకి పూర్వ వైభవం తెస్తం. గత పాలక వర్గాలు కొనుగోళ్లపై శ్రద్ధ చూపక ఏఎంసీ అస్తవ్యస్తమైన మాట వాస్తవమే. ఏఎంసీని గాడిలో పెట్టడానికి పాలక వర్గంలో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ ప్రతి సీజన్‌లో కొనుగోళ్లను పెంచడం, పత్తి కొనుగోళ్లపై దృష్టి సారించడం వల్ల ఏఎంసీకి మళ్లీ పూర్వ వైభవం వస్తదని ఆశిస్తున్నం.

బీపీ మండల్‌కు ఘన నివాళి



నవతెలంగాణ - కరీంనగర్

బీసీ రిజ్వేషన్ల పితామహుడు బీపి మండల్ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆదివారం కరీంనగర్‌లోని బీసీ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో బీపీ మండల్ 106వ జయంతి కార్యక్రమంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పుడు ఓబీసీలు విద్యా ఉద్యోగంలో అనుభవిస్తున్న 27 శాతం రిజర్వేషన్లు బీపీ మండల్ చేసిన సిఫార్సు వలన అని తెలిపారు. వెనుకబడిన తరగతుల స్ఫూర్తి ప్రదాత బిందేశ్వరి ప్రసాద్ మండల్ అని కొనియాడారు. బీసీ లు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించి ముఖ్యమంత్రి పదవిని వదులుకున్న బీసీ పక్షపాతి అని తెలిపారు. రెండో జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా బీసీ లకు 27శాతం రిజర్వేషన్లు సాధించిన గొప్ప మానవతావాది అని తెలిపారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీ జనగణన చేసినప్పుడే ఆ మహనీయునికి నిజమైన నివాళి అర్పించనట్లు అవుతుందని తెలిపారు. బీపి మండల్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, రాష్ట్ర కార్యదర్శి గాజె రమేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, గాజె ప్రజ్యోత్, దుప్పటపల్లి మురళి, బియ్యని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి
- ఉత్కంఠగా కొనసాగిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు



పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

సైక్లింగ్ చేయడం వల్ల చాలా ఆరోగ్యంగా ఉంటామని, కార్యకలాపాలను ఎలాంటి ఆటంకం లేకుండా చేపట్టవచ్చని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వెలిచాల క్రాస్‌రోడ్ వద్ద జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు, రాష్ట్ర స్థాయి పోటీల ఎంపిక ఏర్పాటుచేశారు. అనంతరం నరేందర్‌రెడ్డి, సైక్లింగ్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా బాధ్యులతో కలిసి వివిధ విభాగాల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా సంఘం రాష్ట్ర స్థాయి పోటీలను ఇదివరకే రెండు సార్లు పోటీలను నిర్వహించి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. అదే స్ఫూర్తిని తరగని ఉత్సాహంతో చాలా గొప్పగా అవిష్కరించామని తెలిపారు. రాష్ట్రస్థాయికి అండర్-14 బాలురు విభాగంలో వి.గౌతమ్, ఎం.నాగసాయి, వి.నేహార్, కె.అనిరుధ్, పి.శ్రేష్, బి.అక్షయ్, అండర్-16 బాలురు విభాగంలో ఎస్ఆర్.లికిల్ అనిష్, అండర్-18 బాలురు విభాగంలో వి.హృతికేష్, బి.నిషద్జ్, జె.సంజన్ అదిత్య, 23పైన పురుషులు వి.వేణుగోపాల్, రెహన్, కోటేశ్వర్ రావు, అఖిల్, సి.అశోక్ కూమార్ గెలుపుపొందారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా బహుమతులను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో సుమారు 150 వివిధ విభాగాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ఎస్.వేణుగోపాల్, ఇనుగుర్తి రమేష్, అరవింద్ బాబు, ఆన్వేష్, కరీంనగర్ జిల్లా టీం మేనేజర్లు, కోచ్లు, ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతి నిర్మాణానికి మహిళా సాధికారికతే సోపానం

ఐఫియా, టీఆర్టీఎఫ్ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్

పరిపూర్ణంగా అభివృద్ధి చెందిన సమాజం కావాలన్నా, జాతి నిర్మాణం అభివృద్ధి కావాలన్నా తప్పనిసరిగా మహిళా సాధికారిత అవసరమని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సాధికారికత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దానికనుగుణంగా మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి సంతకం మహిళా సాధికారిక కోసం ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అఖిల భారత విద్యా సంఘాల సమాఖ్య (ఐఫియా)-తెలంగాణా రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళా ఆత్మ గౌరవాన్ని పెంపొందించడానికి ఆర్టీసీ బస్సు ప్రయాణంలో మహిళకు ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటికే రూ.81కోట్ల ప్రయాణాలను ఉచితంగా అందించామని తెలిపారు. సాధికారతలో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాల మౌలిక వసతుల కల్పనలో మహిళలను సంపూర్ణ భాగస్వామి చేశామన్నారు. విద్యలో తారతమ్యాలు తగ్గించడం ద్వారా మహిళా సాధికారత సాధించవచ్చు అని, ఉపాధ్యాయులుగా ఈ పాత్రే గణనీయమైనదని, ఉపాధ్యాయుల సంక్షేమానికి వారి న్యాయమైన కోరికలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే 10సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ప్రమోషన్లు కల్పించడం ద్వారా ఈ రాష్ట్రంలో 25,000 మంది ఉపాధ్యాయులు లబ్ధిపొందాలని తెలిపారు. అతి త్వరలోనే ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఆ విధంగా గ్రామీణ బాల బాలికలకు ఉన్నతమైన విద్యా అవకాశాలు కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఆకాశంలో సగం-అవనిలో సగం అని ఎంతచెప్పుకొన్నా ఇంకా మహిళా సాధికారత పూర్తి కాలేదని, మరింత మహిళాభివృద్ధి జరగాలని, అందుకు ప్రధానంగా మహిళలందరూ విద్యావంతులు కావాలన్నారు. అన్ని రంగాలలో నిర్ణయాత్మక శక్తి మహిళలే కావాలని, అప్పుడు మాత్రమే అభివృద్ధి చెందిన సమసమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం ప్రొఫెసర్ వై.ప్రశాంతి మాట్లాడుతూ.. బాలికలను రక్షించేందుకు సమాజం మొత్తం నడుం బిగించాలని సభికులందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరై మాట్లాడారు. ఈ సమావేశానికి అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య అధ్యక్షుడు సుధీర్ కుమార్ అధ్యక్షత వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి నబ్ కుమార్ కర్మకార్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్థ సలహాదారు కె.సుబ్బారెడ్డి, స్టాన్లీ కళాశాలల చైర్మెన్ కె.కృష్ణారెడ్డి, కావలి అశోక్ కుమార్, కటకం రమేష్, మా రెడ్డి అంజిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ డాక్టర్ సురేఖ, కటకం రవికుమార్, మిథిలేష్ శర్మ, మనోజ్ కుమార్, కమల్ లోచక్, కిరణ్ జ్యోతి, శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

సెక్రెటరీ, ఏఈఓ, ఏఎన్ఎంకు సన్మానం



నవతెలంగాణ - చొప్పదండి

మండలంలోని రుక్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శి మహితాబ్, ఏఈఓ ప్రసన్న కుమార్, ఏఎన్ఎం లక్ష్మిని ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కర్రె శ్రీనివాస్, చిలుక లింగయ్య, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న, మాజీ ఉపసర్పంచ్ ముద్దసాని చిరంజీవి, నేరుమట్ల మోహన్, సంపత్, రవి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గీతా మందిరంలో కోటి కుంకుమార్చన

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ గీతా మందిరంలో జరుగుతున్న కోటి కుంకుమార్చనలో భాగంగా వాగ్దేవి వనితా క్లబ్ కరీంనగర్ సభ్యులు పాల్గొని కుంకుమ పూజ ఆదివారం నిర్వహించారు. విష్ణు సేవానందగిరి స్వాముల ప్రత్యక్ష పర్యవేక్షణలో 128 కళశాలతో ప్రతినిత్యం అఖండ కుంకుమార్చన పూజ, అభిషేకాలు నెలరోజుల పాటు నిర్వహిస్తున్న క్రమంలో ప్రత్యేకించి వాగ్దేవి క్లబ్ సభ్యులు పూజలో పాల్గొన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు విష్ణు సేవానందగిరి స్వామిని, కార్యక్రమం బాధ్యులు రాధాస్వామిని సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, క్లబ్ జాయింట్ సెక్రెటరీ హరిని, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జ్యోతినగర్‌లో ఉట్టి వేడుకలు



నవతెలంగాణ- భగత్‌నగర్

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్‌లోని జ్యోతినగర్ శ్రీసాయి యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. శ్రీసాయి యూత్ సభ్యులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొని వీక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పారమిత విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల చైర్మెన్

నవతెలంగాణ - కరీంనగర్

ఈ నెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరగనున్న 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినీ ఎస్.అశ్విక ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యాలయంలోని గ్రౌండ్‌లో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినీని పాఠశాల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ అనూకర్ రావు, వీయూఎం ప్రసాద్, వినోద్ రావు, రమణ హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు రవీంద్ర పాత్రో, భవానీ, సరిత, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలు, తాయత్తుల పేరుతో మోసం చేస్తున్న ముగ్గురిపై కేసు



నవతెలంగాణ - వీణవంక

మంత్రాలు, తాయత్తుల పేరుతో మోసం చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు వీణవంక ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పైత్యం బాలరాజు, గంధం రాజు, పైత్యం చందు వచ్చారు. నల్ల శ్రీనివాస్‌రెడ్డికి, ఆయన ఇంటికి శని పట్టిందని, దోషం పోవాలంటే పూజలు చేస్తామన్నారు. లేకుంటే చనిపోతావని భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా రూ.9వేలు, మరో ఇద్దరి వద్ద రూ.11వేలు తీసుకున్నారని, మంత్రాలు పూజల పేరుతో మమ్మల్ని భయపెట్టించి మోసం చేశారని పోలీసులకు నల్ల శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వీణవంక ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

6

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

జగిత్యాల

సోమవారం | ఆగస్టు 26, 2024 | www.navatelangana.com

పోలీస్ స్టేషన్‌లో శ్రమదానం



పెగడపల్లి స్టేషన్‌లో శ్రమదానం చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఎస్సై రవి కిరణ్ ఆధ్వర్యంలో పరిశుభ్రత శ్రమదానం చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రవి కిరణ్ మాటాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని. ప్రతి ఒక్కరూ వారి ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్తయ్య, పోలీస్ సిబ్బంది సంపత్, రవీందర్, ఎల్లయ్య, తిరుపతి, రాజేష్, రమా, మమత, వెంకటేష్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ విధానం మసిపూసి మారేడుకాయ చేయడమేనని, దానిని అంగీకరించేది లేదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భువనేశ్వర్ అన్నారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్టు, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించ కపోవటం విచారకరమని, పైగా ఐచ్ఛికం అని పేర్కొనటంలోనే అసలు మోసం ఉందన్నారు. ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీసును బట్టి 50 శాతం పెన్షను ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత

- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- చదువులకే పరిమితమవడంతో పెరిగిన ఒత్తిడి



నవతెలంగాణ-మల్యాల

'రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడానైపుణ్యాలు నేర్పి, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం ' అని పలు సందర్భాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ ఆచరణలో మాత్రం అది సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. దీంతో క్రీడాలు లేకపోవడంతో వారు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఆట లాడాలనే ఆసక్తి ఉన్నా.. విద్యార్థులకు ఆడిపించే వారు కరువయ్యారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ సాయంత్రం గంటసేపు విద్యార్థులను క్రీడలు ఆడించేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చిన్న వయసులోనే ఆటలకు విద్యార్థులు దూరమవుతున్నారు. దీంతో నిత్యం పుస్తకాలకే పరిమితం కావడంతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో భారీగా వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. మల్యాల మండలంలో ప్రాథమిక పాఠశాలలు 25, ప్రాథమిక ఉన్నత పాఠాలలు 4, ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి. దాదాపు ఈ పాఠశాలల్లో 1800 వందల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీటితో పాటు ఎయిడెడ్, కేజీబీవీ, తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మల్యాల బాలికల, మల్యాల బాలుర, తక్కలపల్లి, తాటిపల్లి, రామన్నపేట పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. మిగతా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయులు కొనసాగుతున్న ఈ5 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వ్యాయామ ఉపాధ్యాయులను కేటాయించారు. మిగతా పాఠశాలల్లో సైతం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఇప్పటికి వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. కొన్ని సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్తగా నియామకాలు జరగడం లేదు. దీంతో మండలంలోని వివిధ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేక తాత్కాలికంగా సర్వశిక్షణ అభియాన్ కింద వ్యాయామ ఉపాధ్యాయులను నడుపుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో సైతం వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతులు అయిపోయినా తరువాత క్రీడలు ఆడుకోనేందుకు విద్యార్థులను ఇంటికి పంపుతున్నారు. ఏడాదికి ఒక్కటికి రెండు సార్లు నిర్వహించే క్రీడల పోటీల్లోనే విద్యార్థులు పాల్గొంటున్నారు. అప్పుడే వారికి క్రీడాలు ఆడుకోనేందుకు సమయం కేటాయిస్తున్నారు. ఆటలకు తగినంత సమయం కేటాయించక విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

క్రీడల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు



ఎన్నో సందర్భాల్లో క్రీడల గురించి గొప్పలు చెప్పే ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల కొరతపై ఎందుకు స్పందించడం లేదు. వెంటనే ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకరావాలి.

– అక్రమ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

బదిలీపై వెళ్తున్న వ్యవసాయ అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న ఫర్టిలైజర్ యజమానులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారి దీపిక, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు నరేష్, శ్యామ్, హరీష్, రవళికలను బదిలీపై వెళ్తున్న సందర్భంగా మండల ఫర్టిలైజర్ షాప్ యజమానులు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే నూతనంగా వచ్చిన వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్‌ను కూడా ఘనంగా సత్కరించారు.కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ అధికారులు చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, రాంప్రసాద్, సతీష్, ఫర్టిలైజర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మున్నూరు కాపు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం



ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌లను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ బండారి గార్డెన్స్‌లో జిల్లా మున్నూరు కాపు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ జ్యోతి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మున్నూరు కాపు సంఘం సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. జగిత్యాల పట్టణంలో గత ఎన్నికల్లో మున్నూరు కాపులు ఉన్న అన్ని వార్డులలో అత్యధిక మెజారిటీ వచ్చింది. దామోదర్‌రావు సహకారంతో రూ.30 లక్షల నిధులు సంఘం భవన అభివృద్ధికి మంజూరు చేసినట్టు తెలిపారు. మున్నూరు కాపు కుల సంఘ సభ్యులకు జిల్లా, నియోజకవర్గ, పట్టణ పరిధిలో అన్ని రకాలుగా రాజకీయ అవకాశాలు కల్పించడం జరిగింది. జగిత్యాల పరిదిలో మున్నూరు కాపుల పక్షాన అన్ని వేళలా అండగా ఉంటాం అని ఎమ్మెల్యే అన్నారు.

యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గెలిపించండి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ప్రశ్నించే గొంతుకగా మీ ముందుకు రాబోతున్నాను అని, మీ అమూల్యమైన ఓటు వేసి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గెలిపించాలని బీంకర్ అఖిల్ అభ్యర్థించాడు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ఇబ్రహీం పట్నం మండల అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న బీంకర్ అఖిల్ మీడియాతో మాట్లాడారు. ఐవైసీ ఆఫ్ ద్వారా సీరియల్ నెంబర్ 5పై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ ధర్మపురి అర్వింద్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, రైతు నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ పంతంగి వెంకటేష్, ఉపాధ్యక్షుడు మహేందర్, జంగిలి నర్సయ్య, మణిరాజ్, రామగిరి శ్యామ్, జంగిల్ రాజన్న బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సింగిల్ విండో చైర్మన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- డెస్క్

కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగారావు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేస్తానని పేర్కొన్నారు.

మిత్రుడికి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలో కొద్దిరోజుల క్రితం ముత్యంపేట గ్రామానికి చెందిన మల్యాల గంగాధర్ అకాల మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు 2002-2003 ఎస్సెస్సీ బ్యాచ్ జమ చేసిన డబ్బులు మొత్తం రూ.23, 516లను శనివారం అందజేశారు.

ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ 43వ వార్డుకు చెందిన మహమ్మద్ హమీద్ తుంటి ఎముక సమస్యతో బాధపడుతూ, శస్త్ర చికిత్స కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవతో 2 లక్షల విలువ గల ఎల్‌ఓసి మంజూరు చేయించి, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హమీద్‌కు చెక్కు అందజేశారు. వెంట నాయకులు జమీల్, షాజి ఫిరోజ్, షానవాజ్ ఉన్నారు.

సేవా భారతి సేవలు మరింత విస్తరించాలి

- వాల్మీకి ఆవాస భవన ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

అఖిల భారత స్థాయిలో సేవా భారతి సంస్థ సేవలు మరింత విస్తరించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో ధరూర్ క్యాంపులో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాస నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి- లక్ష్మణ్, సేవా భారతి అఖిలభారత అధ్యక్షులు పన్నాలాల్ బన్సాలి తదితరులు హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సేవా భారతి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ నిరుపేద విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు 32 సంవత్సరాలుగా వాల్మీకి ఆవాస నిర్వాహకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. చదువుతో పాటు ఉత్తమ విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి లాంటి గొప్ప గుణాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు వాల్మీకి ఆవాసం కృషి చేస్తుందన్నారు. భవిష్యత్తులో సేవా భారతి చేపట్టబోయే ఏ కార్యక్రమానికైన తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవా భారతి ద్వారా నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసం ఎంతోమంది నిరాశ్రయ బాలలకు అండగా నిలిచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఆవాస విద్యాలయానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గీతా విద్యాలయం, వాల్మీకి ఆవాసం తో తనకు, తన కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. 32 సంవత్సరాల క్రితం వాల్మీకి ఆవాసాన్ని ప్రారంభించినపుడు ఒక విద్యార్థిని దత్తత తీసుకొని సహకరించానని తెలిపారు. సేవా భారతి అఖిలభారత అధ్యక్షులు పన్నాలాల్ బన్సాలి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,50,000 సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దేశంలోని ఆరు లక్షల గ్రామాలకు సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సేవా భారతి రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి- లక్ష్మణ్, వేణుగోపాలచార్య కౌశిక, కౌన్సిలర్ రాజకుమార్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆవాస భవన నిర్మాణానికి సహకరించిన దాతలను ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆవాస విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆవాస కమిటీ సభ్యులు డాక్టర్ భీమనాత్ని శంకర్, జీడిగే పురుషోత్తం, మదన్ మోహన్‌రావు, టీవీ సూర్యం, అశోక్ రావు, సంపూర్ణ చారి, మధుకర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, సురేష్, కైలాసం, ఆవాస ప్రముఖ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సెలబ్రిటీలు, సామాన్యులు అందరూ సమానమే..

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ప్రభుత్వానికి సెలబ్రిటీలు, ఇతరులు కానీ ఎవరైనా సమానమేనని కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. చెరువుల ఆక్రమణతో నిర్మాణాలు చేపట్టడం ద్వారా వరద నీరు సమీపంలోని ఇండ్లలోకి చేరుతోందన్నారు. హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల తొలగింపు కోసం హైడ్రా ఏర్పాటు చేయడం, చైర్మెన్‌గా సీఎం ఉండడం అభినందనీయం అన్నారు. బఫర్ జోన్ రక్షణ దిశగా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మహానగరంలో హైడ్రా తీసుకుంటున్న చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణాల్లో కూడా ఆక్రమణాలు పెరిగాయని, ఇక్కడ కూడా హైడ్రా లాంటి విధానం అమలు చేయాల్సి ఉందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్టు చెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో హైడ్రాపై చర్చించిన తర్వాతనే రాష్ట్రంలో ఉన్నా అక్రమ కట్టాలపై చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. జిల్లా పరంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు అధికారం ఇచ్చి, అక్రమణాలపై చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, నాయకులు నిషాంత్‌రెడ్డి కమటాల శ్రీనివాస్, షేక్ చాంద్ పాషా, అనిల్ జంగిలి మహేష్ పాల్గొన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న క్రైమ్
- కొరవడుతున్న పోలీస్ పర్యవేక్షణ

నవతెలంగాణ-పెగడపల్లి



ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని నిత్యం పోలీసు అధికారులు చెబుతుంటారు. దానికి తగ్గట్టు ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారులు, గ్రామస్తుల సహకారంతో మండలంలోని ప్రధాన కూడళ్ళు, ముఖ్యమైనా ప్రదేశాల్లో గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి పని చేయడం లేదు.

పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా తో పాటు బస్టాండ్, అయా గ్రామపంచాయతీలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఏ ఒక్క నిఘానేత్రం పని చేయడం లేదు. మండల కేంద్రంలో నిఘా నేత్రాల వలన దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకుని కేసులను ఛేదించారు.

ప్రస్తుతం రోజూ ఏదో ప్రాంతంలో నేరాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని మాత్రమే కేసులు నమోదవుతుండగా, మరికొన్ని కేసుల వరకు రావడం లేదు. పగలు.. రాత్రి తేడా లేకుండా చోరీలు జరుగుతున్నాయి. వీటిలో కొన్ని పోలీసులు ఛేదిస్తుండగా, మరికొన్ని విచారణ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయంలో నేరాలు ఛేదించడంలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయని ప్రజలు పేర్కొన్నారు.

సీసీ కెమెరాల మరమ్మతులు చేపడుతాం



ప్రజలతో మమేకమై నూతన నిఘా నేత్రాలతో పాటు పని చేయని సీసీ కెమెరాల మరమ్మతులు చేస్తాం. జనరల్, అసెంబ్లీ ఎన్నికలలో పోలీసులు బిజీగా ఉండటంతో జాప్యం జరిగింది. నిఘా నేత్రాల మానిటరింగ్ నిమిత్తం కోసం కొంత ఫండ్ అవసరం. ప్రజల సహకారంతో రిపేర్ చేయించి కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా పునర్ నిర్మాణం చేయించడానికి కృషి చేస్తాం. వర్షాలు, ఈదురు గాలులు, కోతుల బెడతతో వైర్లు తెగిపోవడంతో ఫండ్స్ లేని కారణంగా రిపేర్ చేయించలేక పోయాం.

– రవి కిరణ్, పెగడపల్లి ఎస్సై

బీసీల వెలుగు రేఖ బీపి మండల్

టీబీసీ జేఏసీ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

బీసీలకు రిజర్వేషన్లు కల్పించి సమాజంలో తలెత్తుకొనేలా చేసిన ఘనత బీపీ మండల్‌కే దక్కుతుందని టీబీసీ జేఏసి, సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో టీ బీసీ జేఏసీ, సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నేడు బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు రావడం ఆయన పుణ్యమేన్నారు. కుల గణన జరిగితేనే బీసీలకు న్యాయం జరుగుతుందని ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. మండల్ కమిషన్‌లోని 40 సిఫార్సులను పూర్తిగా అమలులోకి తెచ్చి బీసీల సమగ్ర అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాటు పడినప్పుడే బీపీ మండల్‌కు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి విజయ్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి ములస్తం శివ ప్రసాద్, బీసీ సంక్షేమ మహిళా అధ్యక్షురాలు గంగం జలజ, సింగం పద్మ, విజయ, బక్కశెట్టి లక్ష్మీ, విద్యార్థి జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ధోనూరి భూమాచారి, యువజన, మహిళా, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ బీసీ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నవతెలంగాణ జగిత్యాల టౌన్

జగిత్యాలరూరల్ మండల వెల్దుర్తి గ్రామ మాజీ ఎంపీటీసీ బిరుదుల గంగవ్వ భర్త కిష్టయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి, వారి సేవలను గుర్తుచేసుకున్నారు.అనంతరం గ్రామానికి చెందిన లింగంపల్లి రాజం, రంగు తిరుపతి గౌడ్‌లు గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యుల్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి వెంట మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్‌గౌడ్, నాయకులు శాంతపురావు, రవీందర్‌రావు, బందేలా శేఖర్, కుడుకల లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, వెంకట్‌రావు, శేఖర్, నరేష్ తదితరులు ఉన్నారు.

జగిత్యాలరూరల్ మండల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పంచాయతీరాజ్ అధికారి చీటి శ్రీనివాస్ రావు తండ్రి రిటైర్డ్ హెడ్ మాస్టర్ చీటీ రాంచందర్ రావు అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. వారి వెంట నాయకులు సత్తిరెడ్డి, దనేశ్వర్‌రావు, అజిత్‌రావు, రాజేష్ పాల్గొన్నారు.

కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవకులకు అవార్డుల ప్రదానోత్సవం

నవతెలంగాణ- కోరుట్ల



కుల, మతాలతీతంగా యువత సామాజిక సేవలో ముందుండాలని కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అనిల్ అన్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని హాజీపూరా స్టార్ ఫంక్షన్ హాల్‌లో కోరుట్ల సోషల్ సర్వీస్ "సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెస్ట్ సోషల్ వర్క్ అవార్డు 2024 "ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కరోనాతో చనిపోయిన వారికి అంతక్రియల నిర్వహణ, రక్తదానం, అన్నదానం, పేదింటి ఆడపడుచుల పెండ్లిలకు చేయూత నందించడంతోపాటు పలు సామాజిక కార్యక్రమాలు చేసిన స్వచ్ఛంద సంస్థలకు, నిర్వాహకులకు, సభ్యులకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్ అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మౌలానా కజి బలిక్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, బీఆర్ఎస్ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఎం ఫహీమ్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎ నయీమ్, ఏఐఎం ఐఎం కోరుట్ల పట్టణ అధ్యక్షులు ఎండీ రఫీ, బైతుల్ మాల్ పెద్దవారు, కోరుట్ల సీనియర్ పాత్రికుడు సలీం ఫారుఫీ, ఇలియాస్ ఖాన్, ఎండి చాంద్ పాషా, మిర్జా ముక్రం బైగ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
రాజన్న సిరిసిల్ల
సోమవారం ఆగస్టు 26, 2024 www.navatelangana.com

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి



నవతెలంగాణ - తంగళ్లపల్లి : గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండప నిర్వాహకులు పోలీసు వారి అనుమతిని తప్పనిసరిగా పొందాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం గణేష్ మండప నిర్వాహకులతో సమావేశాన్ని ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ వారు ఏర్పాటుచేసిన వెబ్సైట్ ద్వారా అనుమతి పొందాలన్నారు. నిర్వాహకులు భారీగా డీజే లను ఏర్పాటు చేయవద్దని సూచించారు. గణేష్ మండపాల వద్ద రాత్రిపూట ఇద్దరు తప్పనిసరి పర్యవేక్షణలో ఉండాలన్నారు. పాఠశాలలో ఉన్నచోట గణేష్ మండపాలను ఏర్పాటు చేయవద్దు అన్నారు. మైకులు, సౌండ్‌లను ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలల్లో నిర్వహించే సమయాల్లో పెట్టవద్దన్నారు. గణేష్ నిమజ్జనాలను రాత్రి 8గంటలలోపే ముగించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట సీఐ మొగిలి ఉన్నారు.

ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో యువతకు కొలువులు

- డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆద్వర్యంలో వేములవాడలో జాబ్ మేళా
- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..
- 46కంపెనీలు, తరలివచ్చిన యువతీ, యువకులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నియామక పత్రాలు అందజేస్తున్న ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్

నవతెలంగాణ - వేములవాడ

వచ్చిన ప్రతి అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్‌లో మెగా జాబ్ మేళా ఆదివారం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే హాజరై జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాబ్ మేళాకు జిల్లాతో పాటు హైదరాబాద్ వివిధ జిల్లాలకు చెందిన 46 ప్రైవేటు కంపెనీలు జాబ్ మేళాకు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అక్కడ ఏర్పాటు చేసిన ఆయా సంస్థల స్టాల్స్‌ను సందర్శించారు. ఆయా సంస్థల్లో ఎందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు? ఉద్యోగం చేసేది ఎక్కడ? చేసే పని ఏమిటి? వేతనాలు ఎంత ఇస్తారు? వసతి సౌకర్యం కల్పిస్తారా తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఇటీవల టీచర్ల నియామకానికి మెగా డీఎస్సీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించి, కీ కూడా విడుదల చేసిందని తెలిపారు. అలాగే గ్రూప్-4 ఉద్యోగాలకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొనసాగుతుందని, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కూడా పూర్తి చేసి, మెయిన్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని వివరించారు. దాదాపు ఈ ఎనిమిది నెలల్లో 30వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. హైదరాబాద్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటుగా ప్రైవేటు కంపెనీల్లో యువతకు కొలువులు ఇప్పించేందుకు జాబ్ మేళాలు చేపడుతున్నదని పేర్కొన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత వివిధ అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. యువత ఉద్యోగాలు ఎక్కడ వచ్చినా వెళ్లాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత, తల్లిదండ్రులు భాగస్వామ్యులు కావాలని కోరారు. జాబ్ మేళాలు ప్రతి ఆరు నుంచి ఎనిమిది నెలలకు ఒకసారి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్ ఏజెన్సీ మేనేజర్ మల్లారపు పుష్ప, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సేల్స్ మేనేజర్ హరీష్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థల నుంచి దాదాపు 100మందికి ఈ వేదికగా ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. ఇన్సూరెన్స్ సంస్థల నుంచి ఏజెన్సీ కావాల్సినవారు 9322028863 నెంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

800మందికి కొలువులు..

మెగా జాబ్ మేళాకు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి దాదాపు 3వేల మంది యువతీ యువకులు తరలివచ్చారు. ఉద్యోగుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 1500 మంది ప్రాథమిక పరీక్షలకు ఎంపికయ్యారు. ఫైనల్ పరీక్ష, ఇంటర్వ్యూల అనంతరం దాదాపు 48కంపెనీలు అన్నీ కలిసి 800మందికి ఎంపిక చేయగా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు పంపిణీ చేసి, వారిని అభినందించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పాల్గొన్నారు.



అర్హులైన వారికి నివేశ స్థలాలు అందేలా కృషి చేస్తా..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..
- జర్నలిజానికి అసలైన పునాదులు గ్రామీణ విలేఖరులే..
- జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ విద్యాసంస్థలో ఉచిత విద్య అందించాలి
- టీయూడబ్ల్యూజే, ఐజేయు రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ



నవతెలంగాణ - వేములవాడ

అర్హులైన వారికి నివేష స్థలాలు అందే విధంగా కృషి చేస్తానని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.దేశంలోనే ఎంతో చరిత్ర కలిగిన సంఘంగా గుర్తింపు పొంది, 65ఏండ్లుగా జర్నలిస్టుల సంక్షేమం, భద్రతను భుజాన మోస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయు అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే ఐజేయు రాజన్న సిరిసిల్ల జిల్లా జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి విరహత్ అలీ హాజరై మాట్లాడారు. సంఘంపై రోజురోజుకు ఎంతో గౌరవం, నమ్మకం పెరుగుతుందని, నాడు 30 మందితో మొదలైన సంఘంలో నేడు 15వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఎలాంటి జీతభత్యాలు గాని, కడుపునిండా తిండి గాని, కంటి నిండా నిద్ర గాని లేకుండా పనిచేసేది కేవలం విలేకరులేనని, అలాంటి వారి సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గత పాలకుల వైఖరితో పదేండ్లుగా నిర్లక్ష్యానికి గురైన జర్నలిస్టులు, ఈ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉన్నారని, ఈ ప్రభుత్వం జర్నలిస్టుల అన్ని సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకంతో ఉన్నామని, ముఖ్యంగా హెల్త్ కార్డులతోపాటు ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని కోరుతున్నామని తెలిపారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డికి పదవి ఇచ్చారంటేనే జర్నలిస్టులకు మంచి రోజులు వచ్చినట్లుగా భావిస్తున్నామన్నారు. జర్నలిజానికి అసలైన పునాదులు గ్రామీణ విలేకరులే, గతంలో గ్రామీణ మండల విలేకరులకు ఉద్యోగ భద్రత లేదు కనీస గుర్తింపు కార్డులు ఇవ్వలేని పరిస్థితి ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన విలేకరులకు అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని, విలేకరులకు గుర్తింపుని ఇచ్చేది అక్రిడేషన్ కార్డు అన్నారు. తమేమి గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, కనీసం మనిషి జీవించడానికి కావలసినవి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కనీసం జర్నలిస్టుల మొహం చూడని వ్యవస్థ గత ప్రభుత్వాలదని జర్నలిస్టుల సమస్యలపై జంతర్మంతర్ వద్ద ధర్నా చేసామని, 10 సంవత్సరాలలో చాలా సమస్యలు అనుభవించామని, కనీసం హెల్త్ స్కీమ్ కూడా సరిగా పని చేయలేదని తెలిపారు. అనంతరం కార్యక్రమ విశిష్ట అతిథి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత 30ఏండ్లుగా హైదరాబాద్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వటంతోపాటు జర్నలిస్టుల సంక్షేమానికి, వారి భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలతోపాటు మిగిలిన అన్ని రకాల సమస్యలు పరిష్కరించుకునేందుకు తన వంతు కృషి చేస్తానని, అవసరమైతే ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రూపంలో వివరిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం వాయిస్తే, మా ప్రభుత్వం జర్నలిస్టులకు న్యాయం చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి మొదలుకొని మండల స్థాయి వరకు విలేకరులకు సీఎం రేవంత్ రెడ్డి తప్పకుండా న్యాయం చేస్తాడని నమ్మకం ఉందన్నారు. తన గెలుపులో జర్నలిస్టుల సహకారం ఎన్నటికీ మరువలేనిదని, మీ సేవకుడిగా మీ బాధ్యత తీసుకుంటున్నానని, మీ సూచనలు సలహాలు పాటిస్తూ, మీ కష్టాల్లో పాలు పంచుకుంటూ ముందుకు వెళ్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, రేగుల దేవేందర్, దాసరి దేవేందర్, కాంబోజి ముత్యం, వేములవాడ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, టీవీ నారాయణ, దూలం సంపత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని స్పెషల్ ఆఫీసర్లు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్

నవతెలంగాణ - రామడుగు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతుంటే ప్రత్యేక అధికారులు మాత్రం కానరావడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వ్యాధులతో ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాధుడే లేరన్నారు. మండలంలో రెండు పీహెచ్ సీలు ఉన్నా గ్రామాలలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడం లేదని, కనీసం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా చేయడం లేదన్నారు. గ్రామ కార్యదర్శులు పని చేసే గ్రామాల్లోనే ఉంటూ, ప్రజా సమస్యల మౌళిక వసతులు కల్పించేలా ఉండాలన్నారు.పీహెచ్‌సీలలో సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత సిబ్బందికి అధిక భారం పడుతుందని,వెంటనే ఆసుపత్రిలో సరిపడా సిబ్బందిని నియమంచాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని అన్నారు.గ్రామాల ప్రత్యేక అధికారులు వెంటనే చొరవ తీసుకుని ప్రజలను రోగల బారిన పడకుండా గ్రామాలలో వైద్య సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ,ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరాడు.

డాక్టర్ సుధీర్‌కు గ్రామస్తుల ఘన స్వాగతం

నవతెలంగాణ - తిమ్మాపూర్



రాజస్థాన్‌లోని శ్రీ మహర్షి కళాశాలలో పీహెచ్డీ పూర్తి చేసి గోల్డ్ మెడల్‌ని సాధించిన మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నోముల సుధీర్ గౌడ్‌కు గ్రామస్తులు ఆదివారం ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామంలో గల రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుదీర్ మాట్లాడుతూ..వాస్తు శాస్త్రంలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ ను అందుకోవడం తనకు గర్వంగా ఉందన్నారు. 2021లో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో జ్యోతిర్ వాస్తు శాస్త్రంలో పీజీ పూర్తి చేసిన సుధీర్ గౌడ్ ఐదేళ్లు సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తూ.. ఇంటికి ప్లాన్లు ఇస్తూ, అనుమతుల తీసుకోవడంతోపాటు డిజిటల్ సర్వే, వెంచర్ల లే-అవుట్ ప్లాన్లు అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా తన సేవలను విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. ఇల్లు నిర్మాణం ప్లాన్‌తోపాటు వాస్తు శాస్త్రీయ అనుసారంగా చేయడం చాలా ముఖ్యమని నమ్మి పీహెచ్డీ పూర్తి చేసినట్లు, ఇందుకు తన తల్లిదండ్రులు నోముల సుజాత, శ్రీనివాస్ గౌడ్ తో పాటు సోదరుడు సాయి రామ్ గౌడ్ ప్రోత్సాహం అందించినట్లు సుదీర్ తెలిపారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ మాజీ సర్పంచులు చేరిక

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్తపల్లి వాణి నర్సింలు, రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పడిగెల రవి ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో ఐదు సంవత్సరాల నుంచి సర్పంచులుగా కొనసాగిన వీరు ఆ పార్టీలో విధానాలు నచ్చక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందని ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని మాజీ సర్పంచులు తెలిపారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో 9వ ప్యాకేజీ కింద మల్కపేట రిజర్వాయర్ నుండి వచ్చే కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో మాజీ మంత్రి కేటీఆర్ విఫలమయ్యాడన్నారు. ఎగువ మానేరు సింగసముద్రం గొలుసు కట్ట చెరువులకు నీటిని అందించే తొమ్మిదవ ప్యాకేజీ పనిని సత్వరం పూర్తిచేయించే విధంగా జిల్లా కలెక్టర్‌తో రివ్యూ నిర్వహించామన్నారు. సుమారు రూ.150కోట్లతో పని పూర్తవుతుందని దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పిస్తానన్నారు. మూడు దఫాలుగా రైతుల రుణమాఫీ జరగగా అర్హత ఉండి మిగిలిపోయిన రైతులకు తాను దగ్గర ఉండి మాఫీ చేయిస్తానని రైతులకు మాట ఇచ్చారు. కార్యకర్తలు వారి పోరాట పటిమతో ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. నామినేటెడ్ పదవులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్యకర్తలను పూర్తిస్థాయిలో ఆదుకునే బాధ్యత నియోజకవర్గంలో తాను తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మాజీ జడ్‌పిటిసి ఏలూరు రాజయ్య, మాజీ ఎంపిటిసి కొత్తపల్లి దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కొండాపురం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, కొండాపురం శ్రీనివాస్ రెడ్డి, గంట బుచ్చగౌడ్, చెన్ని బాబు, ఎల్లా గౌడ్, రమేష్, దండు శ్రీనివాస్, దేవేందర్, వంగ మల్లారెడ్డి, గంగయ్య, నంది కిషన్, రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు. .

వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గంగం మహేష్

నవతెలంగాణ - రుద్రంగి

రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరుగగా కార్యవర్గంలో మండల కేంద్రానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు గంగం మహేష్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీ చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్య దర్శిగా అజ్మీర రాందాస్ కోశాధికారిగా కడెం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గంగం మహేష్, జాయింట్ సెక్రటరీలను, ఈసీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారి ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ సీహెచ్ వేణు కిషన్ రావు, ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ గిన్నె లక్ష్మణ్, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ అబ్జర్వర్ ఎన్ శ్రీధర్ హాజరయ్యారు. రుద్రంగి మండల కేంద్రం నుంచి జిల్లా కమిటీకి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గంగ మహేష్‌ను పలువురు క్రీడాకారులు నాయకులు అభినందించారు.



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మండల అధ్యక్షురాలు సంతోషి


ముస్తాబాద్‌లో నిరసన వ్యక్తం చేసిన మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ - ముస్తాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన వంట కార్మికుల మండల అధ్యక్షురాలు సంతోషి ఆధ్వర్యంలో మండల వంట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో వంట కార్మికులుగా పనిచేస్తున్నామని నెల నెలా జీతభత్యాలు ఇవ్వాలని కోడి గుడ్డుకు రూ.5 ప్రస్తుతం ఇస్తున్నారని ఏడు రూపాయలకు పెంచాలని ఒక్కో విద్యార్థికి 20నుంచి రూ.30 వరకు పెంచాలని, వంట కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కార్పొరేట్ వైద్య సదుపాయం ఉచితంగా కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన బాధ్యతలు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ వారికి ప్రభుత్వం ఇచ్చే ఆలోచన చేస్తుందని ఊహాగానాలు వస్తున్నాయన్నారు. ఆ ట్రస్టుకు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వం డబ్బులు నాలుగైదు నెలలకు ఒకసారి ఇచ్చినప్పటికీ విద్యార్థులకు భోజనం ఎంత కష్టమైనా పెడుతున్నామన్నారు. ప్రభుత్వం వంట కార్మికుల సమస్యలు పరిష్కరించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల మధ్యాహ్న భోజన వంట కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ - తంగళ్ళపల్లి



ఆర్థిక ఇబ్బందులు తాళలేక నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో ఆదివారం జరిగింది. మండలంలోని మండేపల్లి కేసీఆర్ నగర్ కాలనీకి చెందిన గోవింద్ సదానందం(38) చేనేత పని చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సదానందం అనారోగ్యం బారిన పడగా రూ.3లక్షలు అప్పుచేసి వైద్యం చేపించినట్లు భార్య భాగ్యశ్రీ తెలిపింది. అప్పటి నుంచి సిరిసిల్ల రైతు బజార్లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనాన్ని సాగిస్తున్నప్పటికీ ఆదాయం సరిపోక అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందుల్లోపడి మద్యానికి బానిసయ్యాడు. ఇలా తాగితే అప్పులెలా తీర్చేదని, కుటుంబపోషణ భారమవుతోందని భార్య నిలదీయగా మనస్థాపంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్న తిరిగి వచ్చి వాంతులు, విరేచనాలు చేసుకోగా ఏజరిగిందని అడిగిన భార్యకు తాను పురుగులమందు తాగినట్లు తెలిపాడు. వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు భార్య భాగశ్రీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

విలీన గ్రామాలను జీపీలుగా మార్చాలి



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్లలో మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్‌లో సమీప ఏడు గ్రామాలను అభివృద్ధి పేరుతో నాడు విలీనం చేశారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి అభివృద్ధి నోచుకోక ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఉపాధి కోల్పోయి, పన్నుల భారం ప్రజలపై మోపిందన్నారు. అసెంబ్లీ ఎలక్షన్ సమయంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా కొనసాగించాలన్నారు. గ్రామపంచాయతీలుగా మార్చే వరకు విలీన గ్రామాల ఐక్యవేదిక సభ్యులకు సీపీఐ తరపున పూర్తి మద్దతు తెలుపుతామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు మీసం లక్ష్మణ్, అజ్జ వేణు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ - వీర్నపల్లి

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలనీ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం వీర్నపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అవుతున్నాయన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు కార్మికులకు అందని ద్రాక్షలాగా చేస్తున్నాయని తెలిపారు. కార్మికులకు వేల్ఫేర్ బోర్డు సంక్షేమలను ప్రయివేట్ కార్పొరేట్ కంపనీలకు టెండర్‌ను పిలవడంతో కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పరం చేసే నిర్ణయం ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27 ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలతో చర్చలను వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమనికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు గుంటుకు నరేందర్, నాయకులు దేవయ్య, బుస రాజాం, అంజయ్య, రాజు ,నర్సయ్య, శంకర్, చంద్రయ్య రాజయ్య ,చిన్న రాజాం, పోషయ్య పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు ఆర్ఎంపీ, పీఎంపీల వినతి



నవతెలంగాణ-గోదావరిఖని:
తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు పాలకుర్తి మండలంలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు ఆదివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రధానంగా ఇటీవల కొంత కాలం నుంచి తమపై దాడులు చేస్తూ కేసులు పెడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పెద్దపల్లి డీఎంహెచ్‌వోతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యేకు ఈసందర్భంగా ఆర్ఎంపీలు, పీఎంపీలు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-గోదావరిఖని:



ఆర్థిక సహాయం అందజేస్తున్న నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ గౌడ్

అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన మెరుగు మహేష్ హారిక దంపతుల కుమార్తె హాసిని ప్రమాదంలో నడుం స్పర్శను కోల్పోగా ఆమె వైద్య ఖర్చులకు నీడ మన 100 రూపాయలు సమాజం కోసం గ్రూప్ నుంచి 5వేలు, నసీమా భరోసా ఫౌండేషన్ ద్వారా మార్గదర్శి దీపక్, శ్రీనివాస్‌ల సహకారంతో 2వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆదివారం నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్ర మంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్, భరోసా అధ్యక్షులు నసీమా,సభ్యులు ఎండి.రెబ్బన్, సతీష్, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఎజీపీగా ఎంపికైన సాయి ఆకర్ష గౌడ్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని సీతానగర్‌కు చెందిన సాయి ఆకర్ష గౌడ్ హైకోర్టు ఏజీపీగా ఎంపికైన సందర్భంగా ఆదివారం ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ హాజరై హైకోర్టు ఏజీపీగా ఎంపికైన సాయి ఆకర్ష గౌడ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంద రమేష్ గౌడ్, రామకష్ణ, మెండే లింగయ్య యాదవ్, గుండు తిరుపతి యాదవ్, జునువాల శ్రీనివాస్ యాదవ్, మహేందర్, గట్టు స్వామి, బుర్ర సదయ్య గౌడ్, చెన్నమల్లు మల్లేష్, సహజ రాజేందర్ తదితరులున్నారు.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోలివాడ ప్రసన్న కుమార్

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర తెలంగాణ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు చెన్నూరి నాగరాజు ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ 46వ డివిజన్ కాకతీయ నగర్‌కు చెందిన యువ నాయకులు మొలుగూరి మహేష్‌తోపాటు పలువురు యువకులు చేరారు. కార్యక్రమానికి ఎన్‌సీపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర ముఖ్య అతిథిగా హాజరై మొగులూరి మహేష్‌తోపాటు పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీపీ పార్టీ జిల్లా నాయకులు చెన్నూరి నాగరాజు, ముజాహిద్‌లు పాల్గొనగా, కాకతీయనగర్‌కు చెందిన యువ నాయకులు మొలుగూరి మహేష్, జిల్లాల అక్షయ్, ఒంటేరు మనోజ్, ఆరెపల్లి కౌషిక్, యండీ. యూసుఫ్, ఆరెపల్లి రమేష్, దుర్గం సంజయ్ తదితరులు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జీఎంలు, నగర పాలక అధికారులతో ఎమ్మెల్యే జూమ్ మీటింగ్



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రామగుండం ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సింగరేణి ఆర్జీ 1, 2 ఏరియాల జీఎంలు డి.లలిత్ కుమార్, ఎల్‌వి.సూర్యనారాయణ, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్, అధికారులతో ఆదివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, లైటింగ్, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, మున్సిపల్ అధికారులు టెండర్ అయిన పనులను కాంట్రాక్టర్స్‌తో త్వరితగతన పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. ముస్లీం మైనార్టీలకు సంబంధించిన కబరస్తాన్ విషయంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి కార్మిక ఏరియాల్లో చెత్తా చెదారాన్ని తొలగించాలని, అదేవిధంగా డబుల్ బెడ్ రూంకు అర్హుల అయిన వారి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఆలయ నిర్మాణం కోసం దాతల సాయం

నవతెలంగాణ-జూలపల్లి
జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో కోదండ రామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం క్రీ॥శే॥ కళ్లెం స్వామిలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారులు మాధవి లత-శైలెందర్ రెడ్డి,దేవేంద్ర-రాజేశ్వర్‌రెడ్డి, ప్రహరీ గోడ నిర్మాణం కోసం 2,00,000ని రూపాయలను, క్రీ॥శే॥ దారబోయిన శశికళ లింగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు జూలపల్లి మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహ యాదవ్-సుభాషిణి ,మధుకర్ శిరీష గ్రానైట్ రాయి కోసం 1,28,016 అందజేశారు. మరుపాక కుమార్ శ్రీలత 30,116, తిగుళ్ళ అజయ్ సంకీర్తన 50,016, పద్మ నరేందర్ 20116,నేరేడు కొమ్మ హరి 15126 బట్టు నిర్మల రాజయ్య 10116, బ్రాహ్మణపల్లి లక్ష్మి కిరణ్‌చారి గుడి గేట్లు విరాళంగా అందించారు.

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని పేదవారికి అందేలా చూడాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- మూడు మండలాల గ్రామ కార్యదర్శులతో సమావేశం



మాట్లాడుతున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని పేదవారికి అందేలా చూడాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని గ్రామాల కార్యదర్శులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు మండలాల్లోని పాఠశాలల అభివృద్ధి కోసం 2 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి సమస్యను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని, గ్రామాల పరిశుభ్రత, క్లోరినేషన్, మురికి కాలువల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. అలాగే పాలకుర్తి, అంతర్గాంలోని 35 గ్రామాల్లో ప్రతి సమస్యను వ్రాతపూర్వకంగా ఆయా గ్రామ కార్యదర్శులు క్యాంపు కార్యాలయంలో అందజేయాలని అన్నారు.యువత కోసం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తెస్తామని అన్నారు. అలాగే సింగరేణి సంస్థ సహకారంతో సోలార్ విద్యుత్ దీపాలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని, మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి చేరేలా చూడాలని సూచించారు. ప్రతి ఒక్క కార్యదర్శి గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

నవతెలంగాణ-మంథని
ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీసీల ఆరాధ్యదైవం,బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని బీపీ మండల్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కామారెడ్డి బీసీల డిక్లరేషన్ అమలుచేయాలని బీసీ హక్కుల దీక్షను చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం దగా అని,ఆనాటి నుంచి నేటి వరకు అదే విధంగా పాలన అందిస్తోందన్నారు.బీసీ రిజర్వేషన్‌ల విషయంలో ఆనాడు నెహ్రూ పూటకో మాట మాట్లాడి,రోజుకో విషయం చెప్పి బీసీ రిజర్వేషన్‌కు అడ్డుపడ్డాడని ఆయన గుర్తు చేశారు.రెండువేల ఎకరాల భూస్వామిగా ఉన్న బిందేశ్వరి ప్రసాద్ సమాజం ఆకలి కన్నీళ్లు అర్థం చేసుకుని ఈ సమాజం కోసం ఆలోచన చేసిన గొప్ప మహనీయుడని అన్నారు.దేశమంతా తిరిగి బీసీల కష్టాలు, న్యాయమైన కోరికలు తెలుసుకుని రిజర్వేషన్‌లతోనే న్యాయం జరుగుతుందని కేంద్రానికి, రాష్ట్రపతికి బీసీలకు 27శాతం రిజర్వేషన్‌లు ఉండాలని, రిజర్వేషన్‌లు నిండకపోతే మూడేళ్ల ఆ రిజర్వేషన్‌లు ఉండాలని, ప్రైవేట్ సెక్టార్‌తోపాటు ప్రమోషన్‌లలో కూడా ఉండాలని ప్రతిపాదనలు పంపారని ఆయన తెలిపారు. 1990లో ఆయన రిపోర్ట్ ఇస్తే వీపీసింగ్ అమలు చేస్తా అని ప్రకటిస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అల్లకల్లోలం సృష్టించిందన్నారు. ఇప్పటి వరకు బీసీలకు రాజకీయ అవకాశాలు రాకపోవడానికి కారణంగా కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలేనని ఆయన అన్నారు.ఎన్నికల సమయంలో ఒక మాట ఎన్నికల తర్వాత మరోమాట మాట్లాడి మభ్యపెడుతున్నారని ఆయన అన్నారు.కాంగ్రెస్‌పార్టీకి మోసం చేయడం అనాదిగా వస్తున్న నీతి అని,కాంగ్రెస్ పార్టీ నైజాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.బీసీ డిక్లరేషన్ అమలు చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని,బీసీలంతా చైతన్యం వంతులై మహనీయుల స్ఫూర్తితో ముందుకు అడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్ గౌడ్, తగరంశంకర్ లాల్, సేగ్గం రాజేష్, ఆరేపల్లికుమార్, రాజుగౌడ్, ప్రకాష్ రెడ్డి, కాయతి సమ్మయ్య, కనవేణ శ్రీనివాస్, జంజర్ల శేఖర్, పోతిపెద్దికిషన్ రెడ్డి, విజయ్ కుమార్, ఆడిచర్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ శక్తి రామగిరి మండల అధ్యక్షులుగా గద్దల కుమార్



నవతెలంగాణ-రామగిరి
నామాదిగలకు విద్య, ఆరోగ్య,రాజకీయ, రంగాలకు పాటుగా ఆర్థికంగా ఎదిగేలా కృషిచేయా లని మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులుబొంకూరి సురేందర్ (సన్నీ)మాదిగ ఆదేశానుసారం మాదిగ శక్తి రామగిరి మండల అధ్యక్షులుగా నాగేపల్లి గ్రామానికీ చెందిన గద్దల కుమార్ ను నియమించారు. బహుజన ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ డా,"బాబా సాహెబ్ అంబేద్కర్ మాన్యవర్ కాన్షిరాం ఆలోచనలతో ముందుకు నడుస్తున్నందుల కు గానూ మాదిగ శక్తి మంథని నియోజకవర్గ అధ్యక్షులు మడిపెల్లి మొగిలి ఆధ్వర్యంలో ఈ నియామకం నియామకం జరిగింది. ఈ కార్యక్ర మానికి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి నుండి అందరిని కలుపుకొని రామగిరి మండలం పరిధిలోని అన్ని మండలాల్లో గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలతో మమేకమై కుల మతలకు అతీతంగా సోదరభావంతో పని చేస్తూ రాజ్యాధికారం కోసం భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రమేష్,శనిగరపు వెంకటేష్ లు పాల్గొన్నారు.

తెలంగాణ కళా రత్న అవార్డు అందుకున్న కనకం రమణయ్య



నవతెలంగాణ-గోదావరిఖని:
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కతిక శాఖ, కళా రవళి కల్చరల్ అసోసియేషన్ హుజురాబాద్ వారు 24వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్థాయి కళోత్సవాలను స్థానిక శ్రీ లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలలో తెలంగాణ ప్రాంతం నుండి కళా రంగంలో నిష్ణాతులైనటువంటి 30 మంది కళాకారులను తెలంగాణ కళారత్న 2024 అవార్డులతో ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవాలలో గోదావరిఖనికి చెందిన జాతీయ స్థాయి జానపద గాయకులు, గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు జీడీకే ఓసీపీ త్రీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న కనకం రమణయ్యను తెలంగాణ కళా రత్న అవార్డుతో కార్యక్రమ ముఖ్య అతిథి శంకరపట్నం సబ్ ఇన్స్పెక్టర్ కొత్తపల్లి రవి, సంస్థ అధ్యక్షులు విష్ణుదాస్ గోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి కన్నా దొరై రాజు, సీనియర్ కళాకారులు పంజాల రామ్ నారాయణ గౌడ్, అలివేలి సమ్మిరెడ్డి తెలంగాణ కళారత్న పురస్కార్‌తో ఘనంగా సన్మానించారు. తనను అవార్డుకు ఎంపిక చేసినందుకు గాను కళారవళి కల్చరల్ అసోసి యేషన్ కమిటీకి రమణయ్య ధన్యవాదాలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా నల్లమాసు ప్రభాకర్



నవతెలంగాణ-మంథని
పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో మంథనికి చెందిన నలమాసు ప్రభాకర్ పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నల్లమాసు ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్య కుల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తన నియమాకానికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా ఆర్యవైశ్య సంఘం సోదరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నలమాసు ప్రభాకర్ ఎన్నిక పట్ల పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు మాహసభ జిల్లా కన్వీనర్, న్యాయ వాది ఇనుముల సతీష్,కాంగ్రెస్ నాయకులు రావి కంటి సతీష్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఖనిలో కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నగర యాదవసంఘం ఆధ్వర్యంలో సోమవారం కష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని సంఘం అధ్యక్షులు పాతపల్లి రవికుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి లింగయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రాజేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.సంఘ భవనంలో ఉదయం శ్రీకృష్ణ భగవానుని పూజా కార్యక్రమం, సాయంకాలం గోదావరిఖని చౌరస్తాలో శ్రీకృష్ణుని40 అడుగుల చిత్రపటాన్ని ఆవిష్కరించడం, శ్రీకృష్ణ పారాయణం, కోలాట బృందాలచే నత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యాదవ కుల బాంధవులు, కార్పొరేషన్‌లో ఉన్నటువంటి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్



నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండల నూతన వ్యవసాయ అధికారిగా భాస్కర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఓదెల వ్యవసాయ అధికారిగా పనిచేసిన రాంబాబు బదిలీపై ఖమ్మంకు వెళ్లడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

పైపులైన్ మరమ్మతుకు నెలలు గడిచే...

మట్టి తొలగింపునకు మరెన్ని రోజులో...



నవతెలంగాణ-మంథని
మంథని మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ చౌక్‌లో మంచినీటి పైపు లైన్ లీకేజీ రోడ్డు అంతా చెడిపోయి నెలలు గడిచినా మున్సిపల్ పట్టించుకోకపోవడంతో సోషల్ మీడియా,పత్రికల లో కథనాలు రావడంతో ఎట్టకేలకు మంథని మున్సిపల్ యంత్రాంగం స్పందించి గత ఐదు రోజుల క్రితం పైపు లీకేజీ పనులు చేపట్టారు. కాని మున్సిపల్ యంత్రాంగం మూడు రోజుల్లో పనులు పూర్తిచేసి లీకేజీని అరికట్టారు. కానీ అక్కడ ఉన్న మట్టిని తొలగించడం, లీకేజీ పనులు చేసిన చోట సరిగ్గా రోడ్డు చదును చేయకపోవడంతో వాహనదారులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ రిపేరుకే నెలలు గడిస్తే.. మట్టి తొలగింపుకు మరెన్ని రోజులు గడుస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. మంథని మున్సిపల్ యంత్రా ంగం స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా మట్టిని తొలగించి,రోడ్డును బాగు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జూలపల్లి
జూలపల్లి మండలం పెద్దాపూర్ పాఠశాల ఆవరణంలోపీఆర్టీయూ టీఎస్ జూలపల్లి మండల శాఖ సమావేశం పి. ముత్యంరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కర్రు సురేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ లక్ష్యమని అన్నారు. అలాగే జూలపల్లి మండల శాఖ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెంచాల ముత్యంరావు, ప్రధాన కార్యదర్శి బొల్లం ప్రవీణ్, సహాధ్యక్షులుగా నరసింహస్వామి, మహిళా ఉపాధ్యక్షులుగా పోతులూరి సునీత, కార్యదర్శిగా డి కుమారస్వామిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మెరుగు తిరుపతి ఉన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆకుల రాజన్న, రాష్ట్ర బాధ్యులు గడ్డం అనంతరెడ్డి, జిల్లా బాధ్యులు కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలకు తరలిరావాలి

రాష్ట్ర అధ్యక్షులు కె.విశ్వనాథ్ పిలుపు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
కార్మికవర్గ హక్కులకై భవిష్యత్తు కార్యచరణ రూపొందించేందుకు సెప్టెంబరు 1,2,న మహారాష్ట్రలోని పూణే నగరం వేదికగా జరిగే ఐఎఫ్‌టీయూ ఎనిమిదో మహాసభలకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కె.విశ్వనాథ్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మనదేశంలో కార్మిక వర్గ హక్కులకై పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని పోరాటాలు చెయ్యనిదే కార్మికుల హక్కులకు పరిష్కారం లభించదని ఇందుకు రూపకల్పన చేయడానికి జాతీయ మహాసభలను వేదికగా ఎంచుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తూటిచర్ల రత్నకుమార్ అమాలి సంఘ నాయకులు సంతోష్ గట్టయ్య పోచమల్లు సాంబయ్య కరీం భాష పాల్గొన్నారు.

కౌన్సిలర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పెద్దపల్లి పట్టణ పూసల సంఘం అధ్యక్షుడిగా 24ఎక్స్ న్యూస్ ఛానల్ రిపోర్టర్ శ్రీనివాసును ఎన్నుకోగా కొలిపాక శ్రీను మీడియా మిత్రుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటీ ఛానల్ రిపోర్టర్ దుర్గం లక్ష్మణ్, సిటీ చానల్ సీనియర్ కెమెరామెన్ తిర్రి సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు గ్రామాలపైన శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-మంథని
పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతుంటే గ్రామాలలో ప్రత్యేక అధికారులు కానరావడం రావడం లేదని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతి అన్నారు. జిల్లావ్యాప్తంగా జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడం లేదని, సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదన్నారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వెంటనే చొరవ తీసుకొని ప్రజలు రోగాల బారిన పడకుండా వైద్య సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని ఆయన కోరారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్ - జగిత్యాల

సోమవారం | ఆగస్టు 26, 2024 | www.navatelangana.com

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మెన్‌గా అవకాశం కల్పించాలి

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కోడెం రజిత



నవతెలంగాణ-ఇల్లందకుంట

పదేండ్లు పార్టీ అధికారంలో లేకున్నా.. మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా కొనసాగుతూ పార్టీ బలోపేతం కృషి చేశానని, తనకు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కోడెం రజిత అధిష్టానాన్ని కోరారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. పది సంవత్సరాలు బీఆర్‌ఎస్ పార్టీ పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా కాంగ్రెస్ జెండాను వీడలేదన్నారు. చాల మంది నాయకులు పార్టీని వీడినా తాను మాత్రం పార్టీ కోసం కష్ట పని చేశానని పేర్కొన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ కావడం వల్ల కాంగ్రెస్ పార్టీ బలోపేత కోసం ఎంత కృషి చేసిన తకు అవకాశం కల్పిస్తే ప్రజలకు మరింత సేవ చేస్తారని ఆమె పేర్కొన్నారు.

చెరువులు ఆక్రమణ చేసిన వారి సమాచారం ఇవ్వండి

కాంగ్రెస్ మండల అధ్యక్షుల పిలుపు

నవతెలంగాణ-ఇల్లందకుంట-వీణవంక

మండలంలోని 18 గ్రామాలలో చెరువుల ఆక్రమణపై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని రామారావు పిలుపునిచ్చారు. మన బాధ్యతగా చెరువు కుంటల విస్తీర్ణం తెలుసు కోవాలన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు గురి అయితే దానికి సంబంధించిన అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు చర్యలు చేపడుతోందని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని సూచించారు.

వీణవంక:మండలంలోని 26 గ్రామాలలో చెరువుల ఆక్రమణపై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎండీ సాహెబ్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ప్రకృతి పర్యావరణాన్ని కాపాడాలని చెరువుల ఆక్రమణపై అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఇల్లందకుంట

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీపీ మండల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ బీసీ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, మోతుకూరు శ్రీనివాస్ గౌడ్ , కారింగుల రాజేందర్, గైకోటి రాజు, తోడేటి మధుకర్, వినయ్ తోలేటి,మోటపోతుల దేవేందర్, బొమ్మ మల్లయ్య, పైడిపల్లి వీరస్వామి, రాష్ట్ర కార్యదర్శి గాజె రమేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, గాజె ప్రజ్యోత్, దుప్పటపల్లి మురళి పాల్గొన్నారు.

మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బియ్యం అందజేత

నవతెలంగాణ-గన్నేరువరం

మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక రంగయ్య సతీమణి గుంటుక సరోజన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మండల పద్మశాలీ సంఘం సభ్యులు ఆదివారం పరామర్శించి, పద్మశాలి సంఘం తరపున బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుంటుక లింగయ్య, ప్రధాన కార్యదర్శి బూర శ్రీనివాస్, డైరెక్టర్లు వోడ్నాల నరసయ్య, వోడ్నాల తిరుపతి, లక్ష్మణ్,సదానందం పాల్గొన్నారు.

బేడ బుడుగ జంగాల అధ్యక్షుడికి సన్మానం



రాజేశంను సన్మానిస్తున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ-రామడుగు

మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని బేడ బుడుగ జంగాల కుల సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన టేకు రాజేశంను గంగాధర క్యాంప్ కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నవెంకటరాంరెడ్డి ,మహేందర్, రాజారాం, తిరుపతి, అంజయ్య, శ్రీనివాస్, కళ్యాణ్, తిరుపతి, వెంకటేష్, కనుకయ్య, రాజశేఖర్, అంజయ్య, రాజు, అనిల్, పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానం, వినోదం రెండు కళ్లు



ఐఐటీనీ సందర్శించిన సరస్వతి స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-రామడుగు

విద్యార్థులకు విజ్ఞానం, వినోదం రెండు కళ్ల లాంటివని సరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఐఐటీని విద్యార్థులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఐఐటీ ఫిజిక్స్ డిపార్ట్ మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిగారి మహేష్ ఐఐటీలోని వివిధ విభాగాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఐఐటీ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం వివిధ విభాగాల హెచ్ ఓడీలను కలిసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లలో పలు నమూనాలు, టెలిస్కోప్‌ను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు ఈ ఫీల్డ్ ట్రిప్‌ను దోహదపడుతుందని కరస్పాండెంట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ ప్రణీత, సునంద, అంజయ్య,జోసెఫ్ మనోహర్, శ్రీనివాస్, ఐఐటీ స్టూడెంట్స్ కిశోర్ కలిత పాల్గొన్నారు.

విషపురుగు కాటుతో మహిళ మృతి

నవతెలంగాణ - మానకొండూర్

విషపురుగు కాటుతో ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చుక్క లచ్చమ్మ (50) అనే మహిళ శనివారం తన పశువులకు మేత వేసే క్రమంలో ఏదో గుర్తు తెలియని విష పురుగు ఆమెను కాటు వేసింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ లచ్చమ్మ మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పాము కాటుకు గురైన లచ్చమ్మ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

రైతుల పేరిట బీజేపీ నాయకుల దొంగ దీక్షలు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న జీవి రామకృష్ణారావు

నవతెలంగాణ-మానకొండూర్

బీజేపీ నాయకులు ఉనికి కోసం రైతుల పేరిట దొంగ దీక్షలు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆరోపించారు. ఆదివారం మానకొండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకరపట్నం మండల పరిధిలోని కల్వల ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేయాలని బీజేపీ నాయకులు దీక్ష చేయడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఏడాదిన్నర క్రితం వర్షాల ప్రభావం వల్ల కల్వల ప్రాజెక్టు దెబ్బతింటే మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి ఆ ప్రాంతాన్ని సందర్శించి వెంటనే ప్రాజెక్టుకు మరమ్మత్తులతో పాటు రీడిజైనింగ్ చేయాలని ప్రతిపాదన నివేదికను అప్పటి సీఎం కేసీఆర్‌కు సమర్పించామని గుర్తు చేశారు. తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి రెండు పర్యాయాలుగా ఎంపీగా, ప్రస్తుతం కేంద్ర హోం సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కల్వల ప్రాజెక్టు మరమ్మతులకు నయా పైసా తేలేని అసమర్థ నాయకుడు బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మానకొండూర్, శంకరపట్నం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాళ్ళ పల్లి శేఖర్ గౌడ్, గంట మహిపాల్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఆమీరుల్లా ఖాన్, సీనియర్ నాయకులు ఎరుకల శ్రీనివాస్ గౌడ్, కొత్తకొండ నాగయ్య, గాజర్ల, పిండి సందీప్, కొట్టే రఘు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీ

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్

ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీకి గుర్తింపు లభించిందని, గతంలో చైనా కమ్యూనిస్టు పార్టీకి ఆ ఖ్యాతి ఉండేదని, 2014 తర్వాత దాన్ని వెనక్కి నెట్టిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జోన్ ఇన్‌చార్జి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో, తదనంతరం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మి గార్డెన్‌లో సభ్యత్వ నమోదు కార్యాశాల ప్రోగ్రాం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించడానికి ప్రధాన కారణం క్యాడరేనని పేర్కొన్నారు. 2014లో పార్టీలో సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ జరిగిందని, పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు దేశ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. పార్టీ కొత్త సభ్యత్వ నమోదులో పార్టీ నేషనల్ చీఫ్ మొదలుకొని పోలింగ్ బూత్ స్థాయి వరకు ప్రస్తుతం కొనసాగుతున్న సభ్యులంతా పాత సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకుంటారన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు భాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ డి.శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ తదితరులు మాట్లాడారు. కరీంనగర్ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఈ సందర్భంగా సభ్యత్వానికి సంబంధించిన పలు విషయాలపై బీజేపీ శ్రేణులకు మార్గ నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కొరటాల శివరామయ్య, ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డి, గుగ్గిల్లపు రమేష్, సీనియర్ నాయకులు బాస సత్య నారాయణ, శంకర్, వాసాల రమేశ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బత్తుల లక్ష్మి నారాయణ, మాడ వెంకట్ రెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, జాడీ బాల్ రెడ్డి, కళ్లెం వాసుదేవా రెడ్డి, శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు తరలిరావాలి



మాట్లాడుతున్న అబ్బరవేన రాజు యాదవ్

నవతెలంగాణ-జమ్మికుంట

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక గాంధీ చౌరస్తాలో జరిగే వేడుకలకు, ఉట్టి కొట్టే కార్యక్రమానికి నియోజకవర్గంలోని కమలాపూర్ ,వీణవంక, ఇల్లంతకుంట, హుజురాబాద్, జమ్మికుంట మండలాల నుంచి యాదవ, కురుమ కుల సోదరులతో పాటు అన్ని వర్గాల ప్రజలు నాయకులు తరలి రావాలని యాదవ, విద్యావంతుల జిల్లా అధ్యక్షుడు అబ్బరవేన రాజు యాదవ్ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు . శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ప్రతి సంవత్సరం జమ్మికుంట గాంధీ చౌరస్తాలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం నిర్వహించే కార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట యాదవ మండల అధ్యక్షుడు గిరవేణి శ్రీనివాస్‌యాదవ్, ఇళ్లందకుంట మండల యాదవ సంగం మండల అధ్యక్షులు గడ్డి రాములు యాదవ్,కురుమ సంఘం నాయకులు నీల కుమార్,గెల్లు మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

తల్లి మందలించిందని ఇంటర్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని కేశపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం కేశపూర్ గ్రామానికి చెందిన లక్కం గంగ లక్ష్మి చిన్న కుమారుడు లక్కం రాకేష్(16) ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి వెళ్లకుండా స్నేహితులతో కలిసి తిరుగుతున్నాడు. ఈనెల 24న రాకేష్‌తో మీ నాన్న మీకోసం గల్ఫ్ దేశంలో కష్టపడుతున్నాడు నువ్వు ఇక్కడ సరిగ్గా చదువుకోక చెడు స్నేహాలు చేస్తూ తిరుగుతున్నావని మందలించగా మానసిక ఒత్తిడికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లి మెట్‌పల్లిలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తల్లి లక్కం గంగ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

జ్యోతిహై స్కూల్ ఐఐటి అకాడమీలో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో ముందస్తు శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు పలువురిని ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రావు మౌనికా రావు, అజిత, రజిత ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని బర్దిపూర్ గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపు కున్నారు. మొదటగా గ్రామం నుంచి ఆలయం వరకు ఒగ్గుడోలు కళాకారుల ఆటపాటలతో ఊరేగింపుగా కొనసాగించి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐదు రోజులుగా సాగనున్నాయి. చివరి రోజు ప్రతిష్టాపన. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు ముత్యాల మల్లేష్, పెద్ద మల్లేష్, మహేష్, మహేందర్, దశరథ్, ప్రదీప్, నారాయణ పాల్గొన్నారు.



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలోని నలంద హై స్కూల్‌లో 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ చిన్ననాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పుడు చదువుకున్న తమ స్నేహితులను ఉపాధ్యాయులను గుర్తు చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో గాజుల సునీల్, దాసరి రాజేందర్‌రెడ్డి, కంకణాల రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, మంద వేణుగోపాల్ పాల్గొన్నారు.

వినాయక మండప నిర్వాహకులు పర్మిషన్ తీసుకోవాలి

నవతెలంగాణ-గన్నేరువరం

మండలంలోని 16 గ్రామాల్లో వినాయకులను ప్రతిష్ఠించే మండప నిర్వాహకులు తప్పకుండా మండపం, మైకు పర్మిషన్ తీసుకోవాలని ఎస్ఐ తాండ్ర నరేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పోలీస్ నిబంధనలను నిర్వహకులు పాటించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ- మేడిపల్లి

భీమారం మండల కేంద్రంలోని లింగాల వనిత అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆర్థిక సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో మంజూరైన రూ.60 వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చెక్కపల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, పల్లి భీమయ్య, పెద్దిరెడ్డి స్వామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి మనోజ్, చెక్కపల్లి రఘు, మాజీ సర్పంచ్ ఉత్కం శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలం కమ్మరిపేట గ్రామంలో మేడిపల్లి పోలీస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద స్టేషన్ హౌజ్ అధికారి జి. శ్యామ్ రాజ్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై వాటి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా కొత్త వ్యక్తుల నుంచి ఫోన్లు వచ్చినట్టు అయితే ఓటిపి గురించి అడిగితే వెంటనే అప్రమత్తం కావాల న్నారు. వేలిముద్రలు, ఫోన్ కాల్స్, వాట్సప్ కాల్, ఇతర సంబంధిత అనుమానిత వ్యక్తుల ద్వారా సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు విస్తరించాలి

సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి



నవతెలంగాణ-తిమ్మాపూర్

కరీంనగర్ జిల్లాలో చెరువులు, కుంట శిఖం భూములు, ఎస్సారెస్పీ భూములు, కబ్జాలకు గురై నిర్మాణాలు చేపట్టారని, వీటన్నిటిని వెలికి తీయాలంటే హైడ్రా తరహా వ్యవస్థ తక్షణమే జిల్లాలకు, మండలాలకు తీసుకురావాలని సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మండలంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములు రియాల్టర్ల చేతిలో కబ్జాలకు గురైనాయని, కొన్ని ప్రాంతాలలో చెరువులు కుంట శిఖములలో నిర్మాణాలు కూడా చేపట్టారన్నారు.

జక్కని సంజయ్‌ను విడుదల చేయాలి

భీమ్ ఆర్మీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్కతుర్తి గణేష్

నవతెలంగాణ-తిమ్మాపూర్

కాంగ్రెస్ పార్టీ బీసీలకు కామారెడ్డిలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ కేంద్ర కార్యాలయంలో అమర నిరాహార దీక్ష చేపడుతున్న జక్కని సంజయ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదని బీమ్ ఆర్మీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్కతుర్తి గణేష్ తీవ్రంగా ఖండించారు. సంజయ్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-జమ్మికుంట

జమ్మికుంటలో ఆదివారం ఎస్సై వివేక్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టు కున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ రాసపల్లి మల్లేష్, ఓనర్ జూకంటి కమల్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు.

వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-కరీంనగర్

వారధి ఫౌండేషన్ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలో జిల్లా స్థాయిలో జెడ్పీహెచ్ఎస్ మొగ్దుంపూర్ విద్యార్థులు డి.తేజస్విని, ఆర్.సాయిశ్రీ, డి.స్పందన గెలుపొందారు. వీరు తిరిగి రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ నర్సయ్య, ఏఎంసీ చైర్మెన్ సుచిత తదితరులు అభినందించారు.

మానవ హక్కుల పరిరక్షణ సంఘం కరీంనగర్ జనరల్ సెక్రటరీగా కటుకం శ్రీకాంత్



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని యస్వాడ గ్రామానికి చెందిన కటుకం శ్రీకాంత్ భారతదేశ మానవ హక్కుల పరిరక్షణ సంఘం కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు తక్దీర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు యెల్డి నాగార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



కులగణన చేసి తీరుతాం

- బలహీన వర్గాలకు ఓబీసీ న్యాయవాదులు అండగా ఉండాలి : ఓబీసీ న్యాయవాదుల కన్వెన్షన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు చెప్పా. ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. రాష్ట్రంలో కులగణన చేసి తీరుతాం' అని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరోమారు స్పష్టం చేశారు. న్యాయపర పోరాటంలో బలహీన వర్గాలకు ఓబీసీ న్యాయవాదులు అండగా ఉండాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ న్యాయవాదుల కన్వెన్షన్‌ను నిర్వహించారు. ప్రతి న్యాయవాది కూడా హక్కుల కోసం కొట్లాడాలన్నారు. హైకోర్టు, జిల్లాల్లో బలహీన వర్గాల సంఖ్య జ్ఞాన సంపద కలిగిన జ్యుడీషియల్ జడ్జి వస్తే మన సంఖ్య కూడా చూపెట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటులో న్యాయవాదుల పాత్ర మరువలేనిదని చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా బలహీన వర్గాల న్యాయవాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు ద్వారానే ఎస్సీ వర్గీకరణ జరుగుతున్నదని చెప్పారు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం ఓబీసీ పార్లమెంట్ కమిటీ మెంబర్‌గా అనేక రాష్ట్రాలు తిరిగి అధ్యయనం చేశామని గుర్తుచేశారు. నేడు దేశంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కూడా అమలు కావడం లేదనీ, క్రిమిలేయర్ తెచ్చి వారిని రిజర్వేషన్లకు దూరం చేసే పరిస్థితిని తెచ్చారని వివరించారు. బలహీన వర్గాలకు, దళిత, గిరిజనులకు న్యాయ సహాయం అందించాలని కోరారు. న్యాయపరంగా వారికి దక్కాల్సిన వాటా పోరాటాలకు అండగా నిలవాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. హైకోర్టు, జిల్లా, డివిజనల్ కోర్టుల్లో ఓబీసీ న్యాయవాదులు ఎంతమంది ఉన్నారనే దానిపై లెక్కలు తీసి తనకివ్వాలని సూచించారు. వారి కోసం తాను కొట్లాడుతానని హామీనిచ్చారు. చట్టసభల్లో మన ప్రతినిధులు ఎక్కువగా ఉంటే మనకు ఎక్కువ అవకాశాలు వస్తాయని చెప్పారు. జ్యోతి బాపులే, సావిత్రి భాయ్ పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బలహీన వర్గాల ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంతో మంది ఉన్నప్పటికీ నారాయణ గురు, రామస్వామి పెరియార్ లాంటి వారిని గుర్తుచేసుకుంటున్నామనీ, ఆ స్థాయికి ప్రతి ఒక్కరూ ఎదగాలని ఆకాంక్షించారు.

వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించిన సీఎం

- కావాలనే కుట్రపూరిత చర్యలు
- ఊపిరున్నంత వరకు సిద్దిపేట అభివృద్ధికి కృషి చేస్తా : మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట



రూ.150 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కాలేజీని గద్దలా తన్నుకుపోతున్న సీఎం రేవంత్ రెడ్డి తీరును ప్రజలు గమనించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం 251 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధిక సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందినటువంటి నియోజకవర్గం సిద్దిపేట అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటను తెలంగాణలోనే బెస్ట్ నియోజకవర్గంగా మీ అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. సగం నిర్మాణం పూర్తయిన వెటర్నరీ కాలేజీని కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్‌కు తరలించుకుపోయిందని, కొడంగల్‌కు అవసరమైతే కొత్త కాలేజీని నిర్మించుకోవాలి గాని సిద్దిపేటకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. శిల్పారామం పనులు ఆగిపోయాయని, పనులు కాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేటకు రావాల్సిన పనులను హక్కుగా తీసుకొని వస్తానన్నారు. తన ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానని స్పష్టంచేశారు. అంతకుముందు సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ - బైకు ఢీ



- పసికందుతో సహా తల్లి మృతి
- మద్యం మత్తులో లారీ డ్రైవర్

నవతెలంగాణ-కొత్తూరు

మద్యం మత్తులో లారీని నడిపిన డ్రైవర్ ముందు వెళ్తున్న బైకును ఢీకొట్టడంతో పసికందుతో సహా తల్లి మృతిచెందింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై చేగుర్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణానికి చెందిన కర్ణకోట సాయి కృష్ణ, భార్య కావ్య(25), ఇద్దరు పిల్లలతో కలిసి మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై ఉప్పుగూడలోని అత్తగారింటికి వెళ్తున్నాడు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ చేగుర్ రోడ్డు సమీపంలో హుబ్లీ నుంచి లోడుతో హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ డ్రైవర్ షేక్ మహమ్మద్ మద్యం మత్తలో వాహనాన్ని నడపడంతో ముందుగా వెళ్తున్న బైకును బలంగా ఢీ కొట్టడంతో పాటు మరొక ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బైకుపై వెళ్తున్న కావ్య, ఏడాది పాప అనన్యలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి భర్త సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ప్రాణం తీసిన చేపల సరదా

- ఇద్దరు మృతి
- సీతారామకాలువ వద్ద ఘటన

నవతెలంగాణ- బూర్గంపాడు

చేపలు పట్టుకోవాలనే సరదా రెండు నిండు ప్రాణాలను బలి తీసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం జింకలగూడెం వద్దనున్న సీతారామ ప్రాజెక్టు కాలువలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణం గాంధీనగర్‌కు చెందిన షేక్ జమీరుద్దీన్ (37), ఆయన భార్య షాహీన్ సోదరి పర్వీన్, కరీముల్లాల కుమారుడు షేక్ రియాజ్ (17)తో కలిసి ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున జింకలగూడెంలోని సీతారామ ప్రాజెక్టు కాలువ వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. కాలువలో లోతు ఎక్కువగా ఉండటంతో జమీరుద్దీన్, షేక్ రియాజ్ ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయ్యారు. ఈ సమాచారం అందుకున్న బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం సమయానికి మృతదేహాలు లభ్యమయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జమీరుద్దీన్, రియాజ్ మృతదేహాలను చూసి షాహీన్, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి కుమార్తెలు ఈషా, షన్నాసిద్ధిక, ఉమర్లు ఉన్నారు. పాల్వంచ సీఐ వినయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు

డ్రగ్స్ నియంత్రణకు మాస్టర్ ప్లాన్

- సభ్యులుగా చురుకైన విద్యార్థులు
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక నిఘా పెట్టింది. ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారినపడి తమ భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నట్టు గుర్తించింది. కాలేజీల నుంచి పాఠశాలలకు సైతం ఈ జాడ్యం పాకింది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులను కాపాడేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖను సర్కార్ ఆదేశించింది. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో మాదకద్రవ్యాల వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టి, విద్యార్థులను వాటికి దూరం చేయాలని సూచించింది. ఇందుకు ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ గత నెల 12వ తేదీన జీవో 20 ప్రకారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో విజయకుమారి ఆదేశాలు జారీ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 100కు పైగా స్కూళ్లలో ఈ క్లబ్‌ల ఏర్పాటు చేయనున్నారు.

కమిటీ ఏర్పాటు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసే ప్రహరీ క్లబ్‌లకు ఆయా పాఠశాల హెచ్‌ఎంలు అధ్యక్షులుగా ఉంటారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ పాఠశాల ఉపాధ్యాయుడు లేదా విద్యార్థులతో సాన్నిహిత్యం ఉన్న ఉపాధ్యాయుడిని నియమిస్తారు. ఈ కమిటీలో మొత్తం 16 మంది సభ్యులు ఉండగా.. ఆరు నుంచి పదో తరగతి వరకు తరగతికి ఇద్దరు చొప్పున చురుకైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం నుంచి ఒకరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒకరిని ఎన్నుకోనున్నారు. వీరంతా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా శ్రద్ధ తీసుకుంటారు. ఈ కమిటీలు చురుకుగా పని చేసేందుకు పోలీసులు ఎన్ఎస్-ఎస్ వాలంటీర్ల సహకారం తీసుకుంటారు. క్లబ్‌ల నిర్వహణకు త్వరలో మరిన్ని మార్గదర్శకాలు విడుదల చేస్తామని ఉత్తర్వుల్లో వెల్లడించారు.

కమిటీ లక్ష్యాలు..

1. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా నిఘా పెట్టడం.
2. పాఠశాలల్లో విద్య, శిశు సంరక్షణ సంస్థల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల అమ్మకాలను అరికట్టడం.
3. మాదకద్రవ్యాలకు సరఫరా అలవాటు పడిన విద్యార్థులు ఉంటే వారిని గుర్తించి అప్రమత్తం చేసి వాటి దుష్ప్రభావాలను వివరించి మాన్పించడం.
4. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తే తగిన చర్యలు, జాగ్రత్తలు తీసుకుని కట్టడి చేయడం.
5. పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కల మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండటం.
6. విద్యార్థులు డ్రగ్స్ ఊబిలో చిక్కుకోకుండా చక్కని ప్రణాళికలను రూపొందించి అమలు చేయడం.
7. పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధాలు, పదార్థాలు, ఇతర రకాల వస్తువులు వారి దరి చేరకుండా నిరోధించడం.

ఆదేశాలు జారీ చేశాం

అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యాశాఖ నుంచి ఆదేశాలు ఇచ్చాం. పాఠశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. కఠిన



చర్యలు తీసుకుంటాం. క్లబ్ ఏర్పాటు పూర్తయిన అనంతరం, వచ్చిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు మాదకద్రవ్యాలకు అల వాటు పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

విజయకుమారి, డీఈఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

హైడ్రా లెక్క ఇది

- 43.94 ఎకరాల భూమి స్వాధీనం
- 18 ప్రాంతాల్లో 166 కట్టడాలు కూల్చివేత
- పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన రంగనాథ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



హైడ్రా అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను కబ్జా చేసిన వారిపై కన్నెర్ర చేస్తూ అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు మరింత వేగం పెంచింది. జూన్ 27 నుంచి ఆగస్టు 24 వరకు తన కార్యాచరణ అమలుపై ఆదివారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. నెల రోజులుగా నగర వ్యాప్తంగా పలు ఆక్రమణ స్థలాల్ని కబ్జాసురుల చెర నుంచి విడిపిస్తున్న హైడ్రా...ఇక ముందు కూడా తన దూకుడును ప్రదర్శించనున్నట్టు స్పష్టం చేసింది. 18 ప్రాంతాల్లో 166 ఆక్రమణ కట్టడాలను కూల్చివేసి మొత్తంగా 43.94 ఎకరాలను ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. చెరువులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఈమేరకు ఆదివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లతోపాటు పార్కు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిలో పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు ఉన్నట్టు హైడ్రా తన నివేదికలో పేర్కొంది.

కబ్జాదారుల్లో రాజకీయ, సినీ, క్రీడా రంగాల ప్రముఖులు

చింతల్ చెరువులో స్థానిక బీఆర్ఎస్ నాయకులు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను కూల్చివేసి 3 ఎకరాల 5 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. అలాగే నందగిరి హిల్స్‌కు సంబంధించి ఎమ్మెల్యే దానం నాగేందర్ మద్దతుతో ఆక్రమించిన పార్క్ స్థలంలోని 18 గుంటల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నట్టు వివరించింది. బహదూర్ పురా ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మిరాజ్ రెహమత్ బేగ్ రాజేంద్రనగర్‌లోని బుమురౌఖ్ దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన రెండు ఐదంతస్తుల భవనాలు, రెండంతస్తుల భవనంతోపాటు మరో భవనాన్ని కూల్చివేశామని స్పష్టం చేసింది. ఇక్కడ మొత్తం 45 అక్రమ నిర్మాణాలు కూల్చివేసి 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్టు తెలిపింది. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఖానాపూర్, చిలుకూరు వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన పల్లం రాజు సోదరులు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జీవీ భాస్కర్ రావు, మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రోకబడ్డీ యజమాని అనుపమ ఆక్రమంగా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహారీలను కూల్చివేసినట్టు వివరించింది. ఖానాపూర్, చిలుకూరు వద్ద గండిపేట ఎఫ్‌టీఎల్‌లోని 14 ఎకరాల 80 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంది.

హాట్ టాపిక్‌గా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

మాదాపూర్‌లోని తుమ్మిడికుంట చెరువులో అక్రమంగా నిర్మించిన అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించిన రెండు నిర్మాణాలను కూల్చివేసినట్టు హైడ్రా తెలిపింది. ఇక్కడ నాలుగెకరాల 9 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నట్టు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా పేర్కొంది. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేసి 16 గుంటలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. మన్సూరాబాద్‌లో 2 గుంటలు, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలా నగర్‌లో ఎకరా 4 గుంటలు, ఫిల్మ్ నగర్‌లోని బీజేఆర్ నగర్‌లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్ ను కూల్చి వేసి 5 ఎకరాలు, గాజులరామారం మహాదేవపురం వద్ద ఒక గుంట, గాజుల రామారం భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్‌పేటలో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం ఒకటి, నాలుగు అంతస్తుల భవనాలు రెండింటిని కూల్చివేసి 16 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటలు స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

హైడ్రాకు గండిపేట సొసైటీ మద్దతు



నవతెలంగాణ-గండిపేట

చెరువులను కాపాడాలనే ఉద్దేశంతో హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు మద్దతుగా గండిపేట సొసైటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన 'సేవ్ లేక్' కార్యక్రమానికి ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం చెరువులను కాపాడుకోవాలన్నారు. హైడ్రాకు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా గండిపేట సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. హైడ్రా చర్యలను సమర్థించారు. చెరువులు, కుంటల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను పూర్తిగా కూల్చివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జంట జలాశయాలను కాపాడి నగరవాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండిపేట సొసైటీ సభ్యులు, ఎంజీఐటీ విద్యార్థులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. శిశువు మృతి

- వరుస సంఘటనలతో వివాదాస్పదంగా నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి
- ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు,బంధుమిత్రులు
- బాధితుల ఫిర్యాదుతో ఇద్దరు డాక్టర్లపై కేసు



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిన సంఘటన ఆదివారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం, గారగుంట్ల పాలెంకు చెందిన శ్రీలత తీవ్రమైన జ్వరం, పురిటి నొప్పులతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది సమ్మె చేస్తున్నారనే విషయం తెలుసుకుని, మరుసటి రోజు శనివారం డెలివరీ కోసం శ్రీలత ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లే ప్రయత్నం చేసింది. తామే డెలివరీ చేస్తామంటూ వైద్యురాలు, వైద్య సిబ్బంది శ్రీలతను ఆస్పత్రిలోకి తీసుకువెళ్లారు. స్కానింగ్ చేసి తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని చెప్పిన వైద్యులు ఆపరేషన్ చేశారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఆపరేషన్ చేసే సమయానికి శిశువు మృతి చెందింది. అయితే, డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ బాబు చనిపోయాడంటూ తల్లిదండ్రులు నాగరాజు, శ్రీలత ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. వైద్యురాలు కోపంతో ఆపరేషన్ చేశారని, తాము భయపడినట్టే ఆపరేషన్ చేసి శిశువును చంపారని బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో శిశువుకు పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా, ఆదివారం ఉదయం శిశువు తండ్రి నాగరాజు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఇద్దరు వైద్యులపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో వరుసగా చోటు చేసుకుంటున్న సంఘటనల దృష్ట్యా కలెక్టర్ ఆస్పత్రిని తనిఖీ చేసే అవకాశం ఉందని, అంతేకాకుండా విధులకు గైర్హాజరవుతున్న విషయమై ఆస్పత్రి వైద్యాధికారులతో చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

కలెక్టర్‌కు నివేదిక

శిశువు తండ్రి ఫిర్యాదు మేరకు శిశువుకు పోస్టుమార్టం నిర్వహించాం. రెండు రోజుల్లో ప్రాథమిక నివేదిక, 30 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక వస్తుంది. రిపోర్ట్ రాగానే కలెక్టర్‌కు అందజేస్తాం. నిర్లక్ష్యం జరిగిందని తేలితే అందుకు చర్యలు ఉంటాయి.

హై డోస్ ఇంజక్షన్ ప్రాణాలు తీసింది

- భూంపల్లిలో ఇద్దరు చిన్నారులు మృతి
- 10 రోజుల్లో రెండు ఘటనలు
- ఆలస్యంగా వెలుగులోకి..
- ప్రథమచికిత్సా కేంద్రాన్ని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి



నవతెలంగాణ-సదాశివనగర్/ ఎల్లారెడ్డి

పీఎంపీ ఇచ్చిన హై డోస్ ఇంజక్షన్ ఇద్దరు చిన్నారుల ప్రాణాలను తీసిన ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో జరిగింది. 10 రోజుల వ్యవధిలోనే ఇద్దరు చిన్నారులు మృతిచెందడంతో జిల్లా వైద్యాధికారి ఆదివారం తనిఖీలు చేపట్టగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. చిన్నారులకు హై డోస్ అందజేసిన పీఎంపీ ప్రథమ చికిత్సా కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. వైద్యాధికారులు, బాధితుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూంపల్లి గ్రామానికి చెందిన ఊరడి చైతన్య-మహిపాల్ దంపతుల కుమారుడు రణ్‌విత్ (9) 4వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14 న తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు అదేరోజు మధ్యాహ్నం పద్మాజివాడీ ఎక్స్‌రోడ్డులోని ప్రథమ చికిత్సాకేంద్రం నిర్వహిస్తున్న పీఎంపీ రాజిరెడ్డి వద్దకు తీసుకెళ్లారు. దాంతో ఆయన రణ్‌విత్‌కు హై డోస్ ఇంజక్షన్‌ను అందించి.. హై డోస్ సెలైన్ సైతం ఎక్కించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు గాంధారి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.

అదే గ్రామానికి చెందిన శోభ-దిలీప్ దంపతుల కుమార్తె మనశ్రీ (12) 7వ తరగతి చదువుతోంది. రెండ్రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు పీఎంపీ రాజిరెడ్డి వద్దకు తీసుకెళ్లారు. రణ్‌వీత్‌కు చేసిన ట్రీట్‌మెంటే మనశ్రీకి కూడా చేయడంతో పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. శనివారం రాత్రి మృతిచెందింది. చిన్నారులు మృతిచెందిన విషయం తెలుసుకున్న కామారెడ్డి డీఎంఅండ్‌హెచ్ఓ చంద్రశేఖర్ వారికి అందిన వైద్య వివరాలు తెలుసుకునేందుకు ఆదివారం పద్మాజివాడిలోని ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇద్దరు చిన్నారులకు హై డోస్ ఇంజక్షన్, హై డోస్ గ్లూకోస్ ఎక్కించడం వల్లే పరిస్థితి విషమించినట్టు నిర్ధారించారు. వెంటనే ఆ కేంద్రాన్ని సీజ్ చేశారు. మండలంలోని పీఎంపీలు ఇటువంటి చికిత్సలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంఅండ్‌హెచ్ఓ వెంట డాక్టర్ ఆస్మా అఫ్షిన్, జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఏఎన్ఎంలు సంగీత, జ్యోతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

శిబిరాలు ఏర్పాటు చేయాలి : గ్రామస్తులు

భూంపల్లి గ్రామంలో ఇద్దరు చిన్నారులు చనిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో సీజనల్ వ్యాధులు ప్రబలి చిన్నారులు జ్వరాల భారిన పడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు వెంటనే స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

వైద్యం వికటించి బాలుడికి అస్వస్థత


చికిత్స పొందుతున్న సాన్విత్

ప్రభుత్వ పల్లె దవాఖానలో వైద్యం వికటించి 18 నెలల బాలుడు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేట్ పల్లె దవాఖానలో జరిగింది. బాలుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మున్సిపల్‌లోని 11వ వార్డుకు చెందిన రామగల అరుంధతి మౌనిక తన కుమారుడు సాన్విత్‌ను నెలవారీ టీకాలు ఇప్పించడానికి ఈ నెల 21 న లింగారెడ్డిపేట పల్లె దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ ఏఎన్ఎం, వైద్యులు టీకా వేసిన గంటలోపే బాలుడికి ఫిట్స్ వచ్చి తీవ్రమైన అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అక్కడి డాక్టర్ల సలహా మేరకు కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలుడిని పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ 4రోజుల చికిత్స అనంతరం మరునాడు డిశ్చార్జ్ అయ్యే క్రమంలో మరోసారి ఫిట్స్ రావడంతో ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై పల్లె దావఖాన వైద్యులను వివరణ కోరగా.. 'ఆ రోజు బాలునికి స్వల్ప జ్వరం ఉంది. మరో రోజు వచ్చి టీకా వేసుకోవాలని సూచించాం. అయినా వారు వినకుండా అప్పుడే వేయాలని అడిగి వేయించుకున్నారు.

ఎంఆర్, జేఈ ఇంజక్షన్, డీపీటీ బూస్టర్ ఇంజక్షన్, ఓపీవీ పోలియో డ్రాప్, విటమిన్ ఏ సిరప్ మాత్రమే వేశాం. అనంతరం వారు ఇంటికెళ్లిన రెండు గంటల తర్వాత బాలుడు అస్వస్థతకు గురైనట్టు సమాచారం ఇచ్చారు.' అని వైద్యులు తెలిపారు.

తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆవిర్భావం

- చైర్మెన్‌గా వి.లచ్చిరెడ్డి ఎన్నిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భవించింది. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. లచ్చిరెడ్డిని చైర్మెన్‌గా అన్ని సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాదులోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ తదితర ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 65 సంఘాల నాయకులు పాల్గొని జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మెన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్ పదేండ్ల పాలనలో ఉద్యోగ వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. గతానికి భిన్నంగా కొత్త సర్కార్ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటున్నదని చెప్పారు. పదేండ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. సంక్షేమం, ఆరోగ్యం, హౌసింగ్, ఇతర సమస్యలు పరిష్కరించుకోవడమే లక్ష్యంగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల ఉద్యోగ సంఘాల నాయకులు అశ్వత్థామ రెడ్డి, నిర్మల, లక్ష్మారెడ్డి, సంపత్ కుమార్, హర్షవర్ధన్ రెడ్డి, కుమార స్వామి, మహిపాల్‌రెడ్డి, షౌకత్ అలీ, శ్రీకాంత్, గరిక ఉపేందర్ రావు , గోపాల్ రెడ్డి, కే రామకృష్ణ, ఎస్ రాములు, రమేష్ పాక, ఫుల్ సింగ్ చౌహాన్, హరికిషన్, తిరుపతి నాయక్, డాక్టర్ కత్తి జనార్దన్, మేడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వ ఉండాలంటే...

దుకాణంలో బెండకాయను చూడగానే.. వాటిని కొనాలనిపిస్తుంది. అయితే బెండకాయలు మార్కెట్ నుంచి ఇంటికి తెచ్చిన రెండు మూడు రోజుల్లో పాడైపోతుంటాయి. కొన్ని చిట్కాలతో నెలల తరబడి బెండకాయను నిల్వ చేయవచ్చు. అవేంటో చూద్దాం.

బెండకాయ కొనేటప్పుడు అవి మరీ గట్టిగా ఉంటే త్వరగా పాడైపోతాయి. అందుకని ఫ్రెష్‌గా, కొద్దిగా మెత్తగా ఉన్నవి తీసుకోవాలి. ఎక్కువ విత్తనాలు ఉండకుండా జాగ్రత్త వహించండి. ఇంటికి తెచ్చిన తర్వాత బెండకాయను కడగడం చాలా ముఖ్యం. వాటిని నిల్వ చేసే ముందు శుభ్రంగా కడగాలి. దీని కోసం నీటిలో ఒక చెంచా వెనిగర్ వేసి బాగా కలపాలి. అప్పుడు ఈ నీటిలో బెండకాయలు వేయండి. 10 నిమిషాల తర్వాత, నీటి నుండి వాటిని తీసివేసి, కాటన్ క్లాత్‌లో తుడవాలి.

వీటిని గాలి చొరబడని కంటైనర్‌లో పెట్టి ఫ్రీజర్‌లో ఉంచండి. ఇలా చేయడం వల్ల అవి చెడిపోకుండా తాజాగా ఉంటాయి.



పరిచయం అవసరం లేని నటి రాధిక. వివిధ భాషల్లో నటించిన ప్రఖ్యాత నటీమణి. తమిళ, తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర కథానాయకుల సరసన నటించిన ఘనత ఆమెది. నిండైన శరీర సౌష్టవంతో, సహజమైన నటనతో ఏ పాత్రలోనైనా ఇమిడిపోయి, గ్లామర్ కంటే నటనకే ప్రాధాన్యం ఇచ్చే నటి. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో సుమారు 350కి పైగా చిత్రాల్లో నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. శక్తివంతమైన పాత్రకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ప్రతిష్టాత్మకమైన ఎన్నో పురస్కారాలు అందుకుని ఇప్పటికీ సినిమాలు, టీవీ సిరియల్స్, వెబ్ సీరిస్‌లో నటిస్తూ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

తెలుగు సినిమా అంటే ప్యాషన్





రాధిక అలనాటి ప్రముఖ తమిళ హాస్య నటుడు ఎం.ఆర్. రాధ, గీతల కూతురు. 1962, ఆగస్టులో ఈమె శ్రీలంకలో పుట్టారు. ఈమె తండ్రి చెన్నైకి చెందిన తెలుగు వారు. తల్లి శ్రీలంక తమిళియన్. రాధికకు చిన్నతనం నుండి సినిమాలంటే అమితమైన ఆసక్తి. ఈమె చదువంతా ఇండియా, శ్రీలంక, లండన్‌లో కొనసాగింది. రాధికకు ఓ చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లు. చెల్లి నిరోష కూడా నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2001లో ప్రముఖ నటుడు ఆర్.శతర్‌కుమార్‌ను రాధిక పెండ్లి చేసుకున్నారు. వీరిద్దరూ పెండ్లికి ముందు రెండు చిత్రాల్లో కలిసి నటించారు. అప్పుడు వీరి పరిచయం స్నేహంగా మారి అది పెండ్లికి దారితీసింది. ఈమెకు 1992లో రయానే అనే కూతురు, 2004లో రాహుల్ అనే కొడుకు జన్మించారు. రయానే 2016లో క్రికెటర్ అభిమన్యు మిథున్‌ను వివాహం చేసుకున్నారు. ఈమెకు ఓ కూతురు, కొడుకు ఉన్నారు.

తమిళంలో రంగ ప్రవేశం

సినిమాలపై ఉన్న ఇష్టంతో 16 ఏండ్ల వయసులో రాధిక చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 1978లో భారతీరాజా దర్శకత్వంలో కిజక్కే పోగుమ్ రైల్‌లో అనే తమిళ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఆమె హిందీ,



తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో అనేక చిత్రాలలో నటించారు. ఆమె మీండుమ్ ఒరు కాతల్ కథై(1985) అనే చిత్రాన్ని కూడా నిర్మించారు. ఇది దర్శకత్వంలో ఉత్తమ తొలి చిత్రంగా ఇందిరా గాంధి అవార్డును గెలుచుకుంది.

తొలి చిత్రానికే ఉత్తమ నటిగా...

తెలుగులో రాధిక తొలి చిత్రం 'న్యాయం కావాలి'(1981). ఈ చిత్రం ప్రేమించిన వ్యక్తిచే మోసగింపపడి, అతనికి ఎలాగైనా తగిన పాఠం నేర్పాలనే ఉద్దేశంతో కొనసాగే కథ. అప్పట్లో ఈ చిత్రం ఓ సంచలనం. తెలుగులో తొలి సినిమా అయినప్పటికీ తన అద్భుత నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత విశ్వనాథ్ దర్శకత్వంలో అఖండ విజయాన్ని సాధించిన 'స్వాతి ముత్యం'లో చిన్న వయసులోనే భర్తను కోల్పోయి బిడ్డతో జీవితం సాగిస్తున్న ఒంటరి మహిళ పాత్రలో ఆమె, అమాయకపు పాత్రలో కనిపించే కమలహాసన్‌ను పెండ్లి చేసుకుని అతనిని తీర్చి దిద్దిన వైనం ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తుండి పోయింది. ఎన్ని సార్లు చూసినా చూడలనిపించే ఆమె నటనకు ఈ చిత్రం నిదర్శనం.

విభిన్నంగా చేయాలని...

సినిమాల్లో విజయం సాధించిన తర్వాత రాధిక ఏదైనా విభిన్నంగా చేయాలనుకున్నారు. అందుకని బుల్లితెరలో నటన ప్రారంభించారు. అయితే చాలామంది ఆమె నిర్ణయం సరైనది కాదన్నారు. ఆమె కూడా మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డారు. కానీ తన సొంత బ్యానర్‌తో టెలివిజన్ ధారావాహికలను నిర్మించి మంచి పేరు తెచ్చుకున్నారు. 1994లో రాడాన్ మీడియావర్క్స్‌ను ప్రారంభించారు. ప్రారంభంలో కొన్ని అవాంతరాలు ఎదుర్కొనా 1999లో పబ్లిక్‌గా లిస్టెడ్ కంపెనీగా తిరిగి రాడాన్ మీడియావర్క్స్ లిమిటెడ్‌గా ఆవిర్భవించింది. ఆమె విజయ్ టీవీ జోడీ నంబర్ వన్ సీజన్ 4లో న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరించారు.

మార్పే ముందుకు తీసుకెళ్తుంది

ఇక సినిమా విషయానికి వస్తే షూటింగ్ వాతావరణమే చాలా ప్లజంట్‌గా ఉండేదని, వారి రోజుల్లో క్యారీవ్యాన్ ఉండేది కాదని, అందరూ ఒక చెట్టు కింద కూర్చొని మాట్లాడుకుంటూ కలిసి భోజనం చేసే వారని అప్పుడప్పుడు ఆమె ఇంటర్వ్యూలో పంచుకుంటుంటారు. తెలుగు, తమిళ భాషల్లో కలిపి 350కి పైగా చిత్రాల్లో నటించిన రాధిక అప్పటికీ, ఇప్పటికీ మేకింగ్ పరంగా ఎన్నో చేంజెస్ వచ్చాయని టెక్నాలజీ, నాలెడ్జి అంతా మారిపోయిందనీ, ఎప్పటికైనా మార్పే ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం కొత్త డైరెక్టర్స్, కొత్త ఆర్టిస్టులతోనే ఎక్కువగా సినిమాలు చేస్తున్నారు. కొత్త తరం నటులు వారి టాలెంట్‌తో ముందుకు వస్తున్నారని, వారిని చూస్తే చాలా సంతోషంగా ఉందని ఆమె పంచుకుంటున్నారు.


కథ మంచిదైతే చాలు...

ఎప్పటికీ తాను ఓ నటిగానే ఉంటానంటున్నారు. ఇంట్రెస్టింగ్‌గా అనిపించిన క్యారెక్టర్స్ వస్తే తప్పకుండా చేస్తానని, తెలుగు సినిమా అంటే తనకు ప్యాషన్ అంటున్నారు. తెలుగు సినిమాల్లో నటించడం అంటే ఆమెకు చాలా ఇష్టమట. మంచి కథ ఉంటే తప్పక తెలుగులో నటించేందుకు ఆమె సిద్ధంగా ఉన్నారు. ఆమె నటించిన అభిలాష, దొంగమొగుడు, మూడు ముళ్ళు, సూర్య వంశం మొదలైన చిత్రాలు ఇప్పటికీ మళ్ళీ మళ్ళీ చూడలనిపిస్తుంటాయి. ఇన్ని చిత్రాల్లో నటించిన రాధిక ఆరు నేషనల్ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్, ఓ నేషనల్ అవార్డ్, మూడు తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డులు, ఒక సినిమా ఎక్స్‌ప్రెస్ అవార్డుతో పాటు నంది అవార్డును అందుకున్నారు.

- పాలపర్తి సంధ్యారాణి

చెన్ సింక్ ఎక్కువగా బ్లాక్ అయిపోతోందా?

కిచెన్ సింక్ బ్లాక్ అవ్వడం అనేది చాలా మంది ఇళ్లల్లో ఎదురయ్యే సమస్య. గిన్నెలు తోమినప్పుడు మిగిలే వ్యర్థ పదార్థాలు సింక్‌లో ఇరుక్కుని నీరు పోకుండా బ్లాక్ అయిపోతుంది. పాత్రలు శుభ్రం చేసిన తర్వాత ఆహారం ఇరుక్కుపోవడం వల్ల లేదా సింక్ పరిశుభ్రంగా వాష్ చేయకపోవడం, పైపులో నాచు పేరుకుపోవడం



వంటివి జరుగుతాయి. దీనివల్ల అందులో నుంచి నీరు బయటకు పోదు. మీ కిచెన్ సింక్ కూడా పదేపదే బ్లాక్ అయిపోతూ ఉంటే కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు.

బేకింగ్ సోడా, వెనిగర్ కలిపి వాడితే ఆమ్ల చర్య జరుగుతుంది. ఇది మురికిని తొలగించటంలో బాగా పనిచేస్తుంది. కిచెన్ సింక్ మూసుకుపోయి అందులో చెత్త పేరుకుపోతే శుభ్రం చేయడానికి బేకింగ్ సోడా, వెనిగర్ మిక్స్ చేసి సింక్ రంధ్రంలో వేసి వదిలేయాలి. కొద్ది సేపటికే పైపు లోపల పేరుకుపోయిన చెత్త కరిగిపోవడం మొదలవుతుంది. పదినిమిషాల తర్వాత సింక్ లోపల నీళ్ల పోయాలి. ఇది కరిగిన మురికిని సింక్ నుంచి బయటకు తోసేస్తుంది.

నిమ్మకాయ, ఈనోతో

వంటగది సింక్‌ను శుభ్రం చేయడానికి నిమ్మకాయ, ఈనోను కూడా ఉపయోగించవచ్చు. ఈనో కూడా ఆమ్లంలాగే పనిచేస్తుంది. దీనిని నిమ్మకాయతో కలిపినప్పుడు ఆమ్ల ప్రతిచర్య ఉంటుంది, ఇది దుమ్ము, జిడ్డును శుభ్రపరుస్తుంది. నిమ్మకాయ, ఈనో మిశ్రమంతో సింక్ ను శుభ్రం చేయడం వల్ల పైపులో పేరుకుపోయిన మురికిని శుభ్రపరచడమే కాకుండా సింక్ లో పేరుకుపోయిన జిడ్డు వదులుతుంది. ఇది సింక్‌ను కొత్తగా, మెరిసేలా చేస్తుంది. మొదట ఈనో పౌడర్ ను ఒక గిన్నెలో వేయండి, ఇప్పుడు దాని పై నిమ్మరసం పిండండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని సింక్ లో వేసి స్క్రబ్బర్ సహాయంతో రుద్ది శుభ్రం చేసుకోవాలి. ఇది సింక్ ను పూర్తిగా శుభ్రపరుస్తుంది.

వెనక్కి తగ్గం

(మొదటిపేజీ తరువాయి)

టవర్ నిర్మాణ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మెకానికల్ లైఫ్, కాంక్రీట్ జంగిల్‌లో మనశ్శాంతిని వెతుక్కోవాల్సి వస్తుందనీ, అది ఇక్కడి హెరిటేజ్ టవర్‌లో లభిస్తుందని భావిస్తున్నానని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం ఈ నిర్మాణం అవసరమని అన్నారు. 430అడుగుల్లో అతి ఎత్తైన మందిరం ఉండటం రాష్ట్రానికి గర్వ కారణమనీ, 36-40 నెలల్లో దీన్ని పూర్తి చేసి, ఆ కార్యక్రమానికి కూడా తననే ఆహ్వానించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించేందుకు అక్షయపాత్ర సహకారాన్ని కోరామని తెలిపారు. విద్యా వైద్యం తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యతలనీ, ఆపదలో హైదరాబాద్‌కు వచ్చి, ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి, అన్నార్తులకు ఆహారాన్ని అందించాలని కోరారు. దీనికి సంబంధించి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దాతలు హరేకృష్ణ సంస్థకు సహకరించాలనీ, ఆ సొమ్ము ఆపదలో ఉండే ప్రజలకు తప్పకుండా చేరుతుందని తాను విశ్వసిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఛైర్మెన్ మధుపండిట్ స్వామీజీ, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెబనాన్‌పై బాంబుల వర్షం

బీరూట్: అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో ఇష్టానుసారంగా చెలరేగుతున్న ఇజ్రాయిల్‌లోని యూదు దురహంకార ప్రభుత్వం తాజాగా లెబనాన్‌పై పెద్దయెత్తున వైమానిక దాడులకు దిగింది. ఆదివారం తెల్లవారుజామున వందకుపైగా అమెరికా తయారీ యుద్ధ విమానాలతో లెబనాన్‌పై విరుచుకుపడింది. ఈ దాడిలో డజన్ల కొద్దీ జనం చనిపోయారు. పెద్దయెత్తున పంటలకు, ఆస్తులకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు వంటి పౌర మౌలిక సదుపాయాలు ధ్వంసమైనట్టు లెబనాన్ జాతీయ వార్తా సంస్థ తెలిపింది. ఇజ్రాయిల్ దుందుడుకు చర్య పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. ఇజ్రాయిల్ దాడులకు ప్రతీకారంగా హిజ్బుల్లాలు ఇజ్రాయిల్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని రాకెట్లతో దాడి చేశారు. దక్షిణ లెబనాన్ పట్టణం అల్‌తిరిపై జరిగిన దాడిలో ఇద్దరు, డ్రోన్ల దాడిలో మరొకరు చనిపోయారని, అనేక మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ అత్యవసర ఆపరేషన్ల కేంద్రం తెలిపింది. హిజ్బుల్లా కమాండర్ ఫాద్ షాక్రిని హత్య చేసిన ఇజ్రాయిల్‌పై ప్రతీకార దాడులు పెద్దయెత్తున ఉంటాయని లెబనీస్ ఇస్లామిక్ ప్రతిఘనా సంస్థ తెలిపింది. బీరూట్ దక్షిణ శివార్లలో యూదుల క్రూరమైన దాడికి ప్రతీకారంగా తమ బలగాలు ఇజ్రాయిల్‌పై దాడులు ప్రారంభించాయని హిజ్బుల్లాలు తెలిపారు. ఇజ్రాయిలీ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులను ముమ్మందు చేపడతామని ఆ సంస్థ తెలిపింది. మరో వైపు తాజా పరిస్థితిపై చర్చించేందుకు లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు.

యూ అంటే యూటర్న్

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్‌లో వెనక్కి తగ్గడం, వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపడం, లేటరల్ ఎంట్రీ నియామకాల ప్రకటనను రద్దు చేయడం...ఇవన్నీ ప్రజాశక్తికి నిదర్శనాలని తెలిపారు. ఈ నిరంకుశ పాలన నుండి 140 కోట్ల ప్రజలను కాపాడడం, ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించేలా చేయడం తమ కర్తవ్యమని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఖర్గే పోస్ట్ చేశారు. నూతన పెన్షన్ పథకం 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇందులో చేరితే ఆ సంఖ్య 90 లక్షలకు చేరుతుందని ఆయన తెలిపారు.

యూపీఎస్ పొలి'ట్రిక్స్'

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్‌పీఎస్) సంబంధించిన మౌలిక సంస్కరణల స్వరూపంలో ఈ కమిటీ ఎలాంటి మార్పులు చేయలేదు.ప్రస్తుత పెన్షన్ పథకంలో భాగంగా ఉద్యోగుల మూలవేతనంలో 14 శాతాన్ని కేంద్రం సమకూరుస్తోంది. ప్రభుత్వ వాటాను 18.5 శాతానికి పెంచి తద్వారా తమకు స్థిరమైన ఆదాయం, కుటుంబానికి భద్రత చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు చాలా కాలంగా కోరుతున్నారు. దీనిపై కమిటీ పరిశీలన జరిపింది. తమ వాటాగా మూలవేతనంలో జమ చేస్తున్న పది శాతాన్ని అలాగే కొనసాగించాలని కూడా ఉద్యోగులు కోరారు. వివిధ సంస్థలు, రాష్ట్రాలతో కమిటీ వందకు పైగా సమా వేశాలు నిర్వహించి, యూపీఎస్‌ను సిఫార్సు చేసింది.

ఆర్థిక భారం తప్పదు

నూతన పథకం అమలుతో ప్రభుత్వంపై మొదటి సంవత్సరం రూ.6,250 కోట్ల భారం పడుతుంది. 2004లో ఎన్‌పీఎస్ అమలులోకి వచ్చిన తర్వాత పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు రూ.800 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. రాజకీయ ప్రయోజనాలు ఆశించే మోడీ ప్రభుత్వం ఈ గ్యారంటీ పెన్షన్ పథకాన్ని తీసుకొచ్చిందని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో పాటు హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని వారు తెలిపారు.

ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే రాష్ట్రాలు కూడా కేంద్రాన్ని అనుసరించక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు పాత పెన్షన్ పథకానికి (ఓపీఎస్) స్వస్తి చెప్పాయి. కేంద్రం నిర్ణయంతో ఇప్పుడు పలు రాష్ట్రాలు కూడా తమ ఉద్యోగులకు యూపీఎస్‌ను అమలు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. కేంద్రం ఎలాగూ అదనపు ఆర్థిక భారాన్ని భరిస్తోంది కాబట్టి రాష్ట్రాలకూ అదనపు ఖర్చు తప్పదు. నూతన యూపీఎస్ పథకం ఉద్యోగులకు ప్రయోజనకరమే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపడం ఖాయంగా కన్పిస్తోంది.

తేడా ఏమిటి?

ఓపీఎస్, యూపీఎస్ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ వివరించారు. యూపీఎస్ కచ్చితంగా ఆర్థికంగా వివేకవంతమైన పథకమని ఆయన తెలిపారు. ఓపీఎస్‌కు ఎవరూ నిధులు సమకూర్చరు. కేంద్రం, ఉద్యోగుల భాగస్వామ్యం ఉండదు. యూపీఎస్‌కు నిధులు సమకూరుస్తారు. ప్రభుత్వం, ఉద్యోగులు తమ వాటాలను జమ చేస్తారు. పెన్షన్ హామీ ఇవ్వడమే దీనిలో ప్రధానమైన మార్పు. మార్కెట్ శక్తుల అస్థిరతల కారణంగా ఇబ్బందులు ఉండవు. రెండు పథకాలను పోలిస్తే యూపీఎస్ అత్యుత్తమమైనదని సోమనాథన్ వివరించారు.

ఓపీఎస్ కింద ప్రభుత్వోద్యోగులు తాము పొందిన చివరి నెల జీతంలో యాభై శాతాన్ని పదవీవిరమణ ప్రయోజనంగా పొందుతారు. 2004 జనవరి తర్వాత ఉద్యోగాలలో చేరిన వారికి ఎన్‌పీఎస్‌ను అమలు చేస్తున్నారు. ఇందులో ప్రభుత్వం, ఉద్యోగులు తమ వాటా మొత్తాన్ని జమ చేయాలి. అయితే ఆర్థిక ప్రయోజనాలు మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయి. తాజాగా ప్రభుత్వం తీసుకొస్తున్న యూపీఎస్‌లో ఓపీఎస్‌లో ఉన్న అంశాలే ఉంటాయి. పెన్షన్ గ్యారంటీ, ద్రవ్యోల్బణ సూచిక, కుటుంబ పెన్షన్, కనీస పెన్షన్...ఇవన్నీ ఉంటాయి. అయితే యూపీఎస్‌లో ప్రభుత్వం, ఉద్యోగుల భాగస్వామ్యం ఉంటుంది. ఇది పూర్తిగా నిధులు సమకూర్చే పథకం.

ఓపీఎస్‌పై ఆర్‌బీఐ ఆందోళన

గత సంవత్సరం కొన్ని రాష్ట్రాలు తిరిగి ఓపీఎస్ పథకాన్ని ప్రారంభించాయి. దీనిపై రిజర్వ్‌బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేస్తూ రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపింది. ఎన్‌పీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమలు చేయడం వల్ల రుణభారం పెరుగుతుందని, భవిష్యత్తులో ఇది ముప్పుగా పరిణమిస్తుందని చెప్పింది. 2022-23 బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్రాల పెన్షన్ వ్యయం 16 శాతం పెరిగి రూ.4,63,436 కోట్లకు చేరింది. అంతకుముందు సంవత్సరం ఈ ఖర్చు రూ.3,99,813 కోట్లుగా ఉంది. ఎన్‌పీఎస్ కింద నాలుగు లక్షల కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉంటుందని, ఓపీఎస్ అమలుతో అది రూ.17 లక్షల కోట్లకు చేరుతుందని ఆర్‌బీఐ తెలిపింది.

ఎన్‌పీఎస్‌పై ఉద్యోగుల వ్యతిరేకత

ఎన్‌పీఎస్‌ను ప్రభుతోద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎందుకంటే ఈ పథకంలో పెన్షన్ గ్యారంటీ ఉండదు. ఉద్యోగులు, ప్రభుత్వం తమ భాగస్వామ్య వాటాలు అందజేయాల్సి ఉంటుంది. ఉద్యోగుల వ్యతిరేకత నేపథ్యంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్ (2023లో), రాజస్థాన్ (2022లో), ఛత్తీస్‌గఢ్ (2022లో), పంజాబ్ (2022లో) తిరిగి ఓపీఎస్‌ను అమలు చేశాయి. త్వరలో జమ్మూకాశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను ప్రకటించడం ఓ ముఖ్యమైన రాజకీయ పరిణామంగా భావించవచ్చు.

ఎస్బీఐకి రూ.175 కోట్లు టోకరా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) పాతబస్తీ బ్రాంచ్ నుంచి ఏకంగా రూ.175 కోట్లను సైబర్ నేరస్తులు స్వాహా చేశారు. ఇందుకు కమీషన్లు తీసుకొని సహకరించిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు నేరస్తులను రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘరానా మోసానికి పాల్పడిన అసలు నిందితుల కోసం దర్యాప్తు సాగిస్తున్నామని సీఎస్‌బీ డైరెక్టర్‌తో పాటు రాష్ట్ర సీఐడీ డీజీపీ శికా గోయెల్ తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. పాతనగరంలోని షంషీర్‌గంజ్‌లో గల ఎస్బీఐ బ్రాంచ్‌లో నెల క్రితం విజయనగర కాలనీకి చెందిన షోయెబ్ తాఖీర్, మొఘల్‌పురాకు చెందిన మహ్మద్ బాజీర్‌లు కలిసి ఆరు ఖాతాలను తెరిచారు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్లు అయిన ఈ ఇద్దరు కూడా తమకు మధ్యవర్తులుగా వ్యవహరించిన సైబర్ నేరస్తుల సూచన మేరకు ఈ అకౌంట్లను ఆరుగురు వ్యక్తుల ద్వారా తెరిపించారు. వారంతా కూడా చిన్న జీతగాళ్లే. అనంతరం, సైబర్ నేరస్థుల సూచనల మేరకు ఈ ఆరు అకౌంట్లకు చెందిన ఖాతా నెంబర్లు, అవసరమైన పాస్‌బుక్‌ల జిరాక్స్‌లను పంపించారు. ఈ అకౌంట్ల సాయంతో గత 30 రోజుల్లో రూ.175 కోట్లను దారి మళ్లించారు.


ఈ విషయమై సమాచారమందుకున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తును ప్రారంభించగా.. ఈ ఆసక్తికరమైన అంశాలన్నీ బయటపడ్డాయి. ఇండోనేషియా, కంబోడియా, దుబాయ్ కేంద్రాలుగా పని చేస్తున్న సైబర్ నేరస్థులు ఈ భారీ మోసానికి పాల్పడినట్టు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో షంషీర్‌గంజ్ ఎస్బీఐ బ్రాంచ్‌లో ఆరు అకౌంట్లు తెరవటానికి కారకులైన సోయెబ్ తాఖీర్, మహ్మద్ బాజీర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి అకౌంట్లు తెరవటానికి సూత్రదారులు ఎవరు? అనేది తేల్చి, వారిని పట్టుకోవటానికి దర్యాప్తును ముమ్మరం చేశామని షికా గోయెల్ తెలిపారు. ఈ ఖాతాలను తెరవటానికి గానూ వీరికి కమీషన్లను కూడా సైబర్ నేరస్తులు చెల్లించారనీ, దానికి ఆశపడే ఈ నేరానికి వారు పాల్పడ్డారని ఆమె చెప్పారు. కాగా, ఈ డబ్బంతా కూడా క్రిప్టో కరెన్సీ రూపంలో తరలిపోయినట్టు తాము గుర్తించామని ఆమె తెలిపారు.

రైలుకు సవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

అనేక స్టేషన్‌లతో కూడిన విభాగాలుగా విభజించబడిందని, ఈ సెక్షన్ల మీదుగా నడుస్తున్న రైళ్లను కంట్రోల్ బోర్డ్‌లోని షిఫ్ట్ డ్యూటీలలో 24 గంటలూ పనిచేసే సెక్షన్ కంట్రోలర్‌లు నియంత్రిస్తారని, పర్యవేక్షిస్తారని తెలిపింది. అయితే వివిధ డివిజనల్ కంట్రోల్ కార్యాలయాల నుంచి డేటాను సేకరించి 15 శాతం నుంచి 24 శాతం వరకు ఖాళీలున్నట్టు గుర్తించింది."క్యాడర్‌లో అధిక ఖాళీలు సిబ్బంది పనితీరును ప్రభావితం చేస్తాయి. ఈ కఠినమైన పరిస్థితుల్లో పని నాణ్యత కూడా దెబ్బతింటుంది. సిబ్బంది మిగిలిన సెలవులను నిర్వహించడంలోనూ ఇబ్బందులను ఎదుర్కొంటారు. కాబట్టి, క్యాడర్‌లో ఖాళీల ప్రాధాన్యతపై విశ్లేషించి, ఖాళీలను భర్తీ చేయడానికి కృషి చేయాలి" అని నివేదిక పేర్కొంది. సెక్షన్ కంట్రోలర్‌లు 24/7 పని చేస్తారని, వారి షిఫ్టులను తగిన సంఖ్యలో ఉద్యోగులు లేకుండా నిర్వహించలేమని పేర్కొంది.రోస్టర్ ప్రకారం, సెక్షన్ కంట్రోలర్‌కు వారానికోసారి 30 గంటల విశ్రాంతి అవసరం. కానీ తగిన సంఖ్యలో సిబ్బంది లేకపోవడంతో, కొన్నిసార్లు సెక్షన్ కంట్రోలర్‌లకు సెలవులను ఇవ్వడంలో సమస్యలను అడ్మినిస్ట్రేషన్ ఎదుర్కొంటుంది. నిరంతర పని షెడ్యూల్‌లో వారు పని భారాన్ని మోయాల్సి వస్తుందోని, ఇది వారి శక్తిని ప్రభావితం చేస్తోందని నివేదిక తెలిపింది.ఫీడర్ కేటగిరీ అభ్యర్థులకు మరింత ఆకర్షణీయంగా ఉండేలా ప్రాథమిక వేతన స్కేల్‌ని గ్రేడ్ పే రూ.4,200 నుంచి గ్రేడ్ పే రూ.4,600కి అప్‌గ్రేడేషన్ చేయాలని, రిక్రూట్‌మెంట్/ సెలక్షన్‌లో ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రవేశపెట్టడం, శిక్షణ వ్యవధిని పొడిగించడం వంటి అనేక చర్యలను అధ్యయనం సూచించింది. 2020లో నిలిపివేసిన రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుతో సెక్షన్ కంట్రోలర్‌ల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని సూచించింది. పీరియాడికల్ రిఫ్రెషర్ కోర్సులు తీసుకోకుండా ఏ కంట్రోలర్‌ను పని చేయడానికి అనుమతించకూడదని తెలిపింది.

'డ్రగ్స్' పదం వింటేనే దడపుట్టాలి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో 'డ్రగ్స్' అనే పదం వింటేనే భయపడేలా నార్కోటిక్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ టీమ్‌ను మరింత సమర్థవంతంగా బలోపేతం చేస్తామన్నారు. యువత, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యతలని చెప్పారు. ఆదివారంనాడిక్కడి "బ్రహ్మ కుమారీస్ - శాంతి సరోవర్" ద్వి దశాబ్ది వేడుకల్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇరవై ఏండ్లలో గచ్చిబౌలి పెద్ద నగరంగా అభివృద్ధి చెందిందనీ, ఇక్కడే శాంతి సరోవర్ ఉండటం సంతోషం కలిగిస్తుందన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఎనిమిది నెలల్లోనే రూ.31 వేల కోట్లు రైతు రుణమాఫీ చేసి, రైతు ప్రభుత్వం అని నిరూపించుకున్నామని తెలిపారు. యువతకు వృత్తి నైపుణ్యాన్ని అందించేందుకు స్కిల్ యూనివర్సిటీనీ ప్రారంభిచామనీ, ముచ్చెర్లలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అక్కడే స్కిల్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బ్రహ్మకుమారీస్ తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శులనీ, శాంతి సరోవర్ కు ప్రభుత్వం అండగా ఉంటుందనీ, దాని లీజు రెన్యూవల్‌కు అన్నివిధాలా సహకరిస్తాంమని భరోసా ఇచ్చారు. మౌంట్ అబూ తర్వాత తెలంగాణలోనే శాంతి సరోవర్ ఉండటం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో రాజకీయ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

మీడియా సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ప్రతీకార రాజకీయాలకు తెర లేపిందని విమర్శించారు. "కాంగ్రెస్ కండువా కప్పుకోండి.. లేకుంటే ఇబ్బంది పెడతాం అన్నట్టు వ్యవహరిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు పెడుతున్నారు. పటాన్ చెరువు ఎమ్మెల్యేపై అక్రమ మైనింగ్ కేసులు పెట్టి రూ.300 కోట్ల పెనాల్టీ వేశారు. నానా ఇబ్బందులు పెట్టి కాంగ్రెస్ కండువా కప్పారు. ఆ పార్టీలో చేరగానే మైనింగ్ కేసు అటకెక్కింది. బీఆర్ఎస్ మరో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భయంభ్రాంతులకు గురి చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారు" అని హరీశ్ విమర్శించారు. రుణమాఫీని పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపించారు. "రాష్ట్రంలో అర్హులైన సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు. మంత్రులు రుణమాఫీ పైన కుంటిసాకులు చెప్పుతున్నారు. సాంకేతిక కారణాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. తక్షణమే రైతు భరోసా ఇవ్వడంతో పాటు వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయాలి" అని డిమాండ్ చేశారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యాతో ప్రజలు పిట్టల్లాగా రాలిపోతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని విమర్శించారు. "ప్రయివేటు అస్పత్రుల్లో బెడ్స్ కోసం రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. గతేడాదితో పోలిస్తే 36శాతం డెంగ్యూ కేసులు పెరిగాయి. ప్రభుత్వ దవాఖానాల్లో మందుల్లేవు. గాంధీ ఆస్పత్రిలో సాధారణ మందులు కూడా అందుబాటులో లేవు. వీటి నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు రేవంత్ సర్కార్ హైడ్రా నాటకమాడుతోంది" అని విమర్శించారు. నెలకు రూ. 8,125 కోట్ల చొప్పున ఎనిమిది నెలల్లో రూ. 65 వేల కోట్ల అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ అప్పు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పటికైనా హైడ్రా డ్రామాలు పక్కన పెట్టి అర్హులైన రైతులకు రుణమాఫీ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఒలింపిక్స్ నిర్వహణ, పతకాలే లక్ష్యం

గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతాం : ఎన్ఎండీసీ మారథాన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఒలింపిక్స్‌తో పాటు అంతర్జాతీయ క్రీడల్ని నిర్వహించే స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్‌ను రూపొందిస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీనికోసం గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్‌లో సకల సౌకర్యాలు కల్పించి, స్థానిక యువతకు క్రీడలపట్ల ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో జరిగిన హైదరాబాద్ మారథాన్-2024 బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారంనాడిక్కడి గచ్చిబౌలి స్టేడియంలో జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై, విజేతలకు బహుమతులు అందించి, మాట్లాడారు. క్రీడల్లో ఆదర్శంగా నిలవాల్సిన హైదారాబాద్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ స్థాయికి చేరుకోలేకపోయిందని విమర్శించారు. ఒలింపిక్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇక్కడి స్టేడియాలను తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రికి చెప్పామన్నారు. 2000 సంవత్సరంలో ఆఫ్రో ఏషియన్ గేమ్స్‌ను నిర్వహించుకున్నామనీ, ఆ తర్వాత ఆస్థాయి క్రీడలు తెలంగాణలో జరగలేదని చెప్పారు. క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు సిరాజ్‌కు ప్రభుత్వం తరఫున గ్రూప్-1 పోస్టు ఇచ్చామనీ, నిఖత్‌జరీన్‌కు గ్రూప్-1 పోస్టుతో పాటు రూ.2 కోట్లు ఇచ్చామని తెలిపారు. తెలంగాణ యువతను క్రీడలవైపు మళ్లిస్తూ, పూర్వవైభవం తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామనీ, ఒలంపిక్స్ నిర్వహణ, పతాకాలు సాధించడమే లక్ష్యంగా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి కోచ్‌లను తెచ్చి, క్రీడాకారులకు శిక్షణ ఇస్తామన్నారు. దీనికోసం పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సౌత్ కొరియన్ స్పోర్ట్స్ అథారిటీ ముందుకు వచ్చిందనీ, వారి భాగస్వామ్యంతోనే స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు వీ హనుమంతరావు, ఒలింపిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, శాట్ చైర్మెన్ శివసేనారెడ్డి, బాక్సర్ నిఖత్ జరీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రియాకు లక్ష్యసేన్

రెడ్‌బుల్ అకాడమీలో ఫిట్‌నెస్ మదింపు



బెంగళూర్ : పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ.. పి.వి సింధు నుంచి మెడల్ ఆశించగా.. మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్ పతకం దిశగా దూసుకెళ్లాడు. కాంస్య పతక మ్యాచ్‌లో పోరాడి ఓడి.. అడుగు దూరంలో ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ మెడల్‌కు దూరమయ్యాడు. పారిస్ ఒలింపిక్స్ ఓటమి నుంచి వేగంగా కోలుకుంటున్న లక్ష్యసేన్ ఈ సీజన్‌లో హాంగ్‌కాంగ్ సూపర్ 500, చైనా సూపర్ సిరీస్ 1000 టోర్నీలపై కన్నేశాడు. ఈ రెండు టోర్నమెంట్లలో టైటిల్‌పై గురిపెట్టిన లక్ష్యసేన్.. అంతకుముందు స్వీయ ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవటంపై దృష్టి సారించాడు. ఇందులో భాగంగా ఆదివారం ఆస్ట్రియాకు బయల్దేరాడు. అక్కడి రెడ్‌బుల్ అథ్లెట్ పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో లక్ష్యసేన్ ఫిట్‌నెస్ మదింపు జరుగనుంది. వారం రోజులు రెడ్‌బుల్ అకాడమీలో పరీక్షలకు వెళ్లనున్న లక్ష్యసేన్.. ఫిజికల్ ట్రైనింగ్, గేమ్ ఫిట్‌నెస్ మెరుగు పర్చుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు గాయాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడి నిపుణులతో సంప్రదింపులు జరుపనున్నాడు. ఈ మేరకు లక్ష్యసేన్ కోచ్ విమల్ కుమార్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. హాంగ్‌కాంగ్, చైనా సూపర్ సిరీస్‌లు సెప్టెంబర్‌లో జరుగనున్నాయి.

యువ చాంప్ తన్వీ

- అండర్-15 విజేతగా తన్వీ పత్రి
- ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్



చెంగ్డూ (చైనా) : వరుసగా మూడు ఒలింపిక్స్‌లో (2012, 2016, 2020) పతకాలు అందించిన బ్యాడ్మింటన్.. 2024 పారిస్‌లో నిరాశపరిచింది. అయినా, యువ తరం మెరుపు ప్రదర్శనలతో భవిష్యత్‌పై భరోసా కల్పిస్తుంది!. ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ (అండర్-15, అండర్-17)లో భారత యువ షట్లర్, 13 ఏండ్ల తన్వీ పత్రి చాంపియన్‌గా అవతరించింది. బాలికల అండర్-15 విభాగం సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో టాప్ సీడ్ తన్వీ పత్రి 22-20, 21-11తో వరుస గేముల్లో వియత్నాం షట్లర్‌ను చిత్తు చేసింది. టైటిల్ విజయం ప్రస్థానంలో ఐదు మ్యాచులు ఆడిన తన్వీ.. ప్రత్యర్థి షట్లర్లకు ఒక్క గేమ్‌ను సైతం కోల్పోకుండా పర్‌ఫెక్ట్ విజేతగా నిలిచింది. 34 నిమిషాల టైటిల్ పోరులో వియత్నాం షట్లర్ హ్యుయెన్ తొలి గేమ్‌లో 17-11తో ముందంజ వేసింది. వేగంగా పుంజుకున్న తన్వీ.. ప్రత్యర్థి పొరపాట్ల నుంచి సైతం పాయింట్లు దక్కించుకుంది. టైబ్రేకర్‌లో తొలి గేమ్‌ను సొంతం చేసుకుని ముందంజ వేసింది.

రెండో గేమ్‌లో తన్వీ ఆది నుంచి ఆధిపత్యం చూపించింది. 21-11తో అలవోకగా రెండో గేమ్‌ను, ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. గతంలో ఇమద్ ఫరూకీ, తస్నీమ్ మిర్‌లు భారత్ నుంచి ఆసియా జూనియర్ చాంపియన్లుగా నిలిచారు. ఈ జాబితాలోకి తాజాగా తన్వీ పత్రి చేరిపోయింది. అండర్-17 బాలుర విభాగంలో జ్ఞాన దత్తు సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

విప్లవ తరానికి ప్రొఫెసర్ సాయిబాబా గొప్ప స్ఫూర్తి

- సమావేశంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విప్లవ తరానికి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా గొప్ప స్ఫూర్తి అని పలువురు వక్తలు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని భారత్ కాలేజీలో ప్రొఫెసర్ హరగోపాల్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, కేంద్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఎం అన్వేశ్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ఎస్ వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు. మాటల్లో కాకుండా చేతల్లో ఎలా ఉండాలో ప్రత్యక్షంగా సాయిబాబా నిలిచారని తెలిపారు. రాజ్యాంగ యంత్రంలోని ప్రతి భాగం ఆయనపై కత్తికట్టిందనీ, అయినా ఆయన లక్ష్యం, ఆత్మస్థైర్యం ముందు ఓడిపోయాయని చెప్పారు. సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుని అందుకనుగుణంగా వ్యవహరించాలన్నారు.

సాయిబాబా మాట్లాడుతూ తప్పుడు కేసుల కారణంగా పదేండ్లు నాగ్‌పూర్ జైల్లో చిత్రహింసల కొలిమిలో మగ్గిపోయాననీ, తొమ్మిదేండ్లు తనను అండా సెల్లోనే (జైలు ఆవరణ లోపలి ప్రత్యేక జైలు)లో ఉంచారని తెలిపారు. ఇంత నిర్బంధం ఎదుర్కొన్నప్పటికీ తన ఉద్యమ పంథాను వీడననీ, అధ్యాపకుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు.



టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు డ్యురోవ్ అరెస్టు

- ఫ్రాన్స్ వెల్లడి
- విడిచిపెట్టాలన్న రష్యా

పారిస్: మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ రష్యన్ వ్యవస్థాపకుడు పావెల్ డ్యురోవ్ శనివారం ప్రైవేట్ జెట్‌లో పారిస్ చేరుకున్న వెంటనే ఫ్రెంచ్ పోలీసులు ఆయణ్ణి అరెస్టు చేశారు. .జన్మ స్థలం రష్యా అయినప్పటికీ, ఆయన యుఎఇ, సెయింట్ కిట్స్, నెవిస్ దేశాల పౌరసత్వం కలిగివున్నారు. 39 ఏళ్ల డ్యురోవ్ ఒక మహిళ, బాడీగార్డుతో కలసి విమానం దిగగానే ఫ్రెంచ్ పోలీసులు అరెస్టు వారెంటు చూపి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా , పిడోఫిలియా దాడులు, అక్రమాల కేసులో దర్యాప్తునకు సహకరించడం లేదన్న కారణంతో అరెస్టు చేసినట్లు ఫ్రెంచ్ మీడియా తెలిపింది. ఆదివారం సాయంత్రం ఆయను జడ్జి ముందు హాజరుపరిచారు. డ్యురోవ్‌పై మోపిన నేరాభియోగాల్లో దోషి అని తేలితే 20 ఏండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముందని ఫ్రెంచ్ బ్రాడ్‌కాస్టర్ పేర్కొంది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాను బలహీనపరిచేందుకు ఇయు పన్నుతున్న కుతంత్రాల్లో భాగమే డ్యురోవ్ అరెస్టు అని రష్యన్ మీడియా పేర్కొంది. డ్యురోవ అరెస్టుకు కారణాలు తెలపాలని పారిస్‌లోని రష్యన్ రాయబార కార్యాలయం డిమాండ్ చేశామని, దీనికి ఇంతవరకు ఎలాంటి సమాధానం రాలేదని సీనియర్ దౌత్యవేత్త ఒకరు తెలిపారు. రష్యన్ విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా మాట్లాడుతూ, డ్యురోవ్ అరెస్టు భావ ప్రకటనా స్వేచ్ఛ ఉల్లంఘన కిందికే వస్తుందని అన్నారు. దీనిపై హ్యూమన్ రైట్స్ వాచ్‌కు తాము ఫిర్యాదు చేశామన్నారు.

ఇంగ్లాండ్ అలవోకగా..

తొలి టెస్టులో 5 వికెట్లతో గెలుపు



మాంచెస్టర్ : శ్రీలంకతో తొలి టెస్టులో ఆతిథ్య ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 205 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జో రూట్ (62 నాటౌట్, 128 బంతుల్లో 2 ఫోర్లు), జేమీ స్మిత్ (39), హ్యారీ బ్రూక్ (32), డాన్ లారెన్స్(34) కీలక ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. 57.2 ఓవర్లలోనే లాంఛనం ముగించిన ఇంగ్లాండ్..మరో రోజు ఉండగానే విజయాన్ని అందుకుంది. శ్రీలంక వరుస ఇన్నింగ్స్‌ల్లో 236, 326 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ శతక హీరో జేమీ స్మిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యం సాధించింది.

పాక్‌పై బంగ్లాదేశ్ గెలుపు

- రావల్పిండి టెస్టులో ఆతిథ్య జట్టుకు షాక్



రావల్పిండి : బంగ్లాదేశ్ బెబ్బులి గర్జించింది. పాకిస్థాన్‌పై తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసింది. 14 టెస్టుల్లో పాకిస్థాన్‌పై విజయం కోసం పోరాడిన బంగ్లాదేశ్ చివరకు రావల్పిండిలో ఆ జట్టును చిత్తు చేసింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ఆధిపత్యం చూపించింది. 10 వికెట్ల తేడాతో తొలి టెస్టులో సూపర్ విక్టరీ సాధించింది. ముష్ఫికర్ రహీమ్ (191), మెహిది హసన్ (77), లిటన్ దాస్ (56), మోమినుల్ హాక్ (50), ఇస్లామ్ (93) మెరుపులతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 565 పరుగుల భారీ స్కోరు సాధించింది. అంతకుముందు పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 448/6 పరుగులకు ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. స్పిన్నర్లు మెహిది మిరాజ్ (4/21), షకిబ్ (3/44) మాయజాలంతో పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలింది. 30 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఓపెనర్లు 6.3 ఓవర్లలో ఊదేశారు. జాకిర్ హసన్(15), ఇస్లామ్ (9) అజేయ ఇన్నింగ్స్‌లతో మెరిశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ బాదిన ముష్ఫికర్ రహీమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0తో ఆధిక్యం సాధించింది.

అమ్మాయిలకు భంగపాటు

భారత్, ఆసీస్-ఏ అనధికార టెస్టు

గోల్డ్‌కోస్ట్ : భారత్-ఏ, ఆస్ట్రేలియా-ఏ మహిళల జట్ల ఏకైక అనధికారి టెస్టులో ఆతిథ్య ఆసీస్ అమ్మాయిలు పైచేయి సాధించారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత అమ్మాయిలకు భంగపాటు తప్పలేదు. ఆసీస్-ఏ వరుస ఇన్నింగ్స్‌ల్లో 212, 260 పరుగులు చేసింది. భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 184 పరుగులే చేసింది. 289 పరుగుల ఛేదనలో శుభా సతీశ్ (45), ప్రియా పూనియా (36), ఉమా చెత్రి (47), రఘ్వీ (26), సయాలి (21) మెరిసినా..92.5 ఓవర్లలో 243 పరుగులకే కథ ముగిసింది. 45 పరుగుల తేడాతో ఆసీస్-ఏ అమ్మాయిలు విజయం సాధించారు.



ఘనంగా సరిపోదా శనివారం ప్రీ రిలీజ్ వేడుక

నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ కాంబోలో రూపొందిన పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మించారు. ఈనెల 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక నోవాటెల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో 'సరిమప..' అంటూ సాగే ప్రమోషనల్ సాంగ్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ వేడుకలో దేవకట్టా, శ్రీకాంత్, సుధాకర్ చెరుకూరి, శైలేష్ కొలను, ప్రశాంత్ వర్మ, ఎస్.జె. సూర్య, ప్రియాంక అరుణ్ మోహన్, కెమెరామెన్ మురళీ, సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ తదితరులు పాల్గొన్నారు.

నాని మాట్లాడుతూ, 'వివేక్ ఏమి తీశాడో 29న మీకే తెలుస్తుంది. వివేక్ శివతాండవం ఈ సినిమాలో చూపించాడు. ఇది వివేక్‌కు మైల్ స్టోన్‌లా ఉంటుంది. మా నిర్మాత దానయ్యకి ఏ సినిమాకూ కథ తెలీయదు. లొకేషన్‌కు వచ్చి అన్నీ మీరే చూసుకోండని అంటారు. కానీ ఆయనకు అదృష్టం ఉంది. అందుకే 'సరిపోదా శనివారం, ఓజీ' లాంటి కథలు ఆయన్ను వెతుక్కుంటూ వస్తాయి. ఈనెల 29న పోతారు. అందరూ థియేటర్‌కు పోతారు. సినిమా చూస్తారు (నవ్వుతూ)' అని అన్నారు

"అంటే సుందరానికి' మిక్స్ టాక్ వచ్చింది. దాంతో ఏ తరహా సినిమా చేయాలో అర్థం కాలేదు. నాని నాకు ఛాన్స్ ఇచ్చారు. అందుకే థ్యాంక్స్ చెబితే సరిపోదు అనుకుని, ఆయనకు నాపై ఉన్న నమ్మకానికి ఈ సినిమా ఇచ్చా. అలాగే ఇతర నటీనటులు కూడా బాగా కుదిరారు. అందరూ రైటింగ్ బాగుందని అంటున్నారు' అని దర్శకుడు వివేక్ ఆత్రేయ చెప్పారు. నిర్మాత డివివి దానయ్య మాట్లాడుతూ, 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు టెన్షన్ ఉండదు. నాని ఇంకా పెద్ద స్థాయికి చేరుకోవాలి. వివేక్ పెద్ద దర్శకుడు కోవలో చేరతారు' అని తెలిపారు. 'ఇది చాలా మంచి మూవీ. అందరూ చూసి ఎంకరేజ్ చేయండి. వివేక్ ఆత్రేయ రచన భిన్నమైంది. ఇటువంటి రచయితలను అరుదుగా చూస్తుంటాం. ఒక రకమైన యాక్షన్ సినిమాను విభిన్నంగా మలిచారు' అని ఎస్.జె. సూర్య చెప్పారు. కథానాయిక ప్రియాంక అరుల్ మోహన్ మాట్లాడుతూ,'నాకు ఇది స్పెషల్ సినిమా. దానయ్య నాకు ఓజి. సినిమాలో కూడా అవకాశం కల్పించారు. నా కెరీర్‌లో ఈ రెండూ చాలా ఇంపార్టెంట్. ఇందులో వివేక్ మంచి పాత్ర ఇచ్చారు' అని అన్నారు.



రిషిత, చిమటా రమేష్‌బాబు

ఆద్యంతం అలరించే సినిమా

చిమటా ప్రొడక్షన్స్ పతాకంపై చిమటా రమేష్ బాబు దర్శకుడిగా పరిచయం అవుతూనే హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లుగా చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మిస్తున్నారు.


అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సందర్భంగా దర్శకుడు, హీరో రమేష్ బాబు మాట్లాడుతూ, 'ఈ కథకు దర్శకుడిగా, హీరోగా నేనైతేనే పూర్తి న్యాయం చేయగలనిపించింది. నా నిర్ణయాన్ని అమెరికాలో ఉంటున్న మా సోదరి సమర్థించి, అన్ని విధాలా సహాయసహకారాలు అందించింది. దర్శకుడుగా, హీరోగా నాకు చాలా మంచి పేరు తెస్తుందనే నమ్మకం నాకుంది. ఈనెల 30న విడుదలవుతున్న ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందనడంలో సందేహాలకు తావులేదు. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతోపాటు ఆరు రోప్ ఫైట్స్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి. రెండున్నర గంటలపాటు నాన్ స్టాప్ ఎంటర్టైన్ చేసే మల్టీ జోనర్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని చెప్పారు.

'ఇందులో నటిస్తుండగానే మరో ఐదు సినిమాలు నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. ఈ చిత్రం హీరోయిన్‌గా నా కెరీర్‌కి శుభారంభం ఇస్తుందనే నమ్మకం నాకు ఉంది' అని నాయిక రిషిత అన్నారు.

నవచిత్రం

నవ్వించే సారంగపాణి జాతకం



ప్రియదర్శి

శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి కాంబినేషన్‌లో ఇదివరకే 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' లాంటి చక్కటి విజయవంతమైన సినిమాలు వచ్చాయి. తాజాగా వాళ్లిద్దరి కలయికలో ప్రియదర్శి కథానాయకుడిగా మరో చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాకు 'సారంగపాణి జాతకం' అనే టైటిల్ ఖరారు చేయగా, ఆదివారం టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ,'మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. ప్రారంభం నుంచి ముగింపు వరకు నవ్వించే ఓ పూర్తి స్థాయి జంధ్యాల తరహా వినోదాత్మక సినిమా ఇది. మోహనకృష్ణ ఇంద్రగంటి ఈ కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఆయనతో మా సంస్థలో మూడో చిత్రమిది. ప్రియదర్శి, 'వెన్నెల' కిశోర్, వైవా హర్ష, నరేష్ విజయకృష్ణ, తనికెళ్ళ భరణి, శ్రీనివాస్ అవసరాల వంటి హేమాహేమీలు ఈ కథలో భాగం అయ్యారు. హీరోయిన్ రూప కొడువాయూర్, వడ్లమాని శ్రీనివాస్, రూపాలక్ష్మి, కల్పలత కూడా మంచి పాత్రలు చేశారు. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది. ఇందులో నాలుగు పాటలు ఉన్నాయి. వివేక్ సాగర్ అద్భుతమైన బాణీలు అందించారు. 90 శాతం చిత్రీకరణ పూర్తి అయ్యింది. హైదరాబాద్, రామోజీ ఫిల్మ్ సిటీ, విశాఖలో ఇప్పటి వరకు నాలుగు షెడ్యూల్స్ పూర్తి చేశాం. నేటి నుండి సెప్టెంబరు 5 వరకు రెండు పాటలు, మిగతా సన్నివేశాలు చిత్రీకరణతో సినిమాని పూర్తి చేస్తున్నాం' అని అన్నారు.

'నమ్మకం మనిషికి బలాన్ని ఇస్తుంది. కానీ, మూఢ నమ్మకం బుద్ధిమంతుడిని కూడా బలహీనుడిని చేసి నవ్వుల పాలు చేస్తుంది. అలా నవ్వుల పాలైన ఓ మధ్య తరగతి మంచి అబ్బాయి కథే ఈ సినిమా. తన నమ్మకం, తను ఇష్టపడిన అమ్మాయి ప్రేమ మధ్య కొట్టుమిట్టాడి రెండింటికి చెడ్డ రేవడయిపోయాడా? లేదా బయట పడ్డాడా? అనే కథాంశాన్ని ఉత్కంఠభరితంగా కడుపుబ్బా నవ్వించే హాస్యంతో చెప్పాం. హీరో పాత్రలోని భావోద్వేగాలను, వినోదాన్ని ప్రియదర్శి తనదైన శైలిలో పండించారు' అని దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి చెప్పారు.

టీఎఫ్ఐ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా

అమ్మిరాజు కానుమల్లి విజయం



అమ్మిరాజు కానుమల్లి

తెలుగు చిత్ర పరిశ్రమలోని 24 క్రాఫ్టులకు చెందిన ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు కానుమల్లి విజయం సాధించారు. ఆదివారం జరిగిన కార్యదర్శి ఎన్నికల్లో అమ్మిరాజు 35 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇంతకుముందు ఈ పోస్ట్‌లో దొరై ఉండేవారు. ఇటీవలే జరిగిన మేనేజర్స్ ఎన్నికల్లో దొరై ఓడిపోయారు. నిబంధనల ప్రకారం ఆయన ఈ ఫెడరేషన్ పోస్ట్‌కు అనర్హుడు కావడంతో ఈ పోస్ట్‌కు ఎన్నిక అనివార్యం అయింది. కాగా, ఫెడరేషన్ కార్యదర్శిగా వెల్లంకి శ్రీనివాస్, వెంకట్ కృష్ణ కూడా పోటీచేయగా, అమ్మిరాజు 35 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందడం విశేషం.

దీనితో ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా అనిల్‌కుమార్ వల్లభనేని, కార్యదర్శిగా అమ్మిరాజు, కోశాధికారిగా సురేష్ ఉన్నారు.

ఈ సందర్భంగా ప్రెసిడెంట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, '24 శాఖలకు చెందిన ఫెడరేషన్‌లో కార్యదర్శి ఎన్నిక అనివార్యం అయింది. అమ్మిరాజు కార్యదర్శిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉంది. ఇండస్ట్రీకి 24 క్రాఫ్ట్లు కీలకం. కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం' అని అన్నారు. తనను కార్యదర్శిగా ఎన్నుకున్న సభ్యులకు అమ్మిరాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు అండగా ఉంటానని ఆయన అన్నారు.



ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ

ఎంఎంఆర్ ఆర్ట్ క్రియేషన్స్ ప్రొడక్షన్ పతాకంపై కిరణ్ దర్శకత్వంలో మంద మల్లి కార్జున రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ'. ఈ సినిమా ఆదివారం రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైంది.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కిరణ్, ప్రొడ్యూసర్ మంద మల్లికార్జున రెడ్డి, హీరో శ్యామ్ షెల్వన్, హీరోయిన్స హాన్విక, రితిక, గ్రీష్మ హీరోయిన్ ఎస్తేర్, డీవోపీ గాజుల శివ, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, భాస్కర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మోహన్ కృష్ణ, లిరికల్ రైటర్ రాము కుంభగిరి తదితరులు పాల్గొన్నారు. జీఎల్ ఫణి కాంత్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ప్రొడ్యూసర్ మంద మల్లికార్జున రెడ్డి క్లాప్ కొట్టారు.ఈ సందర్భంగా డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ, 'లవ్ స్టోరీతో పాటు మంచి మెసేజ్ కూడా ఇందులో ఉంటుంది. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు.

'ఇది చాలా మంది కథ. ఈ చిత్రం కచ్చితంగా ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. సెప్టెంబర్ ఫస్ట్ నుంచి రెగ్యులర్ చిత్రీకరణ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనున్నాం' అని నిర్మాత మంద మల్లికార్జునరెడ్డి చెప్పారు.

రాజా మార్కండేయ



అక్షయ రోమి, తేజస్ వీరమాచినేని

బన్నీ అశ్వంత్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీ జగన్మాత రేణుక క్రియేషన్స్ పతాకంపై శ్రీధర్ సామా - వెంకట్ గౌడ్ పంజాల సంయుక్తంగా ప్రొడక్షన్ నెం.1గా నిర్మిస్తున్న చిత్ర టైటిల్ ప్రకటన, లోగో విడుదల కార్యక్రమం ఫిల్మ్ ఛాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో ఘనంగా జరిగింది.

'రాజా మార్కండేయ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రానికి 'వేట మొదలైంది' అన్నది ట్యాగ్‌లైన్. తేజస్ వీరమాచినేని - అక్షయ రోమి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస్ గౌరిశెట్టి - బన్నీ అశ్వంత్ సహ నిర్మాతలు. సుమన్ ముఖ్య అతిధిగా, నిర్మాతలు ప్రతాని రామకృష్ణ గౌడ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వైశ్య ప్రముఖులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, గంగపురం పద్మగౌడ్, నవీన్ మాచర్ల విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కంటెంట్ బాగుంటే... చిన్న చిత్రాలు కూడా కోట్లు కొల్లగొడుతున్నాయని, ఆ చిత్రాల కోవలో ఈ సినిమా కూడా చేరాలని సుమన్ ఆకాంక్షించారు. సినిమా చిత్రీకరణ 90 శాతం పూర్తయిందని, ఈ సినిమా కచ్చితంగా సంచలన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని దర్శక, నిర్మాతలు వ్యక్తం చేశారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.